www.vishalabharati.com
epaper.vishalabharati.com

ఆదివారం, హైదరాబాద్
06 ఆగస్టు 2026
సంపుటి:4 సంచిక: 241

# విశాల భారతి

తెలుగు దినపత్రిక

## ఫీజుల నియంత్రణ చట్టం ఇంకెప్పుడు?



- ఫీజుల నియంత్రణ చట్టం తేవాలని కవిత డిమాండ్
- 2024 హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవాలని ప్రశ్న
- కార్పొరేట్ స్కూళ్ల ఫీజుల పెంపుపై ఆగ్రహం
- హెచ్‌పీఎస్ ఫీజుల పెంపుపైనా నిలదీత
- జీవో ఎంఎస్ 01 అమలుపై ప్రభుత్వాన్ని ప్రశ్న
- విఫలమైతే తల్లిదండ్రులతో ప్రజాపోరాటం

02

## కేసీఆర్ కాదు.. రేవంత్ రాజీనామా చేయాలి

- రేవంత్ రాజీనామా చేయాలన్న కేటీఆర్.. కేసీఆర్‌పై కాంగ్రెస్ డిమాండ్‌కు కౌంటర్
- యువత శక్తిపై ఘాటు హెచ్చరిక.. ఉద్యోగాల హామీపై ప్రశ్నలు
- మంత్రుల మధ్య విభేదాలపై విమర్శ.. యువ ఓటర్లే కీలకమన్న కేటీఆర్




**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**
కరీంనగర్‌లో జరిగిన జెన్ జీ సదస్సులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో యువతకు ఇచ్చిన హామీలు అమలు కాలేదని ఆరోపించారు. కేసీఆర్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలంటూ కాంగ్రెస్ నేతలు చేస్తున్న డిమాండ్‌ను ఆయన తప్పుబట్టారు. తెలంగాణ సాధనలో కేసీఆర్ పాత్రను గుర్తుచేస్తూ, ప్రస్తుతం ఆయనను టార్గెట్ చేయడం రాజకీయ ధైర్యం కాదని వ్యాఖ్యానించారు. తన ప్రసంగంలో కేటీఆర్ ఘాటు పదజాలంతో ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. యువతకు భవిష్యత్తు అవకాశాలు కల్పించడంలో కాంగ్రెస్ వైఫల్యాన్ని ప్రశ్నిస్తూ, ప్రజలు పరిస్థితులను గమనించాలని పిలుపునిచ్చారు. ఎన్నికల ముందు ఇచ్చిన మాటలకు ప్రస్తుత మిగతా 3లో..

## భూముల దొంగలెవరు?



- అసెంబ్లీ సమావేశాలకు సర్వం సిద్ధం
- 22-ఏ భూములపై ప్రత్యేక చర్చ
- బీఆర్ఎస్ టార్గెట్‌లో ఫీజు రీయింబర్స్‌మెంట్
- యూరియా, కరెంట్ కొరతపై ప్రశ్నలు
- కాంగ్రెస్ క్లియర్ చేసినవి 23,136 ఎకరాలు
- ధరణి భూముల లెక్కలు సభలో?

03



నకిరేకల్ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పిల్లి శాపనార్థాలకు ఉట్టి తెగిపడదంటూ కేసీఆర్ విమర్శలకు ఘాటు సమాధానం ఇచ్చారు. నిరుద్యోగ యువతను గత ప్రభుత్వం నిలువునా మోసం చేసిందని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమానికి నిరుద్యోగుల పోరాటమే ప్రధాన బలమని గుర్తుచేశారు. 1200 మంది యువకులు ఆత్మబలిదానాలు చేసుకున్న తర్వాత రాష్ట్రం ఏర్పడిందన్నారు. అమరుడు శ్రీకాంతాచారి తల్లి పరిస్థితిని ప్రస్తావిస్తూ గత పదేళ్ల పాలనపై ప్రశ్నలు సంధించారు. శంకరమ్మకు తగిన గౌరవం దక్కిందా అని నిలదీశారు. నిరుద్యోగుల ఉసురు తగిలే గత ప్రభుత్వం కుప్పకూలిందని వ్యాఖ్యానించారు. ఇప్పుడు ఫామ్ హౌస్ కు పరిమితమైన నాయకత్వం శాపనార్థాలు పెడుతోందని ఎద్దేవా చేశారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, గత పాలనను మరిచిపోలేదని స్పష్టం చేశారు. ప్రజా ఉద్యమ త్యాగాలను రాజకీయ లాభాల కోసం ఉపయోగించుకోవడం కాదని, అమరుల కుటుంబాలకు గౌరవం కల్పించాల్సిన బాధ్యత ప్రతి ప్రభుత్వానిదని అన్నారు.

# పిల్లి శాపనార్థాలకు ఉట్టి తెగదు

### కేసీఆర్‌పై రేవంత్ తీవ్ర విమర్శలు

- పిల్లి శాపనార్థాలపై ఘాటు వ్యాఖ్యలు
- నిరుద్యోగుల మోసంపై మండిపాటు
- తొలి ఏడాదిలో 70 వేల ఉద్యోగాలు
- కేసీఆర్‌కు అసెంబ్లీకి రావాలని సవాల్
- గజ్వేల్‌లో తేల్చుకుందామన్న సీఎం



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**
నకిరేకల్ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పిల్లి శాపనార్థాలకు ఉట్టి తెగిపడదంటూ కేసీఆర్ విమర్శలకు ఘాటు సమాధానం ఇచ్చారు. నిరుద్యోగ యువతను గత ప్రభుత్వం నిలువునా మోసం చేసిందని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమానికి నిరుద్యోగుల పోరాటమే ప్రధాన బలమని గుర్తుచేశారు. 1200 మంది యువకులు ఆత్మబలిదానాలు చేసుకున్న తర్వాత రాష్ట్రం ఏర్పడిందన్నారు. అమరుడు శ్రీకాంతాచారి తల్లి పరిస్థితిని ప్రస్తావిస్తూ గత పదేళ్ల పాలనపై ప్రశ్నలు సంధించారు. శంకరమ్మకు తగిన గౌరవం దక్కిందా అని నిలదీశారు. నిరుద్యోగుల ఉసురు తగిలే గత ప్రభుత్వం కుప్పకూలిందని వ్యాఖ్యానించారు. ఇప్పుడు ఫామ్ హౌస్ కు పరిమితమైన నాయకత్వం శాపనార్థాలు పెడుతోందని ఎద్దేవా చేశారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, గత పాలనను మరిచిపోలేదని స్పష్టం చేశారు. ప్రజా ఉద్యమ త్యాగాలను రాజకీయ లాభాల కోసం ఉపయోగించుకోవడం కాదని, అమరుల మిగతా 2లో..




## రేవంత్‌ను గద్దె దించేదాకా వదలం

- 60 లక్షల ఎకరాలు 22ఏలో?
- రేవంత్‌పై కిషన్‌రెడ్డి ఫైర్
- ఈటల రాజేందర్ తీవ్ర ఆరోపణలు
- నర్సాపూర్‌లో 55 వేల మంది బాధితులు
- హైడ్రా చర్యలపై బీజేపీ ఆగ్రహం
- రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి పిలుపు

03




## కొత్త జీడీపీలో బిగ్ ట్విస్ట్..!

- 2026–27 తొలి త్రైమాసికంలో నిజమైన జీడీపీ వృద్ధి 7.8శాతం
- ప్రస్తుత ధరల జీడీపీ రూ. 88.27 లక్షల కోట్లు
- గత ఏడాది అంచనాలో రూ.6.05 లక్షల కోట్ల భారీ సవరణ
- పాత, కొత్త సిరీస్‌లను కలిపి 2.6శాతం వృద్ధి అనడం సరికాదు
- తయారీ రంగం ధర సూచీ -1.5శాతం
- వృద్ధి, ఉద్యోగాలు, ఆదాయాల్లో ఎంత కనిపిస్తోంది?

02



మిస్ వరల్డ్ 2026 విజేతగా
## డొమినికన్ అమ్మాయి

- డొమినికన్ రిపబ్లిక్ సుందరి జోహెర్రీ డొమింగ్వెజ్ కిరీటం కైవసం
- వియత్నాంలో జరిగిన 73వ ప్రపంచ సుందరి పోటీలు
- భారత్ అందాలభామ నికితా పోర్వాల్‌కు టాప్ 20లో చోటు దక్కని వైనం

02

## నిజామాబాద్‌కు మంత్రి బెర్త్ వస్తుందా?

- ఉమ్మడి నిజామాబాద్‌కు మరోసారి మంత్రి పదవి దక్కలేదు
- సుదర్శన్ రెడ్డికి మంత్రి పదవికి బదులు సలహాదారు బాధ్యతలు
- మహేష్ గౌడ్ పేరు ముందంజలో ఉన్నట్టు చర్చ
- మదన్ మోహన్ రావు కూడా మంత్రి పదవిపై ఆశలు
- బీసీ సమీకరణం కీలకంగా మారే అవకాశం
- మహేష్ గౌడ్ వ్యాఖ్యలతో మరింత పెరిగిన ఉత్కంఠ

02






# రెండేళ్లు టైమ్ ఇవ్వండి!

- విద్యాభివృద్ధిలో టాప్ గేర్.. 88 వేల కొత్త విద్యార్థులు
- 10,006 టీచర్ పోస్టులు భర్తీ.. 25,950 మందికి ప్రమోషన్లు
- 34 వేలకుపైగా బదిలీలు.. రికార్డు స్థాయిలో ప్రమోషన్లు, పోస్టింగ్‌లు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** తరగతి గదిలో బోధన నాణ్యత పెరిగితే రాష్ట్ర భవిష్యత్తు మరింత బలపడుతుందని సీఎం అభిప్రాయపడ్డారు. ప్రతి మండలంలో విద్యా ప్రమాణాలు మెరుగుపడేలా పర్యవేక్షణ పెంచాలని, ఫలితాల ఆధారంగా అవసరమైన మార్పులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఉపాధ్యాయుల సృజనాత్మకతకు ప్రోత్సాహం లభిస్తే తరగతులు మరింత ఆసక్తికరంగా మారతాయని చెప్పారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు ఎడ్యుకేషన్ కమిషన్ ఏర్పాటు చేసినట్లు రేవంత్ రెడ్డి చెప్పారు. అధికారంలోకి వచ్చిన 55 రోజుల్లో మెగా డీఎస్సీ నిర్వహించి 10,006 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేశామని గుర్తుచేశారు. 25,950 మందికి పదోన్నతులు కల్పించామని, 34 వేల మందికి పైగా బదిలీలు పూర్తి చేశామని వివరించారు. చాలాకాలంగా వివాదంగా ఉన్న 317 జీవో సమస్యను పరిష్కరించినట్లు వెల్లడించారు. ఉద్యోగుల ఇబ్బందులు తగ్గించే దిశగా పరిపాలన కొనసాగుతోందని పేర్కొన్నారు. ఉపాధ్యాయులకు కెరీర్ పురోగతి, సరైన పోస్టింగ్, పని వాతావరణం అందితే విద్యార్థులపై దాని ప్రభావం స్పష్టంగా కనిపిస్తుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంలో టీచర్ల పాత్ర అత్యంత కీలకమని చెప్పారు. మిగతా 2లో..

తెలంగాణ విద్యావ్యవస్థను దేశానికే దిక్సూచిగా మార్చాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉపాధ్యాయులకు కీలక పిలుపునిచ్చారు. కొడంగల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న సీఎం, విద్యారంగంలో వచ్చిన మార్పులను వివరించారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తరువాత రాష్ట్ర విద్యాభివృద్ధి ర్యాంకు 28వ స్థానం నుంచి 17వ స్థానానికి చేరిందని తెలిపారు. రెండేళ్ల వ్యవధిలో ప్రభుత్వ పాఠశాలల్లో 88 వేల మంది విద్యార్థుల సంఖ్య పెరగడం టీచర్ల అంకితభావానికి నిదర్శనమన్నారు. పాలిటెక్నిక్ కళాశాలల్లో 95 శాతం ప్రవేశాలు పూర్తయ్యాయని, సాంకేతిక విద్యకు మంచి ఆదరణ కనిపిస్తోందని చెప్పారు. ప్రభుత్వ బడులపై తల్లిదండ్రుల్లో నమ్మకం పెరగడం, విద్యార్థుల చేరికలు అధికం కావడం సానుకూల పరిణామాలుగా పేర్కొన్నారు.



## రాజగోపాల్ రెడ్డి రూట్ మారిందా?

- రేవంత్‌తో విభేదాలపై రాజగోపాల్‌రెడ్డి క్లారిటీ
- వ్యక్తిగత దూషణ చేయలేదన్న ఎమ్మెల్యే
- మునుగోడుకు సమానంగా నిధులపై హర్షం
- కార్యకర్తలకు అన్యాయం వద్దన్న నేత
- మంత్రి పదవిపై అధిష్ఠానం నిర్ణయమే ఫైనల్
- కేబినెట్ విస్తరణపై పెరిగిన ఉత్కంఠ

03

# నిజామాబాద్‌కు మంత్రి బెర్త్ వస్తుందా?

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

కాంగ్రెస్ ప్రభుత్వ మంత్రివర్గంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు మరోసారి నిరాశ ఎదురైంది. పునర్ వ్యవస్థీకరణపై చర్చ మొదలైన ప్రతిసారీ ఈ ప్రాంతానికి మంత్రి పదవి దక్కుతుందనే అంచనాలు వినిపిస్తాయి. తాజా పరిణామాల్లో మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డికి బెర్త్ ఖాయమని పార్టీ వర్గాలు భావించినా, చివరి దశలో ఆయనకు అవకాశం రాలేదు. ఆశించిన పదవికి బదులుగా ప్రభుత్వ సలహాదారు బాధ్యతలు అప్పగించడం రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది. దీంతో జిల్లాకు ప్రాతినిధ్యం ఎప్పుడు లభిస్తుందన్న ప్రశ్న మళ్లీ తెరపైకి వచ్చింది. సుదర్శన్ రెడ్డి అనుభవం, సీనారిటీ ఉన్న నేతగా గుర్తింపు పొందినా సామాజిక సమీకరణాలు ఆయనకు అనుకూలించలేదన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఇప్పుడు కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తొలగించిన నేపథ్యంలో ఉమ్మడి జిల్లాకు అవకాశం ఇవ్వాలన్న డిమాండ్ కాంగ్రెస్ కేడర్‌లో బలపడుతోంది. దీంతో తదుపరి ఎంపికపై ఆసక్తి పెరిగింది. ఈ అంశంపై జిల్లా నాయకులు అధిష్ఠానం వైఖరిని ఆసక్తిగా గమనిస్తున్నారు. ఆశావహులు తమ స్థాయిలో ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. తుది నిర్ణయం కోసం కేడర్ ప్రస్తుతం ఎదురుచూస్తోంది. కొత్తగా చర్చలోకి వచ్చిన పేర్లలో పీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్ ముందంజలో ఉన్నట్టు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. గౌడ సామాజికవర్గానికి చెందిన ఆయన బీసీ నేతగా గుర్తింపు పొందారు. కాంగ్రెస్‌కు విధేయంగా పనిచేసిన నాయకుడిగా, రాష్ట్ర పార్టీ అధ్యక్షుడిగా ఆయనకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు ప్రాతినిధ్యం ఇవ్వాలన్న నిర్ణయం తీసుకుంటే మహేష్‌గౌడ్ ఎంపిక సామాజిక సమతుల్యతకు ఉపయోగపడుతుందన్న వాదన వినిపిస్తోంది. పార్టీ సంస్థాగత వ్యవహారాలపై ఆయనకు ఉన్నపట్టు కూడా అదనపు బలంగా భావిస్తున్నారు. సుదర్శన్ రెడ్డి విషయంలో వచ్చిన పరిణామాల తర్వాత బీసీ సమీకరణాలకు ప్రాధాన్యం పెరిగిందన్న చర్చ ఉంది. అందుకే ప్రస్తుత పరిస్థితుల్లో మహేష్‌గౌడ్ పేరు సహజంగానే ముందుకు వస్తోంది. అయితే ఆయనకు మంత్రి పదవి నిజంగా కావాలా, లేక పార్టీ అధ్యక్ష బాధ్యతలకే పరిమితం అవుతారా అన్నది ఇంకా స్పష్టతకు రాలేదు. ఈ అంశమే ఉత్కంఠ పెంచుతోంది. ఈ పరిణామాలపై నాయకుల్లో ఆసక్తి పెరిగింది. మదన్ మోహన్ వర్గం అవకాశంపై ఆశాభావంతో ఉంది. మహేష్‌గౌడ్ తర్వాత కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు పేరు కూడా పరిశీలనలో ఉన్నట్టు సమాచారం. తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన ఆయనకు పార్టీ అగ్రనాయకత్వంతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. ముఖ్యంగా రాహుల్ గాంధీతో ఉన్న అనుబంధాన్ని రాజకీయంగా తన బలంగా మదన్ మోహన్ ఉపయోగించుకుంటున్నట్టు ప్రచారం సాగుతోంది. గతంలో ఢిల్లీ స్థాయిలో మంత్రి పదవి కోసం ప్రయత్నాలు చేసిన ఆయన, తాజా పరిణామాల నేపథ్యంలో మరోసారి లాబీయింగ్ పెంచినట్టు తెలుస్తోంది. యువ నాయకత్వానికి ప్రాధాన్యం ఇవ్వాలన్న ఆలోచన ఉంటే తనకు అవకాశం రావచ్చని ఆయన వర్గం ఆశిస్తోంది. అయితే సీనియారిటీ, సామాజిక సమీకరణాలు, పార్టీ అధ్యక్షుడి పదవి వంటి అంశాలు మహేష్‌గౌడ్‌కు అనుకూలంగా మారవచ్చు. దీంతో ఇద్దరి మధ్య పోటీ ఎలా రూపుదిద్దుకుంటుందన్నది ఆసక్తికరంగా మారింది. చివరి నిర్ణయం అధిష్ఠానం వ్యూహంపైనే ఆధారపడనుంది. జిల్లాలోని పార్టీ శ్రేణులు కూడా పరిణామాలను నిశితంగా గమనిస్తున్నాయి. ఈ పరిణామం రాజకీయ చర్చకు ఊపు తీసుకొచ్చింది. కేడర్ నిర్ణయాన్ని గమనించింది. ఇదిలా ఉంటే మహేష్ గౌడ్ చేసిన తాజా వ్యాఖ్యలు మంత్రి పదవి చర్చకు మరింత సస్పెన్స్ జోడించాయి. కొండా సురేఖ స్థానాన్ని బీసీ నేతతో భర్తీ చేస్తామని చెబితే, తనలాంటి వారితో భర్తీ చేయడాన్ని అంగీకరించనని ఆయన ఒక టీవీ ఇంటర్వ్యూలో వ్యాఖ్యానించారు. ఈ మాటలను కొందరు ఆయన మంత్రి పదవిపై ఆసక్తి చూపడం లేదన్న సంకేతంగా చూస్తున్నారు. మరికొందరు మాత్రం రాజకీయ పరిస్థితిపై తన అభిప్రాయాన్ని మాత్రమే వెల్లడించారని భావిస్తున్నారు. పీసీసీ అధ్యక్షుడిగా కొనసాగుతున్న సమయంలో ప్రభుత్వంలో మంత్రి బాధ్యతలు తీసుకుంటే పార్టీ, ప్రభుత్వం రెండింటినీ సమన్వయం చేయడం ఎలా సాధ్యమన్న ప్రశ్న కూడా ఉంది. మరోవైపు కాంగ్రెస్ అధిష్ఠానం మాత్రం ప్రాంతీయ సమతుల్యత, సామాజిక ప్రాతినిధ్యం, రాజకీయ పనితీరును కలిపి నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ఆయనకు మంత్రి పదవి రేసు నుంచి బయటపడ్డారని చెప్పడం తొందరపాటు అవుతుంది. తుది కసరత్తు కీలక దశలోనే ఉంది. ఆయన వ్యాఖ్యలపై పార్టీలో చర్చ సాగుతోంది. కసరత్తు పూర్తయ్యే వరకు ఉత్కంఠ కొనసాగుతుంది. మొత్తంగా చూస్తే కొండా సురేఖ బర్తరఫ్ తర్వాత ఏర్పడిన ఖాళీ ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు రాజకీయ అవకాశంగా మారుతుందా అన్నదే ప్రధాన ప్రశ్నగా నిలిచింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ప్రాంతానికి ప్రాతినిధ్యం కల్పించాలని స్థానిక నాయకులు, కార్యకర్తలు కోరుతున్నారు. ఒకవేళ బెర్త్ కేటాయిస్తే మహేష్ గౌడ్, మదన్ మోహన్ రావు మధ్య పోటీ ప్రధానంగా ఉండొచ్చని అంచనాలు ఉన్నాయి. బీసీ సమీకరణం, పార్టీ విధేయత, సంస్థాగత బాధ్యతలు, యువ నాయకత్వం, ఢిల్లీ పరిచయాలు వంటి అంశాలు ఎంపికలో కీలకంగా మారవచ్చు. అయితే ముఖ్యమంత్రి నిర్ణయం, కాంగ్రెస్ అధిష్ఠానం సూచనలు, భవిష్యత్ రాజకీయ సమీకరణాలే తుది ఫలితాన్ని నిర్ణయిస్తాయి. ప్రస్తుతం జిల్లా నేతల్లో ఆశలు పెరిగాయి. మంత్రి పదవి ఎవరికి దక్కుతుందన్న అంశం త్వరలో స్పష్టమైతే కాంగ్రెస్‌లో కొత్త సమీకరణాలు మొదలయ్యే అవకాశముంది. నిజామాబాద్‌కు ప్రాతినిధ్యం వస్తే ప్రాంతీయంగా పార్టీ బలం పెరగవచ్చని కేడర్ భావిస్తోంది. అందుకే రాబోయే కేబినెట్ కసరత్తుపై అందరి చూపు నిలిచింది. ఈ అంశంపై నేతలు అధిష్ఠానం నిర్ణయం కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.






## పిల్లి శాపనార్థాలకు ఉట్టి తెగదు

**మొదటిపేజీ తరువాయి**

కుటుంబాలకు గౌరవం కల్పించాల్సిన బాధ్యత ప్రతి ప్రభుత్వానిదని అన్నారు. గత ప్రభుత్వం ఉద్యోగాల విషయంలో యువతకు అన్యాయం చేసిందని రేవంత్ రెడ్డి ఆరోపించారు. ప్రశ్నపత్రాల లీకేజీలు, అమ్మకాలతో నిరుద్యోగుల జీవితాలతో చెలగాట మాడారని విమర్శించారు. వేల కోట్ల రూపాయలు సంపాదించారని తీవ్ర ఆరోపణలు చేశారు. ప్రజా పాలన పోవాలని, పాపాల భైరవుడు రావాలని కొందరు దీక్షలు చేస్తున్నారని వ్యాఖ్యానించారు. అలాంటి రాజకీయాలను ప్రజలు తిరస్కరిస్తారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే 70 వేల ఉద్యోగాలు కల్పించిందని సీఎం వెల్లడించారు. దేశంలోని ఏ రాష్ట్రంలో, ఏ ముఖ్యమంత్రి కూడా ఈ స్థాయిలో నియామకాలు చేపట్టలేదని చెప్పారు. ఉద్యోగ నియామక పత్రాలు అందుకుంటున్న యువతే తమ ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని తెలిపారు. గత ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్లకు తామే నియామకాలు పూర్తి చేశామని చెప్పడం సరికాదన్నారు. వెయ్యి రోజుల పాలనలో ప్రతిపక్ష నేతగా కేసీఆర్ ఒక్క రోజు, ఒక్క గంట కూడా బయటకు రాలేదని రేవంత్ రెడ్డి విమర్శించారు. శాసనసభకు రాకుండా ప్రతిపక్ష బాధ్యతలు ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. కేసీఆర్ ను డిస్మిస్ చేయాల్సిన అవసరం ఉందా లేదా ప్రజలు ఆలోచించాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగి 365 రోజులు విధులకు గైర్హాజరైతే చర్యలు తీసుకుంటారని ఉదాహరణ ఇచ్చారు. అలాంటప్పుడు వెయ్యి రోజులుగా అసెంబ్లీకి దూరంగా ఉన్న ప్రతిపక్ష నేతపై ప్రశ్నలు రావడం సహజమన్నారు. ప్రజల పన్నుల నుంచి జీతభత్యాలు తీసుకుంటూ ప్రజా సమస్యలపై స్పందించకపోవడం సరికాదని మండిపడ్డారు.



పేద ప్రజలు రక్తాన్ని చెమటగా మార్చి పన్నులు చెల్లిస్తున్నారని, ఆ డబ్బుకు బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజాస్వామ్యంలో పదవులు ప్రజాసేవ కోసం ఉండాలని, వ్యక్తిగత సౌకర్యాల కోసం కాదని సీఎం వ్యాఖ్యానించారు. ప్రజల సమస్యలు తెలుసుకోవడానికి నాయకులు క్షేత్రస్థాయిలో కనిపించాలన్నారు. కేసీఆర్ శాసనసభకు రావాలని, ప్రతి అంశంపై చర్చించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని రేవంత్ రెడ్డి సవాల్ చేశారు. అసెంబ్లీకి రావడం సాధ్యం కాకపోతే రాజీనామా చేసి గౌరవంగా తప్పుకోవాలని సూచించారు. గజ్వేల్ లోనే రాజకీయంగా తేల్చుకుందామని కేసీఆర్ కు సవాల్ విసిరారు. తండ్రీకొడుకులు, అల్లుడు కలిసి ప్రభుత్వాన్ని విమర్శిస్తూ తిరుగుతున్నారని ఆరోపించారు. గత పాలనలో తీసుకున్న నిర్ణయాలపై ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత వారిపైనే ఉందన్నారు. ప్రజా సమస్యల నుంచి తప్పించుకోవడానికి ఫామ్ హౌస్ రాజకీయాలు పనికిరావని స్పష్టం చేశారు. ప్రతిపక్ష నేతగా ప్రజల తరఫున ప్రశ్నించాల్సిన వ్యక్తి ప్రజలకు దూరంగా ఉండటం విచిత్రమని వ్యాఖ్యానించారు.

## మిస్ వరల్డ్ 2026 విజేతగా డొమినికన్ అమ్మాయి

**ఇంటర్నెట్ డెస్క్, :**

వియత్నాం వేదికగా అట్టహాసంగా జరిగిన 73వ మిస్ వరల్డ్ 2026 పోటీలు ముగిశాయి. ఈ ప్రతిష్ఠాత్మక కిరీటాన్ని డొమినికన్ రిపబ్లిక్‌కు చెందిన జోహెర్రీ మోలా డొమింగ్వెజ్ గెలుచుకుంది. స్పెయిన్‌కు చెందిన ఎలిసబెత్ రెయిన్స్ మొదటి రన్నరప్‌గా, మలేసియాకు చెందిన తానూసియా చెట్టి రెండో రన్నరప్‌గా నిలిచారు. గత ఏడాది విజేత, థాయ్‌లాండ్‌కు చెందిన ఓపల్ సుచాతా చువాంగ్‌శ్రీ.. కొత్త ప్రపంచ సుందరికి కిరీటాన్ని అలంకరించింది. కొత్త ప్రపంచ సుందరి జోహెర్రీ వృత్తిరీత్యా ఉపాధ్యాయురాలు, సామాజిక కార్యకర్త. 'వాయిసెస్ ఆఫ్ టుమారో' అనే సంస్థ ద్వారా వెనుకబడిన వర్గాల పిల్లలకు ఇంగ్లీష్ విద్యను అందిస్తున్నారు. ఆమె కమ్యూనిటీ సేవ, విద్యారంగంలో చేస్తున్న కృషికి గుర్తింపుగా ఈ కిరీటం దక్కిందని పలువురు ప్రశంసిస్తున్నారు. వచ్చే ఏడాది ఈ పోటీలకు టాంజానియా ఆతిథ్యం ఇవ్వనుంది. ఇదిలా ఉండగా, ఈ ఏడాది చివర్లో ప్యూర్టోరికోలో జరిగే మిస్ యూనివర్స్ పోటీల్లో భారత్ తరఫున కాజియా లిజ్ మేజో పాల్గొననున్నారు.



## రెండేళ్లు టైమ్ ఇవ్వండి!



**మొదటిపేజీ తరువాయి**

ఉపాధ్యాయ వర్గం ఎదుర్కొంటున్న అంశాలను రాజకీయ ఒత్తిళ్లకు దూరంగా, విధానపరంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం స్పష్టం చేశారు. డిజిటల్ వనరులు అందుబాటులోకి వస్తే బోధనలో కొత్త పద్ధతులు అమలు చేయడం సులభమవుతుందని పేర్కొన్నారు. విద్యార్థుల ప్రతిభకు అనుగుణంగా శిక్షణ, మార్గదర్శకత్వం అందించే వ్యవస్థను మరింత బలపరుస్తామని హామీ ఇచ్చారు. త పదేళ్ల పాలనలో విద్యావ్యవస్థ నిర్లక్ష్యానికి గురైందని ప్రభుత్వ బడులపై తల్లిదండ్రుల్లో నమ్మకం పెరగడం, విద్యార్థుల చేరికలు అధికం కావడం సానుకూల పరిణామాలుగా పేర్కొన్నారు. తరగతి గదిలో బోధన నాణ్యత పెరిగితే రాష్ట్ర భవిష్యత్తు మరింత బలపడుతుందని సీఎం అభిప్రాయపడ్డారు. ప్రతి మండలంలో విద్యా ప్రమాణాలు మెరుగుపడేలా పర్యవేక్షణ పెంచాలని, ఫలితాల ఆధారంగా అవసరమైన మార్పులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఉపాధ్యాయుల సృజనాత్మకతకు ప్రోత్సాహం లభిస్తే తరగతులు మరింత ఆసక్తికరంగా మారతాయని చెప్పారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు ఎడ్యుకేషన్ కమిషన్ ఏర్పాటు చేసినట్లు రేవంత్ రెడ్డి చెప్పారు. అధికారంలోకి వచ్చిన 55 రోజుల్లో మెగా డీఎస్సీ నిర్వహించి 10,006 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేశామని గుర్తుచేశారు. 25,950 మందికి పదోన్నతులు కల్పించామని, 34 వేల మందికి పైగా బదిలీలు పూర్తి చేశామని వివరించారు. చాలాకాలంగా వివాదంగా ఉన్న 317 జీవో సమస్యను పరిష్కరించినట్లు వెల్లడించారు. ఉద్యోగుల ఇబ్బందులు తగ్గించే దిశగా పరిపాలన కొనసాగుతోందని పేర్కొన్నారు. ఉపాధ్యాయులకు కెరీర్ పురోగతి, సరైన పోస్టింగ్, పని వాతావరణం అందితే విద్యార్థులపై దాని ప్రభావం స్పష్టంగా కనిపిస్తుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంలో టీచర్ల పాత్ర అత్యంత కీలకమని చెప్పారు. ఉపాధ్యాయ వర్గం ఎదుర్కొంటున్న అంశాలను రాజకీయ ఒత్తిళ్లకు దూరంగా, విధానపరంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం స్పష్టం చేశారు. డిజిటల్ వనరులు అందుబాటులోకి వస్తే బోధనలో కొత్త పద్ధతులు అమలు చేయడం సులభమవుతుందని పేర్కొన్నారు. విద్యార్థుల ప్రతిభకు అనుగుణంగా శిక్షణ, మార్గదర్శకత్వం అందించే వ్యవస్థను మరింత బలపరుస్తామని హామీ ఇచ్చారు. త పదేళ్ల పాలనలో విద్యావ్యవస్థ నిర్లక్ష్యానికి గురైందని ముఖ్యమంత్రి తీవ్రంగా విమర్శించారు. ఉపాధ్యాయుల రిటైర్మెంట్ ప్రయోజనాలు పెండింగ్‌లో పెట్టిన పరిస్థితులు గతంలో ఉన్నాయని ఆరోపించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పదవీ విరమణ ప్రయోజనాల కోసం రూ.6 వేల కోట్లు చెల్లించినట్లు చెప్పారు. ఉపాధ్యాయులను ప్రభుత్వ వ్యయంతో విదేశీ అధ్యయన పర్యటనలకు పంపించిన ఘనత తమ పాలనకే దక్కుతుందని వెల్లడించారు. కొత్త అనుభవాలు, ఆధునిక బోధనా విధానాలు తెలుసుకోవడం ద్వారా టీచర్ల సామర్థ్యం పెరుగుతుందని పేర్కొన్నారు. పాఠశాల విద్యలో మార్పులు కేవలం భవనాలు, సౌకర్యాలతో పూర్తికావని, బోధనా నైపుణ్యం కీలకమని వివరించారు. విద్యార్థులకు భవిష్యత్ ఉద్యోగ మార్కెట్‌కు సరిపోయే జ్ఞానం, నైపుణ్యాలు అందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని గుర్తుచేశారు. ఈ దిశగా ప్రభుత్వం అవసరమైన సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. విద్యార్థుల హాజరు, అభ్యాస ఫలితాలు, ఉపాధ్యాయుల అవసరాలపై నిరంతర సమీక్ష ఉండాలని సూచించారు.

## కొత్త జీడీపీలో బిగ్ ట్విస్ట్..!

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

భారత ఆర్థిక వ్యవస్థకు సంబంధించి కొత్త జీడీపీ గణాంకాలు ఇప్పుడు పెద్ద చర్చకు కారణమయ్యాయి. 2026-27 తొలి త్రైమాసికంలో నిజమైన జీడీపీ 7.8 శాతం పెరిగిందని కేంద్ర గణాంకాల శాఖ ప్రకటించింది. 2022-23ను కొత్త ప్రాతిపదిక సంవత్సరంగా తీసుకున్న లెక్కల ప్రకారం ఉత్పత్తి విలువ రూ. 81.36 లక్షల కోట్లకు చేరింది. ప్రస్తుత ధరలతో చూస్తే జీడీపీ రూ. 88.27 లక్షల కోట్లుగా నమోదైంది. ఇది 10.3 శాతం నామమాత్ర వృద్ధిని సూచిస్తోంది. సాధారణంగా చెప్పాలంటే దేశంలో వస్తువులు, సేవల ఉత్పత్తి బలంగా పెరిగిందన్న సంకేతం ఇది. కానీ ఈ లెక్కల వెనుక గత ఏడాది అంచనాల్లో భారీ మార్పు చోటుచేసుకోవడంతో అసలు కథపై ఎన్నో ప్రశ్నలు మొదలయ్యాయి. ఈ నేపథ్యంలో లెక్కల విశ్వసనీయతపై చర్చ పెరిగింది. ప్రభుత్వ వాదన ప్రకారం కొత్త డేటా వనరులు, మెరుగైన పద్ధతులు, సవరించిన సూచికలు గణాంకాలను మార్చాయి. విమర్శకులు మాత్రం మార్పుల పరిమాణంపై స్పష్టత కోరుతున్నారు. గత ఏడాది తొలి త్రైమాసికానికి పాత 2011-12 సిరీస్‌లో నామమాత్ర జీడీపీ రూ. 86.05 లక్షల కోట్లుగా ఉంది. కొత్త 2022-23 సిరీస్‌లో అదే కాలానికి అంచనా మొదట రూ. 80.32 లక్షల కోట్లకు వచ్చింది. తరువాత రూ. 80.44 లక్షల కోట్లుగా సవరించబడింది. కొత్త పారిశ్రామిక ఉత్పత్తి సూచీ, ఉత్పత్తిదారుల ధరల సూచీ చేర్పులతో చివరికి దాదాపు రూ. 80 లక్షల కోట్ల వద్ద నిలిచింది. అంటే పాత అంచనాతో పోలిస్తే సుమారు రూ. 6.05 లక్షల కోట్ల తేడా కనిపిస్తోంది. మాజీ ఆర్థిక కార్యదర్శి సుభాష్ చంద్ర గార్గ్ ప్రశ్నిస్తున్న ప్రధాన అంశం ఇదే. ఇంత పెద్ద సవరణ ఎందుకు జరిగింది? ఏ రంగం నుంచి ఎంత మార్పు వచ్చింది? ఒక్కో కొత్త డేటా వనరు ఎంత ప్రభావం చూపింది? ఈ వివరాలు వెల్లడిస్తే చర్చకు మరింత బలం వస్తుంది. ప్రభుత్వం మాత్రం ఇది వృద్ధిని కృత్రిమంగా పెంచేందుకు చేసిన మార్పు కాదని చెబుతోంది. బేస్ ఇయర్ మార్పుతోపాటు కొత్త సమాచారాన్ని ఉపయోగించడం వల్ల సహజంగానే పునర్మూల్యాంకనం జరిగిందని వివరిస్తోంది. పాత లెక్కలోని రూ. 86.05 లక్షల కోట్లను కొత్త రూ. 88.27 లక్షల కోట్లతో పోలిస్తే సుమారు 2.6 శాతం పెరుగుదల కనిపిస్తుంది. ఈ సంఖ్యను కొందరు వృద్ధి రేటుగా చూపిస్తున్నారు. కానీ ఆ పోలిక సాంకేతికంగా సరైనది కాదు. కారణం రెండు సంఖ్యలు వేర్వేరు గణాంక సిరీస్‌ల నుంచి వచ్చాయి. సరైన పోలిక కొత్త విధానంలో గత ఏడాది జీడీపీగా నిర్ణయించిన ₹80 లక్షల కోట్లతో చేయాలి. అప్పుడు ప్రస్తుత ధరల వృద్ధి 10.3 శాతంగా వస్తుంది. మరోవైపు నిజమైన జీడీపీ 7.8 శాతం పెరిగింది. నామమాత్ర, నిజమైన వృద్ధి మధ్య వ్యత్యాసం ధరల ప్రభావాన్ని సూచిస్తుంది. జీడీపీ డిఫ్లేటర్ ద్వారా కనిపించే ధరల పెరుగుదల సుమారు 2.5 శాతం. ఇది వినియోగదారుల ధరల సూచీ లేదా టోకు ధరల సూచీతో నేరుగా సమానం కాదు. డిఫ్లేటర్ మొత్తం దేశీయ ఉత్పత్తిలోని వస్తువులు, సేవల ధరల మార్పును పరిగణిస్తుంది. అందుకే ఈ సంఖ్య భిన్నంగా ఉండటం గణాంక లోపం అని చెప్పలేం. అసలు అవసరం మాత్రం రంగాలవారీ వివరాలే. తయారీ రంగం గణాంకాలు కూడా ఈ చర్చకు మరో కోణం చూపిస్తున్నాయి. నామమాత్ర జీవీఏ 7.7 శాతం పెరిగితే, ధరల ప్రభావాన్ని తొలగించిన నిజమైన జీవీఏ 9.2 శాతం పెరిగింది. అందువల్ల సంబంధిత ధర సూచీ మైనస్ 1.5 శాతంగా వచ్చింది. దీన్ని వెంటనే తయారీ వస్తువుల ధరలు పడిపోయాయని అర్థం చేసుకోవడం సరికాదు. డబుల్ డిఫ్లేషన్ పద్ధతిలో తయారైన వస్తువుల ధరలతోపాటు ముడి పదార్థాలు, ఇతర ఉత్పత్తి ఖర్చుల ధరలను విడిగా పరిగణిస్తారు. ఇన్‌పుట్ ఖర్చులు వేగంగా పెరిగి అవుట్‌పుట్ ధరలు తక్కువగా పెరిగితే ఇలాంటి ఫలితం రావచ్చు. అదే సమయంలో సిమెంట్ 8.9 శాతం, తయారైన ఉక్కు వినియోగం 8.3 శాతం, వాణిజ్య వాహనాల అమ్మకాలు 18.3 శాతం, మూలధన వస్తువుల ఐఐపీ 15.2 శాతం పెరిగాయి. నిజమైన స్థిర పెట్టుబడులు 11.9 శాతం పెరిగాయి. అయితే గనుల రంగం 2.4 శాతం క్షీణించింది. సహజ వాయువు వినియోగం 2.6 శాతం తగ్గింది. వృద్ధి అన్ని రంగాల్లో సమానంగా లేదన్న విషయం స్పష్టమవుతోంది. ఇక ప్రజల జీవితాల్లో ఈ వృద్ధి ఎంతగా కనిపిస్తుందన్నదే ముఖ్యమైన ప్రశ్న. తొలి త్రైమాసికంలో ప్రజల వినియోగ వ్యయం 7.1 శాతం పెరగడం ఆశాజనక సంకేతం. స్థిర పెట్టుబడుల పెరుగుదల భవిష్యత్ ఉత్పత్తికి మద్దతు ఇవ్వొచ్చు. అయినా జీడీపీ పెరుగుదల ఒక్కటే కుటుంబ ఆదాయం, ఉద్యోగాలు, కొనుగోలు శక్తి అదే వేగంతో పెరిగాయని నిరూపించదు. జూలై 2026లో 15 ఏళ్లు పైబడినవారికి ప్రస్తుత వారపు స్థితి ప్రకారం నిరుద్యోగ రేటు దేశవ్యాప్తంగా 5.1 శాతం, పట్టణాల్లో 6.7 శాతంగా నమోదైంది. కాబట్టి 7.8 శాతం వృద్ధిని అబద్ధమని తేల్చడం సరైంది కాదు. అదే సమయంలో గత ఏడాది అంచనా రూ. 86.05 లక్షల కోట్ల నుంచి రూ. 80 లక్షల కోట్లకు ఎందుకు మారిందో వివరాలు ప్రజలకు అందుబాటులో ఉండాలి. ఏ రంగం ఎంత సవరణకు కారణమైందో స్పష్టంగా చెప్పాలి. కొత్త పద్ధతుల ప్రభావాన్ని స్వతంత్రంగా పరిశీలించే అవకాశం ఉండాలి. చివరికి బలమైన జీడీపీ అంటే ఉద్యోగం, ఆదాయం, జీవన ప్రమాణాల్లో కనిపించే బలం కావాలి.





## పరికీ చెరువు వద్ద వినాయక నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

**డిప్యూటీ కమిషనర్ చాముండేశ్వరి ఆధ్వర్యంలో సంయుక్త తనిఖీలు**

**సైబరాబాద్ - విశాల భారతి**

ఈ నెల 14వ తేదీ నుంచి ప్రారంభం కానున్న గణేష్ నిమజ్జన ఉత్సవాలను పురస్కరించుకుని ఆల్విన్ కాలనీ సర్కిల్ 51 పరిధిలోని పరికీ చెరువు వద్ద ముమ్మర ఏర్పాట్లు చేపడుతున్నట్లు సర్కిల్ ఉప కమిషనర్ చాముండేశ్వరి తెలిపారు. శనివారం పోలీసు అధికారులు, గణేష్ ఉత్సవ సమితి సభ్యులు, ఇతర శాఖల ప్రతినిధులతో కలిసి ఆమె చెరువు ప్రాంగణాన్ని క్షేత్రస్థాయిలో సంయుక్తంగా పరిశీలించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా విద్యుత్ దీపాలు, తాగునీరు, పారిశుధ్యం, భద్రతా ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. నిమజ్జనం సజావుగా సాగేందుకు అన్ని శాఖల సమన్వయంతో ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప కమిషనర్ చాముండేశ్వరితో పాటు అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ), పోలీసు శాఖ అధికారులు, గణేష్ ఉత్సవ సమితి సభ్యులు, రాంకీ ప్రతినిధులు, సీఎంసీ పారిశుధ్య విభాగానికి చెందిన సిబ్బంది పాల్గొన్నారు.

## ఫీజుల నియంత్రణ చట్టం ఇంకెప్పుడు?

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

ప్రైవేటు, కార్పొరేట్ విద్యా వ్యాపారానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొమ్ముకాస్తున్నారని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత తీవ్రంగా ఆరోపించారు. విద్యా సంవత్సరం మొదలై మూడు నెలలు పూర్తవుతున్నా ఫీజుల నియంత్రణ చట్టం ఊసే లేదని ప్రశ్నించారు. 2024 మేలో స్కూల్ ఫీ రెగ్యులేటరీ కమిషన్ ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. ఆ హామీకి అనుగుణంగా రూపొందించిన ముసాయిదా బిల్లు రెండేళ్లుగా కేబినెట్‌ను దాటి ముందుకు ఎందుకు సాగలేదని నిలదీశారు. తల్లిదండ్రులపై ప్రతి ఏడాది పెరుగుతున్న ఫీజుల భారం కనిపిస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం ఆందోళనకరమన్నారు. విద్యార్థుల భవిష్యత్తు పేరుతో జరుగుతున్న ఈ ఆర్థిక ఒత్తిడికి అడ్డుకట్ట వేయాల్సిన బాధ్యత పాలకులపై ఉందని స్పష్టం చేశారు. సాధారణ కుటుంబాలకు చదువు అందుబాటులో ఉండేలా వెంటనే నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. చట్టం వస్తే పరిస్థితి మారుతుందని తెలిపారు. ప్రజల్లో ఈ అంశంపై విస్తృత చర్చ జరుగుతోందన్నారు. తల్లిదండ్రుల డిమాండ్‌ను ప్రభుత్వం గౌరవించాలని కోరారు. త్వరగా నిర్ణయం తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఇదే సరైన సమయమని చెప్పారు. ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలు ఇష్టానుసారంగా ఫీజులు పెంచుతూ తల్లిదండ్రులను ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నా విద్యాశాఖ మంత్రిగా, ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి ఎందుకు మౌనంగా ఉన్నారని కవిత ప్రశ్నించారు. వంద ఎకరాల ప్రభుత్వ భూమిలో ఏర్పాటైన హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ కూడా భారీగా ఫీజులు పెంచిందని పేర్కొన్నారు. ఇలాంటి ప్రముఖ సంస్థలపై నియంత్రణ చర్యలు ఎందుకు కనిపించడం లేదని నిలదీశారు. విద్యను సేవగా కాక వ్యాపారంగా మార్చే ధోరణికి ప్రభుత్వం ఎందుకు అండగా నిలుస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్కువ ఆదాయం కలిగిన కుటుంబాలు పిల్లల చదువుకోసం అప్పులు చేయాల్సిన పరిస్థితి రావడం బాధాకరమన్నారు. బడ్జెట్ పాఠశాలల స్థిరత్వాన్ని దెబ్బతీసే విధానాలు మానుకోవాలని కోరారు. విద్యార్థుల హక్కులు, తల్లిదండ్రుల ఆర్థిక భద్రత కాపాడే చర్యలు తక్షణం మొదలుకావాలని స్పష్టం చేశారు. నియమాలు స్పష్టంగా ఉంటే కుటుంబాలకు ముందస్తు అవగాహన ఏర్పడుతుందని చెప్పారు. విద్యా ఖర్చులపై పర్యవేక్షణ బలపడాలని కోరారు. అనవసర వసూళ్లకు అడ్డుకట్ట పడాలని సూచించారు. ప్రతి పాఠశాల జవాబుదారీతనంతో వ్యవహరించాలని అన్నారు. ప్రజలకు విశ్వాసం కల్పించాలని కోరారు. 1994లో జారీ చేసిన జీవో ఎంఎస్ 01లో ప్రైవేట్ పాఠశాలల ఫీజులను ఆయా విద్యాసంస్థల గవర్నింగ్ బాడీ నిర్ణయించాలని స్పష్టంగా పేర్కొన్నారని కవిత తెలిపారు. ఐదు శాతానికి మించి ఫీజుల పెంపునకు అవకాశం లేదని ఆ ఉత్తర్వు సూచిస్తోందన్నారు. అలాంటి నిబంధన అమల్లో ఉన్నప్పటికీ తెలంగాణలో ఎందుకు పాటించడం లేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. నిబంధనలు పుస్తకాలలో మాత్రమే ఉండి, ఆచరణలో కనిపించకపోతే విద్యార్థుల కుటుంబాలకు న్యాయం ఎలా జరుగుతుందని అన్నారు. పాఠశాలలు వసూలు చేసే మొత్తం, వార్షిక పెంపు, అదనపు ఛార్జీలపై పారదర్శకత అవసరమని పేర్కొన్నారు. ఫీజుల నిర్మాణాన్ని తల్లిదండ్రులకు ముందుగానే స్పష్టంగా తెలియజేసే విధానం ఉండాలని సూచించారు. నియంత్రణ వ్యవస్థకు స్వతంత్ర అధికారాలు కల్పించి, ఫిర్యాదులపై వేగంగా స్పందించే యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. విద్యా రంగంలో బాధ్యత, జవాబుదారీతనం పెరగాల్సిన సమయం ఇదేనని చెప్పారు. విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా నిర్ణయాలు ఉండాలని చెప్పారు. తల్లిదండ్రుల సమ్మతి లేకుండా కొత్త ఛార్జీలు విధించకూడదని సూచించారు. నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని కోరారు. చర్యలు మొదలుకావాలన్నారు. రెండు రోజుల్లో ప్రారంభం కానున్న అసెంబ్లీ సమావేశాల్లో ఫీజుల నియంత్రణ చట్టానికి సంబంధించిన బిల్లును ప్రభుత్వం ప్రవేశపెట్టాలని కవిత డిమాండ్ చేశారు. బిల్లును ఆమోదింపజేసి రాష్ట్రంలోని అన్ని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలకు ఒకే విధమైన నియమాలు వర్తించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఫీజుల పెంపుపై పరిమితి, ముందస్తు సమాచారం, తల్లిదండ్రుల ఫిర్యాదుల పరిష్కారం, ఉల్లంఘనలకు జరిమానాలు వంటి అంశాలను చట్టంలో స్పష్టంగా పొందుపరచాలని సూచించారు. పాఠశాలల ఆదాయం, ఖర్చులపై తగిన పారదర్శకత ఉంటే అనవసర వసూళ్లకు అవకాశం తగ్గుతుందని పేర్కొన్నారు.





# ఉపాధ్యాయులకు సీపీ సన్మానం

**సైబరాబాద్ - విశాల భారతి**

ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గచ్చిబౌలిలోని జెడ్పీహెచ్ఎస్ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులను సైబరాబాద్ సీపీ డా. ఎం. రమేష్ ఘనంగా సత్కరించారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు హెచ్ఎం రెహానా బేగం, ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు మునీర్ అహ్మద్‌ను ప్రత్యేకంగా అభినందించారు.విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయుల పాత్ర కీలకమని సీపీ పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి ట్రాఫిక్ నిబంధనలు, మహిళల భద్రత, డ్రగ్స్, సైబర్ మోసాలపై అవగాహన కల్పించారు. ఓటీపీ, బ్యాంకు వివరాలను అపరిచితులకు వెల్లడించవద్దని సూచించారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్, మాదాపూర్ ఏసీపీ శ్రీధర్, రాయదుర్గం ఎస్‌హెచ్‌వో భూపతి, పోలీసు అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# 22ఏ కేవలం రియల్ ఎస్టేట్ బబ్రోకర్ల కోసమే

**విశాల భారతి, ఆర్మూర్:** తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ లో శనివారం రోజు భారతీయ జనతా పార్టీ తలపెట్టిన దీక్షలో ఆర్మూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి, పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నిసార్లు చెప్పినా ఎంత చెప్పినా 22ఏ గురించి తక్కువని. ఇది ఒకటే కాదు హైడ్రా కానీ మూసి పరిరక్షణ కానీ ఈ ప్రభుత్వ వ్యవహార శైలి చంబల్ దొంగలా వ్యవహరిస్తుంది అన్నారు. ఈరోజు రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలను, మహిళలను, రైతులను, విద్యార్థులను అన్ని రకాల మోసం చేస్తున్న బ్లాక్ మేయిలర్ రేవంత్ రెడ్డి అన్నారు. ఇకనుండి లెక్క పెట్టుకోవాలి ప్రభుత్వం పడిపోయే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. నిన్న రేవంత్ రెడ్డి, మాట్లాడిన మాట తీరు యావత్ భారతదేశం సిగ్గుపడుతుందని అసదుద్దీన్ ఓవైసీ దేశభక్తుడు అంటే వారి వర్గాలకు చెందిన వ్యక్తులు నవ్వుతున్నారన్నారు.

# రేవంత్‌ను గద్దె దించేదాకా వదలం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణను రేవంత్ రెడ్డి రియల్ ఎస్టేట్ సంస్థగా మార్చారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్రంగా ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యం ప్రజల భూములు విక్రయించడమేనని విమర్శించారు. వక్ఫ్ భూములు మినహా మిగతా భూములపై ప్రభుత్వం కన్నేసిందని మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా అరవై లక్షల ఎకరాలకు పైగా భూములను 22ఏ నిషేధిత జాబితాలో చేర్చారని పేర్కొన్నారు. ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద బీజేపీ నిర్వహించిన మహాధర్నాలో ఆయన మాట్లాడారు. 22ఏ సమస్యపై ఇంటింటికీ వెళ్లి ప్రజలను చైతన్యపరచాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. భూముల సమస్యను కేవలం రిజిస్ట్రేషన్ అంశంగా చూడకుండా, కుటుంబాల భవిష్యత్తుతో ముడిపడిన హక్కుగా గుర్తించాలని కోరారు. కేసీఆర్ హయాంలో ధరణి పేరుతో జరిగిన అన్యాయాల తర్వాత ఇప్పుడు కాంగ్రెస్ మరో రూపంలో ఇబ్బందులు పెడుతోందని ఆరోపించారు. అనుమతులు ఉన్న భూములను సైతం నిషేధిత జాబితాలో చేర్చడం వల్ల యజమానులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని చెప్పారు. ప్రభుత్వ ఆదాయం కోసం ప్రజల ఆస్తులను చూడటం సరైనది కాదు. ఈ అంశంపై కేంద్రం కూడా దృష్టి సారించాలని సూచించారు. మాజీ సీఎం కేసీఆర్ తరహాలోనే ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భూముల విక్రయాలకు ప్రయత్నిస్తున్నారని కిషన్ రెడ్డి ఆరోపించారు. ఉద్యోగులకు జీతాలు, పదవీ విరమణ ప్రయోజనాలు చెల్లించలేని స్థితికి రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని తీసుకొచ్చారని విమర్శించారు. భూములు అమ్మకుండా ప్రభుత్వం నడవని పరిస్థితి సృష్టించారని అన్నారు. బీఆర్ఎస్ కాలంలో ఉన్న కమీషన్ సంస్కృతి ఇప్పుడు కాంగ్రెస్ పాలనలో కొనసాగుతోందని ఆరోపించారు. 22ఏ జాబితాను ప్రజలపై ఒత్తిడి తెచ్చే సాధనంగా ఉపయోగిస్తున్నారని విమర్శించారు. పేదల భూములను వెంటనే





నిషేధిత జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. మరోవైపు ఎంపీ ఈటల రాజేందర్ రేవంత్ సర్కార్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. 22ఏ బాధితుల ఆవేదనను పట్టించుకోకుండా ప్రభుత్వం ముందుకు వెళ్తే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రేవంత్, పొంగులేటి శ్రీనివాసరెడ్డికి ప్రజల భూములను జాబితాలో పెట్టే అధికారం ఎవరు ఇచ్చారని ప్రశ్నించారు. అవసరమైతే న్యాయపోరాటం, ప్రజా ఉద్యమం, కేంద్ర సంస్థలకు ఫిర్యాదుల ద్వారా బాధితులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. బాధితుల హక్కులను రక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలో 22ఏ ప్రభావం ఎక్కువగా ఉందని ఈటల రాజేందర్ తెలిపారు. బాధితులు స్వచ్ఛందంగా బస్సుల్లో వచ్చి మహాధర్నాలో పాల్గొన్నారని చెప్పారు. అధికారులారా కేవలం పైస్థాయి ఆదేశాలు పాటించకుండా రాజ్యాంగబద్ధ బాధ్యతలను గుర్తుంచుకోవాలని సూచించారు. మూసీ పరివాహక ప్రాంతాల్లో ఇళ్ల తొలగింపుపై కూడా ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫణిగిరి కాలనీలో ఖరీదైన అపార్ట్మెంట్లను కూల్చేందుకు అధికారులు, పోలీసులు, బుల్డోజర్లతో రావడం దుర్మార్గమని అన్నారు. గాజులరామారంలో దశాబ్దాలుగా నివసిస్తున్న పేదలపై చర్యలు తీసుకోవడాన్ని తప్పుబట్టారు. విద్యుత్, నీటి సౌకర్యాలు తొలగించడంతో కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని చెప్పారు. పేదల ఇళ్లపై హైడ్రా చర్యలను ప్రశ్నిస్తూ, అధికారులపై వ్యక్తిగత కక్ష లేదని స్పష్టం చేశారు. అయితే పేదలపై అన్యాయం జరిగితే మాత్రం బీజేపీ వెనక్కి తగ్గదని తేల్చిచెప్పారు. ప్రజల పక్షాన నిలబడటం బాధ్యత, మానవత్వ అంశమని పేర్కొన్నారు. ప్రభుత్వ చర్యలు చట్టబద్ధంగా, పారదర్శకంగా ఉండాలని డిమాండ్ చేశారు. బాధితుల ఫిర్యాదులను వేగంగా పరిశీలించి పరిష్కరించాలని కోరారు. ఇది ప్రజల్లో న్యాయంపై నమ్మకాన్ని దెబ్బతీసే ప్రమాదం ఉందని చెప్పారు. నర్సాపూర్‌లో సుమారు యాభై ఐదు వేల మంది రైతుల భూములు 22ఏ జాబితాలో ఉన్నాయని ఈటల రాజేందర్ పేర్కొన్నారు. దీంతో సమస్య తీవ్రత అర్థమవుతుందని అన్నారు. తరతరాలుగా సాగు చేస్తున్న భూములకు సరైన పత్రాలు లేకపోయినా, గతంలో కాస్తు వివరాలు ఆధారంగా హక్కులు కొనసాగేవని చెప్పారు. ధరణి మార్పులతో అనేక కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొన్నాయని ఆరోపించారు. బహదూర్‌గూడలో వందల ఎకరాల్లో సాగు చేస్తున్న రైతుల సమస్యలను కూడా ప్రస్తావించారు. మహేంద్రహిల్స్ వంటి నివాస ప్రాంతాలను నిషేధిత జాబితాలో చేర్చడంపై ప్రశ్నలు లేవనెత్తారు. కూకట్‌పల్లి పరిధిలోని విలువైన ప్రభుత్వ భూముల విషయంలో గత పాలకుల నిర్ణయాలను ప్రస్తుత ప్రభుత్వం కొనసాగిస్తోందని ఆరోపించారు. పుప్పాలగూడలో భారీ విలువ కలిగిన భూముల రికార్డుల మార్పులపై కూడా ఆయన సందేహాలు వ్యక్తం చేశారు. భూములు కొనుగోలు చేసినవారిని కూడా చట్టపరంగా పరిశీలిస్తామని ప్రకటించారు. ప్రజల ఆస్తులపై స్పష్టత లేకపోవడం పెట్టుబడులు, కుటుంబ భద్రత, భవిష్యత్ ప్రణాళికలను దెబ్బతీస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే రికార్డులను సరిచేయాలని డిమాండ్ చేశారు. రేవంత్ ప్రభుత్వం గద్దె దిగేవరకు పోరాటం కొనసాగుతుందని ఈటల రాజేందర్ శపథం చేశారు. కాంగ్రెస్ పాలనలో ప్రజాస్వామ్య విలువలు దెబ్బతిన్నాయని బీజేపీ నేతలు ఆరోపించారు. రాజకీయ విమర్శల మధ్య అసలు సమస్య భూముల రికార్డులు, నిషేధిత జాబితా, యజమానుల హక్కులపైనే ఉందని గమనించాలి. బాధితులు తమ పత్రాలను పరిశీలించుకుని, సంబంధిత అధికారుల వద్ద అభ్యంతరాలు నమోదు చేసుకోవాలని న్యాయ నిపుణులు సూచిస్తున్నారు. బీజేపీ మాత్రం ఈ అంశాన్ని రాష్ట్రవ్యాప్త ఉద్యమంగా మార్చేందుకు సిద్ధమవుతోంది. 22ఏ జాబితాలో ఉన్న భూములపై పారదర్శక విచారణ జరిగి, నిజమైన యజమానులకు హక్కులు పునరుద్ధరించాలన్న డిమాండ్ బలపడుతోంది. ఈ వివాదం రాబోయే రోజుల్లో తెలంగాణ రాజకీయాల్లో కీలక అంశంగా మారే అవకాశం కనిపిస్తోంది.

# భూముల దొంగలెవరు?

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

మరో రెండు రోజుల్లో తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానుండటంతో రాజకీయ వేడి పెరుగుతోంది. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ తమ వ్యూహాలను సిద్ధం చేసుకుంటున్నాయి. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, 22ఏ నిషేధిత భూములు, యూరియా కొరత, వ్యవసాయ విద్యుత్ కోతలు, వెయ్యి రోజుల పాలన, ఎన్నికల హామీల అమలు వంటి అంశాలతో ప్రభుత్వాన్ని నిలదీయాలని బీఆర్ఎస్ భావిస్తోంది. సమస్యలను సభలో బలంగా ప్రస్తావించి, ప్రభుత్వ పనితీరుపై ప్రశ్నలు సంధించేందుకు ప్రతిపక్షం సిద్ధమవుతోంది. దీంతో ఈసారి సమావేశాలు ప్రశ్నలు, ఆరోపణలు, సమాధానాలతో హాట్ టాపిక్‌గా మారే అవకాశం కనిపిస్తోంది. ప్రజల దృష్టి కూడా సభ వైపే మళ్లింది. సభా కార్యక్రమంలో ఈ అంశాలు వరుసగా చర్చకు వచ్చే అవకాశం ఉంది. అధికార పక్షం సమాధానాలపై కూడా ప్రతిపక్షం వెంటనే స్పందించేందుకు సిద్ధమవుతోంది. ప్రభుత్వ విధానాలు, గత నిర్ణయాల మధ్య తేడాను వివరించే ప్రయత్నం జరగొచ్చు. సమస్యలపై స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని ప్రతిపక్షం డిమాండ్ చేయనుంది. ప్రజలు సమస్యలపై ప్రభుత్వం ఏం చెబుతుందో గమనిస్తున్నారు. 22ఏ భూముల అంశంపై కాంగ్రెస్ కూడా ప్రత్యేక వ్యూహంతో ముందుకు వెళ్లాలని చూస్తోంది. ప్రజల్లో ఉన్న అనుమానాలను తొలగించేందుకు ధరణి కాలం నుంచి భూములు నిషేధిత జాబితాలోకి ఎలా చేరాయో వివరించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. గత పాలనలో ఎన్ని ఎకరాలు జాబితాలో చేరాయి, వాటిలో ఎన్ని రిజిస్ట్రేషన్లు జరిగాయి, ఎవరి పేర్లపై లావాదేవీలు నమోదయ్యాయి, ప్రస్తుత ప్రభుత్వం ఎన్ని భూములను విముక్తి చేసిందో సభలో వివరించే అవకాశం ఉంది. బీఆర్ఎస్ ఆరోపణలకు గణాంకాలతో సమాధానం ఇచ్చి, భూ వ్యవహారంపై తమ వాదనను ప్రజల ముందు స్పష్టంగా ఉంచాలని కాంగ్రెస్ భావిస్తోంది. ఈ చర్చకు అధికార పక్షం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోంది. భూముల సమస్యలో బాధితులకు పరిష్కారం దక్కిందా, ఇంకా ఎలాంటి ఫిర్యాదులు పెండింగ్‌లో ఉన్నాయనే అంశం కూడా ప్రాధాన్యం పొందవచ్చు. సభలో వెల్లడయ్యే సంఖ్యలు రాజకీయ వాదనలకు కీలక ఆధారంగా మారనున్నాయి. ఇదే సమయంలో ప్రభుత్వం తీసుకున్న చర్యలతో ఎంతమంది భూయజమానులకు ప్రయోజనం కలిగిందో కూడా వివరించవచ్చు. దీంతో ఈ అంశం సభలో కీలకంగా మారనుంది. భూభారతి అమల్లోకి వచ్చిన తర్వాత కొత్తగా ఒక్క అంగుళం భూమిని కూడా 22ఏ జాబితాలో చేర్చలేదని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పలు సందర్భాల్లో చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో ధరణి నిర్వహణ సమయంలో ప్రైవేట్ భూములను వివాదాస్పద కేటగిరీలో చేర్చి, తర్వాత వాటిని తొలగించి రిజిస్ట్రేషన్లు చేసినట్లు ఆయన ఆరోపించారు. ఈ వ్యవహారానికి సంబంధించిన పూర్తి వివరాలు బయటపెడతానని మంత్రి ఇప్పటికే హెచ్చరించారు. అసెంబ్లీలో చర్చ జరిగితే బీఆర్ఎస్ నేతలు, వారికి అనుకూలంగా ఉన్న వ్యక్తుల భూముల వివరాలు కూడా ప్రస్తావనకు వచ్చే అవకాశం ఉందన్న చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది. దీంతో సభలో మాటల యుద్ధం మరింత ముదిరే సూచనలు కనిపిస్తున్నాయి. ప్రైవేట్ ఆస్తులను ప్రభుత్వ ఆస్తులతో కలిపి చూడటం వల్ల ఏర్పడిన సమస్యలపై కూడా ప్రభుత్వం వివరణ ఇవ్వవచ్చని తెలుస్తోంది. జాబితాలోని నమోదులపై జిల్లాల వారీ వివరాలు బయటకు వస్తే స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ఇలాంటి వివరాలు వెలుగులోకి వస్తే ఇప్పటివరకు సాగిన ఆరోపణలకు కొత్త మలుపు రావచ్చు. రెవెన్యూ అధికారుల ప్రకారం గత బీఆర్ఎస్ పాలనలో నిషేధిత జాబితాలో చేరిన వాటిలో 23,136 ఎకరాలను కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటి వరకు విముక్తి చేసింది. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను పరిశీలించిన తర్వాత వివరాలు స్పష్టంగా ఉన్న భూములను జాబితా నుంచి తొలగించినట్లు అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం నిషేధిత జాబితాలో మొత్తం 2,49,97,312 ఎకరాల భూమి ఉన్నట్లు లెక్కలు సూచిస్తున్నాయి. ఇందులో అటవీ, అసైన్డ్, ప్రభుత్వ, ఇరిగేషన్, చెరువుశిఖం, పార్కులు, దేవాదాయ, రహదారులు, ఇతర కేటగిరీల భూములు ఉన్నాయి. ప్రభుత్వ, ప్రైవేట్ హక్కుల మధ్య వివాదాల్లో ఉన్న వ్యవసాయ భూముల విస్తీర్ణం 3,73,524 ఎకరాలుగా అధికారులు పేర్కొన్నారు. బాధిత రైతులు దరఖాస్తు చేసుకుంటే అధికారులు పరిశీలన జరిపి అర్హత ఉన్న భూములను క్లియర్ చేస్తామని చెబుతున్నారు. దీంతో రికార్డుల పరిశీలన, హక్కుల నిర్ధారణ, రిజిస్ట్రేషన్ సమస్యల పరిష్కారం వంటి అంశాలు కూడా చర్చలోకి రావచ్చు. నిషేధిత జాబితా వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలు సమావేశాలపై ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి. అధికారుల నివేదికలు సభలో చర్చకు వస్తే పరిస్థితిపై స్పష్టత పెరుగుతుంది.



# కేసీఆర్ కాదు.. రేవంత్ రాజీనామా చేయాలి

**మొదటిపేజీ తరువాయి**

పాలనకు మధ్య ఉన్న తేడాను గుర్తించాలని సూచించారు. కరీంనగర్ వేదికగా ఆయన చేసిన వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో మరోసారి చర్చకు దారితీశాయి. ఇది కేవలం రాజకీయ విమర్శగా కాకుండా ఉద్యోగాలు కోరుతున్న యువతలో చర్చకు కారణమైంది. ప్రభుత్వ పనితీరుపై ప్రశ్నలు పెరగడం సహజమేనని ఆయన చెప్పారు. ప్రజాస్వామ్యంలో పాలకులను ప్రశ్నించడం ప్రతి పౌరుడి హక్కు అని గుర్తుచేశారు. కేసీఆర్ రాజీనామా చేయాలనే కాంగ్రెస్ డిమాండ్‌కు బదులుగా, ఓటుకు నోటు కేసులో ఆరోపణలు ఎదుర్కొన్న రేవంత్ రెడ్డే రాజీనామా చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. కేసీఆర్‌తో పెట్టుకుంటే రాజకీయంగా కాంగ్రెస్‌కు భారీ ఎదురుదెబ్బ తప్పదని హెచ్చరించారు. సినీ డైలాగ్‌ను గుర్తుచేస్తూ చేసిన ఈ వ్యాఖ్యలు సభలో ఉత్సాహాన్ని పెంచాయి. తెలంగాణ కోసం పోరాడిన నాయకుడిని బలహీనపర్చడం సాధ్యం కాదని ఆయన అన్నారు. కాంగ్రెస్ నాయకులు చేస్తున్న విమర్శలకు ప్రజలే సమాధానం చెబుతారని పేర్కొన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రభుత్వం తన పనితీరుపై దృష్టి పెట్టాలని సూచించారు. వ్యక్తిగత రాజకీయ విమర్శలకంటే ఉద్యోగాలు, విద్య, అవకాశాలపై చర్చ జరగాలని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. యువత సమస్యలను పట్టించుకోకుండా కేవలం ప్రత్యర్థులను టార్గెట్ చేయడం వల్ల పాలన మెరుగుపడదని స్పష్టం చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో నాయకులు తమ బాధ్యతలను గుర్తించుకోవాలని సూచించారు. కేసీఆర్‌పై విమర్శలు చేయడం ద్వారా ప్రజా సమస్యలు పరిష్కారం కావని చెప్పారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలపై అధికారిక వివరాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. యువతకు నమ్మకం కలిగించే చర్యలు వెంటనే ప్రారంభించాలని కోరారు. జెన్ జీ యువత శక్తిని తక్కువగా అంచనా వేయొద్దని కేటీఆర్ కాంగ్రెస్‌కు సూచించారు. యువత ఒకసారి నడుం బిగిస్తే రాజకీయ సమీకరణాలు వేగంగా మారతాయని చెప్పారు. కేంద్రంలో నరేంద్ర మోదీ స్థాయిలో ఉన్న నాయకుడిపై కూడా యువత ప్రభావం చూపిందని ఉదాహరణగా ప్రస్తావించారు. అలాంటప్పుడు తెలంగాణలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం యువత ప్రశ్నలను తేలికగా తీసుకోకూడదని హెచ్చరించారు. ఎన్నికల సమయంలో యూత్ డిక్లరేషన్ పేరుతో ఇచ్చిన హామీలను గుర్తుచేస్తూ, ఏడాదికి రెండు లక్షల ఉద్యోగాల మాట ఏమైందని ప్రశ్నించారు. ఉద్యోగ క్యాలెండర్, నియామక ప్రక్రియ, పరీక్షల నిర్వహణపై స్పష్టత కావాలని డిమాండ్ చేశారు. సోషల్ మీడియా, డిజిటల్ ప్రపంచంలో చురుకుగా ఉండే కొత్త తరం తమ హక్కులపై అవగాహన పెంచుకోవాలని పిలుపునిచ్చారు. యువ ఓటర్ల తీర్పు భవిష్యత్తు రాజకీయాలను నిర్ణయిస్తుందని పేర్కొన్నారు. నియామక ప్రక్రియలో ఆలస్యం జరిగితే పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు నష్టపోతారని చెప్పారు. ప్రతి జిల్లాలో యువతకు కెరీర్ మార్గదర్శక కార్యక్రమాలు అవసరమని పేర్కొన్నారు. ప్రభుత్వ నిర్ణయాలను యువత స్వయంగా పరిశీలించాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రులు పరస్పరం విభేదాలతో సమయం గడుపుతున్నారని కేటీఆర్ ఆరోపించారు. ముఖ్యమంత్రి పదవి, మంత్రి కుర్చీల చుట్టూ రాజకీయ పోటీ పెరిగిందని విమర్శించారు. ప్రజా సమస్యలకు పరిష్కారాలు చూపాల్సిన సమయంలో అంతర్గత గొడవలు బయటపడుతున్నాయని అన్నారు. తెలంగాణ ప్రజలు ఎదుర్కొంటున్న నిరుద్యోగం, విద్యా సమస్యలు, సంక్షేమ అంశాలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి రాకముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా పరిశీలించాలని యువతను కోరారు. మాటలు కాకుండా ఫలితాలను కొలిచే రాజకీయ సంస్కృతి రావాలని సూచించారు. పాలనలో పారదర్శకత, బాధ్యత కనిపించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలంటే ప్రభుత్వం విమర్శలకు సమాధానంగా పనితీరును చూపాలని స్పష్టం చేశారు. కరీంనగర్ సభలో కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు బీఆర్ఎస్ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపాయి. అంతర్గత రాజకీయాల ప్రభావం పాలనపై పడకుండా మంత్రులు సమన్వయంతో పనిచేయాలని కేటీఆర్ సూచించారు. ప్రజల కోసం తీసుకున్న నిర్ణయాలు సమయానికి అమలయ్యేలా వ్యవస్థను బలోపేతం చేయాలని కోరారు. అధికార యంత్రాంగం కూడా జవాబుదారీతనంతో వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రం కోసం గతంలో జరిగిన పోరాటాలను గుర్తుచేసిన కేటీఆర్, కాంగ్రెస్‌పై ప్రజల అసంతృప్తి పెరుగుతోందని వ్యాఖ్యానించారు. ప్రత్యేక రాష్ట్రం ఇచ్చిన పార్టీగా చెప్పుకునే కాంగ్రెస్‌పై ప్రజలు భవిష్యత్తులో కఠిన నిర్ణయం తీసుకుంటారని హెచ్చరించారు. గత ఎన్నికల సమయంలో యువతకు ఇచ్చిన హామీలు అమలైతేనే ప్రజల్లో విశ్వాసం పెరుగుతుందని అన్నారు. రాజకీయ పంచ్‌లతో సాగిన ఆయన ప్రసంగం కొత్త తరాన్ని ఆకట్టుకునేలా సాగింది. ప్రత్యర్థులపై విమర్శలు చేయడం కంటే ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడం ప్రభుత్వ బాధ్యత అని కేటీఆర్ పేర్కొన్నారు. యువత ఉద్యోగం, విద్య, భవిష్యత్తు భద్రత కోసం ప్రశ్నించే సమయం వచ్చిందని చెప్పారు. రాబోయే రోజుల్లో యువ ఓటర్లే రాజకీయ దిశను నిర్ణయిస్తారని తెలిపారు. కరీంనగర్ సదస్సు ద్వారా బీఆర్ఎస్ కొత్త తరాన్ని ఆకర్షించే ప్రయత్నాన్ని బలంగా ముందుకు తీసుకెళ్లింది. ఈ వ్యాఖ్యలపై కాంగ్రెస్ నుంచి ఎలాంటి స్పందన వస్తుందో ఇప్పుడు ఆసక్తిగా మారింది. వచ్చే ఎన్నికల వరకు ఈ అంశాలు రాజకీయ చర్చలో కీలకంగా ఉండే అవకాశం కనిపిస్తోంది. యువ ఓటర్ల స్పందనపై అన్ని పార్టీలు దృష్టి పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది.



# రాజగోపాల్ రెడ్డి రూట్ మారిందా?

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తాజాగా చేసిన వ్యాఖ్యలు తెలంగాణ కాంగ్రెస్ రాజకీయాల్లో ఆసక్తికర చర్చకు తెరలేపాయి. సీఎం రేవంత్‌రెడ్డితో తనకు విభేదాలు ఉన్నప్పటికీ, ఆయనను వ్యక్తిగతంగా ఎప్పుడూ దూషించలేదని రాజగోపాల్‌రెడ్డి స్పష్టం చేశారు. కొన్ని విధానపరమైన అంశాల్లో మాత్రమే భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశానని తెలిపారు. కాంగ్రెస్ పార్టీని మరోసారి అధికారంలోకి తీసుకురావడమే తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. రాష్ట్రంలో పార్టీ బలోపేతానికి ప్రతి నాయకుడు సమష్టిగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. వ్యక్తిగత అభిప్రాయాలను రాజకీయ విభేదాలుగా చూడవద్దని సూచించారు. తన వ్యాఖ్యల వెనుక ఎలాంటి రాజకీయ కుట్ర లేదని వివరించారు. పార్టీ ప్రయోజనమే తనకు ముఖ్యమని వెల్లడించారు. తాజా ప్రకటనతో ముఖ్యమంత్రి వర్గంతో రాజగోపాల్‌రెడ్డి సంబంధాలపై కొనసాగుతున్న ఊహాగానాలకు కొంత స్పష్టత వచ్చింది. రాబోయే రోజుల్లో కూడా అభివృద్ధి, పార్టీ ఐక్యతపై ప్రత్యేక దృష్టి పెడతానని ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రయోజనాలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటానని ఆయన స్పష్టంగా చెప్పారు. నిధుల కేటాయింపుపైనా రాజగోపాల్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నియోజకవర్గాలకు లభించిన స్థాయిలోనే తన మునుగోడుకు నిధులు అందడం సంతోషంగా ఉందన్నారు. గతంలో తన ప్రాంతానికి సరైన ప్రాధాన్యం దక్కడం లేదనే భావన ఉండేదని, ప్రస్తుతం పరిస్థితి మారిందని చెప్పారు. నియోజకవర్గ అభివృద్ధి విషయంలో మాత్రం ఎట్టి పరిస్థితుల్లో రాజీ పడబోనని స్పష్టం చేశారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా పనులు వేగంగా పూర్తిచేయాలని అధికారులను కోరారు. మౌలిక వసతులు, రహదారులు, తాగునీరు, విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. మునుగోడు ప్రజలకు ఇచ్చిన హామీలను దశలవారీగా నెరవేర్చే బాధ్యత తనపై ఉందని తెలిపారు. అభివృద్ధి పనుల్లో రాజకీయ భేదాలకు చోటు ఉండకూడదని స్పష్టం చేశారు. నియోజకవర్గానికి వచ్చిన అవకాశాలను వినియోగించుకుంటానని హామీ ఇచ్చారు. ప్రజా ప్రయోజనమే తన రాజకీయ ప్రాధాన్యమని మరోసారి స్పష్టం చేశారు. ప్రజలకు ఉపయోగపడే పనులకు ప్రాధాన్యం ఇస్తానన్నారు. బీఆర్ఎస్ పాలనలో కాంగ్రెస్ కార్యకర్తలు ఎదుర్కొన్న కష్టాలను కూడా రాజగోపాల్‌రెడ్డి గుర్తుచేశారు. పార్టీ కోసం క్షేత్రస్థాయిలో పోరాడిన కార్యకర్తలకు ఎలాంటి అన్యాయం జరగకూడదని స్పష్టం చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత కార్యకర్తల పాత్రను గుర్తించి వారికి తగిన గౌరవం కల్పించాలని కోరారు. గ్రామస్థాయి నాయకుల నుంచి సీనియర్ నేతల వరకు అందరినీ సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత పార్టీపై ఉందన్నారు. కార్యకర్తల కష్టాలను విస్మరిస్తే సంస్థాగతంగా నష్టం జరుగుతుందని హెచ్చరించారు. పార్టీ బలోపేతానికి స్థానిక నాయకత్వం కీలకమని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఇప్పటి నుంచే కేడర్‌ను సమాయత్తం చేయాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. అంతర్గత విభేదాలు పార్టీ విజయాన్ని దెబ్బతీయకుండా ప్రతి నేత బాధ్యతగా వ్యవహరించాలన్నారు. కార్యకర్తల మనోధైర్యం పెంచేందుకు నాయకత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. పార్టీని తిరిగి ప్రజల విశ్వాసానికి కేంద్రంగా నిలపాలన్నదే తన సంకల్పమని చెప్పారు. మంత్రి పదవిపై కూడా రాజగోపాల్‌రెడ్డి స్పష్టమైన వైఖరి వెల్లడించారు. తనకు పదవి వస్తుందా లేదా అన్నది పూర్తిగా కాంగ్రెస్ అధిష్ఠానం నిర్ణయిస్తుందని చెప్పారు. వ్యక్తిగతంగా పదవి కోసం ఎలాంటి ఒత్తిడి చేయడం లేదని తెలిపారు. పార్టీ నాయకత్వం తీసుకునే నిర్ణయాన్ని గౌరవిస్తానని వెల్లడించారు. తనకు అప్పగించిన బాధ్యతను సమర్థంగా నిర్వహించడమే ముఖ్యమని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, ఎల్లుండి జరగనున్న మంత్రివర్గ విస్తరణ నేపథ్యంలో ఆయన వ్యాఖ్యలకు రాజకీయ ప్రాధాన్యం పెరిగింది. విస్తరణలో రాజగోపాల్‌రెడ్డికి చోటు దక్కుతుందా అన్న ప్రశ్న ఇప్పుడు కాంగ్రెస్ వర్గాల్లో చర్చగా మారింది. ప్రాంతీయ సమీకరణాలు, సామాజిక ప్రాతినిధ్యం, సీనియారిటీ, పార్టీ అవసరాలను అధిష్ఠానం పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉంది. పలువురు నేతల పేర్లు పరిశీలనలో ఉన్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. తుది జాబితాపై కాంగ్రెస్ శ్రేణులు ఎదురుచూస్తున్నాయి. అధిష్ఠానం నిర్ణయం కోసం పార్టీ నేతలు చూస్తున్నారు. విస్తరణ తర్వాత రాజకీయ సమీకరణాలు మారే అవకాశం ఉంది. మొత్తంగా రాజగోపాల్‌రెడ్డి తాజా వ్యాఖ్యలు సీఎం రేవంత్‌రెడ్డితో సంబంధాలపై కొత్త సంకేతాలను ఇచ్చాయి. గతంలో వెలువడిన భిన్న స్వరాల స్థానంలో ప్రస్తుతం పార్టీ ఐక్యత, అభివృద్ధి, కార్యకర్తల సంక్షేమం గురించి ఆయన మాట్లాడటం గమనార్హంగా మారింది. ముఖ్యమంత్రి నాయకత్వాన్ని లక్ష్యంగా చేసుకుని తీవ్ర విమర్శలు చేయకుండా, కొన్ని అంశాల్లో మాత్రమే తన అభిప్రాయ భేదాలను పరిమితం చేసినట్టు ఆయన మాటలు సూచిస్తున్నాయి. మంత్రివర్గ విస్తరణ సమీపిస్తున్న వేళ ఈ వైఖరి ప్రాధాన్యం సంతరించుకుంది.





# గోకుల్ ప్లాట్స్‌లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

- **విద్యార్థుల్లో ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించాలి**
- **డాక్టర్ నూకారపు శ్రీనివాస్**

**శేరిలింగంపల్లి - విశాల భారతి**

వెంకట్రామణ కాలనీ గోకుల్ ప్లాట్స్‌లో డ్రీమ్ ఫర్ గుడ్ సొసైటీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. నూకారపు శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయ దినోత్సవం డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ సేవలకు గుర్తుగా జరుపుకుంటున్నామని తెలిపారు. ఎంత ఉన్నత స్థాయికి ఎదిగినా తాను ఉపాధ్యాయుడినే విషయాన్ని ఆయన ఎప్పుడూ మర్చిపోలేదన్నారు. ఆయన జీవితం నుంచి మూలాలను మరచిపోకపోవడం, నిరంతరం నేర్చుకోవడం అనే రెండు విషయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.సాంకేతికత వేగంగా మారుతున్న నేపథ్యంలో విద్యార్థులు కొత్త విషయాలను నేర్చుకోవడంతో పాటు తెలియని విషయాలను ప్రశ్నించి తెలుసుకోవాలని చెప్పారు. విద్యార్థుల్లో ఆలోచనా శక్తి, ప్రశ్నించే తత్వం, విలువలను పెంపొందించడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. తల్లిదండ్రులు తొలి గురువులైతే.. పాఠశాల ఉపాధ్యాయులు రెండో గురువులని, వారిని గౌరవించాలని సూచించారు.విద్యార్థులు తమ భవిష్యత్తుపై స్పష్టమైన లక్ష్యాలను ఏర్పరచుకుని నిరంతరం కృషి చేయాలని, ఉన్నత స్థాయికి చేరుకునేలా ఉపాధ్యాయులు సులభంగా అర్థమయ్యే విధంగా బోధించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సొసైటీ వ్యవస్థాపకురాలు చావా అరుణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## శంషాబాద్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

### మహిళ దుర్మరణం

**రాజేంద్రనగర్, విశాల భారతి :** ఎయిర్‌పోర్ట్ అప్రోచ్ రోడ్డులోని ఆర్ఓబీ యూటర్న్ సమీపంలో శనివారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో బైక్‌పై పిలియన్ రైడర్‌గా ప్రయాణిస్తున్న పుల్లమోని రాధిక (33) తీవ్ర గాయాలతో మృతి చెందారు. ఈ ఘటనతో కుటుంబ సభ్యులు విషాదంలో మునిగిపోయారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాధిక బైక్ నంబర్ TS07HX0918పై పిలియన్ రైడర్‌గా ప్రయాణిస్తున్నారు. ఈ క్రమంలో ఉదయం సుమారు 6:43 గంటల సమయంలో శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ అప్రోచ్ రోడ్డులోని ఆర్ఓబీ యూటర్న్ వద్దకు చేరుకోగానే, వెనుక నుంచి వచ్చిన TG07X8636 నంబర్ గల కారు బైక్‌ను బలంగా ఢీకొట్టింది. కారు డ్రైవర్ వాహనాన్ని అతివేగంగా, నిర్లక్ష్యంగా నడపడం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు ప్రాథమికంగా తెలుస్తోంది. కారు ఢీకొట్టడంతో బైక్‌పై ఉన్న రాధిక రోడ్డుపై పడిపోయారు. ఈ ప్రమాదంలో ఆమె తల, ముఖానికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు, వాహనదారులు వెంటనే సహాయక చర్యలు చేపట్టి రాధికను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. అయితే ఆమె పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యులు పరీక్షించగా, అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.

# కొత్తగూడెంలో కదం తొక్కిన విద్యార్థులు, యువకులు

- విద్యార్థి, యువత సమస్యలపై బీఆర్ఎస్ గళం
- బిఆర్ఎస్ వి ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ
- రూ.13 వేల కోట్ల ఫీజు బకాయిలు వెంటనే విడుదల చేయాలి
- ఖాళీ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు ఇవ్వాలి
- ఎంపీ వద్దిరాజు
- జీవో 97ను రద్దు చేయాలని డిమాండ్




**భద్రాద్రి ప్రతినిధి: విశాల భారతి సెప్టెంబర్ 5:**

కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనలో విద్యార్థులు, నిరుద్యోగ యువత తీవ్రంగా నష్టపోతున్నారని బీఆర్ఎస్ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ఆరోపించారు. విద్యార్థి, యువత సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బిఆర్ఎస్ వి ఆధ్వర్యంలో శనివారం కొత్తగూడెంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. లక్ష్మీదేవిపల్లి మార్కెట్ యార్డు నుంచి గణేష్ టెంపుల్ వరకు సాగిన ర్యాలీలో విద్యార్థులు, నిరుద్యోగ యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్లకార్డులు, జెండాలు, బ్యానర్లతో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ర్యాలీకి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ వద్దిరాజు రవిచంద్ర విద్యార్థులతో కలిసి నడిచారు. గణేష్ టెంపుల్ వద్ద జరిగిన సభలో ఎంపీ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో విద్యార్థులు కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. తమ భవిష్యత్తు కోసం కళాశాలల్లో చదువుకోవాల్సిన విద్యార్థులు సమస్యల పరిష్కారం కోసం రోడ్లపైకి రావడం బాధాకరమన్నారు.

రూ.13 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, పాలిటెక్నిక్ విద్యార్థులకు ఇబ్బందిగా ఉన్న జీవో 97ను రద్దు చేయాలని, ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు జారీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యువతకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కిలారు నాగేశ్వరరావు, కనగాల బాలకృష్ణ, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, వేల్పుల దామోదర్, టిఆర్ఎస్వి జిల్లా కోఆర్డినేటర్ సంకుబాపన అనుదీప్, నియోజకవర్గ అధ్యక్షుడు మధుచంద్‌తో పాటు పలువురు నాయకులు, విద్యార్థులు, యువకులు పాల్గొన్నారు.

## జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం దక్కడం అదృష్టం : గడ్డమీది బాలరాజు



**కూకట్ పల్లి విశాల భారతి:** జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా జగద్గిరిగుట్ట లోని సంస్కృతి పాఠశాల ప్రధానోపాధ్యాయులు గడ్డమీది బాలరాజు అందుకున్నారు. శనివారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాన్ని జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాల్ అహ్మద్, జిల్లా విద్యాశాఖ అధికారిని రేణుకల చేతుల మీదుగా ఈ అవార్డును తీసుకున్నారు. ఈ సందర్భంగా గడ్డమీది బాలరాజు మాట్లాడుతూ తనకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం దక్కడం గొప్ప అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. సామాన్య ప్రజానీకం అధికంగా నివసించే ప్రాంతంలో ఓ ప్రైవేటు పాఠశాల అతి తక్కువ ఫీజులతో నెలకొల్పి విద్యను అందించడం సంతోషంగా ఉందన్నారు. ప్రయివేట్ విద్య అందని ద్రాక్ష అనుకుంటున్న ఈ రోజుల్లో తాను నెలకొల్పిన పాఠశాలలో బడుగు, బలహీన ప్రజల స్థోమతకు తగిన విధంగా ఫీజులు ఉంటాయన్నారు. విద్యా సంస్థలతోనే కాకుండా తాను చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం దక్కిందని హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను చేరువ చేసేందుకు పాటుపడుతానని స్పష్టం చేశారు. తనకు జిల్లా పురస్కారం దక్కడానికి చొరవ చూపిన జిల్లా ట్రస్మా, కుత్బుల్లాపూర్ ట్రపసా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

## బాలానగర్ పోలీసులా ఆధ్వర్యంలో జడ్పీహెచ్ఎస్‌లో గురువులకు సన్మానం



**కూకట్ పల్లి విశాల భారతి:** ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం బాలానగర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (ZPHS) లో ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం. రమేశ్ ఆదేశాల మేరకు బాలానగర్ లా అండ్ ఆర్డర్ సీఐ జి. ప్రశాంత్, ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్ పాఠశాలను సందర్శించి, ఉపాధ్యాయులను శాలువాలతో సత్కరించి దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సీఐ జి. ప్రశాంత్ మాట్లాడుతూ— "విద్యార్థులకు కేవలం పాఠాలు చెప్పడమే కాకుండా, వారిలో క్రమశిక్షణ, నైతిక విలువలను పెంపొందిస్తూ సమాజ నిర్మాణానికి పునాదులు వేస్తున్న ఉపాధ్యాయుల సేవలు అమూల్యమైనవి. 'ఒక సదుపాధ్యాయుడు వందలాది మంది భవిష్యత్తును తీర్చిదిద్దగలడు' అన్న సూక్తిని నిజం చేస్తూ, రేపటి పౌరులను తీర్చిదిద్దుతున్న గురువులందరికీ నా హృదయపూర్వక శుభాకాంక్షలు" అని పేర్కొన్నారు. సన్మాన కార్యక్రమం అనంతరం ఏర్పాటు చేసిన ముఖాముఖిలో ఇరువురు సీఐలు విద్యార్థులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ నిబంధనలు, హెల్మెట్ ధరించడం, మైనర్ డ్రైవింగ్ చేయకపోవడం, రోడ్డు భద్రతా నియమాలు పాటించడంపై మార్గదర్శనం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అపరిచితులతో ఓటీపీలు (OTP), బ్యాంకు వివరాలు పంచుకోవద్దని హెచ్చరించారు. మాదకద్రవ్యాల నివారణ, అవగాహనలో భాగంగా డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ, అత్యవసర సమయాల్లో భయపడకుండా వెంటనే పోలీసులను సంప్రదించాలని లేదా '100 / 1930' సాయం తీసుకోవాలని సూచించారు. విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు అధికారులు ఆసక్తికరంగా సమాధానాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ శ్వేతా, పాఠశాల ప్రధానోపాధ్యాయిని (హెచ్ఎం) అరుణ జ్యోతి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## భూ భారతి పేరుతో భూముల హక్కులను హరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

### బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు



**కూకట్ పల్లి విశాల భారతి:** భూ భారతి పేరుతో పేదలు మధ్యతరగతి ప్రజలు రైతులకు చెందిన భూములను సెక్షన్ 22A పరిధిలో చేర్చడాన్ని వ్యతిరేకిస్తూ తెలంగాణ భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఇందిరాపార్క్ వద్ద నిర్వహించిన 'ఛలో ఇందిరాపార్క్-మహా దీక్ష' కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు కంచి మహేందర్ లు పాల్గొన్నారు. ప్రజల భూముల హక్కులను పరిరక్షించడంతో పాటు రైతులు, సామాన్య ప్రజల ప్రయోజనాలను కాపాడేందుకు బీజేపీ చేస్తున్న పోరాటానికి మద్దతుగా వారు నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజలకు సంబంధించిన భూములపై హక్కులను కాపాడేందుకు బీజేపీ నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని రాజేశ్వరరావు పేర్కొన్నారు. పేదలు రైతులు, మధ్యతరగతి కుటుంబాల భూ హక్కులకు భంగం కలగకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.ప్రజల భూముల హక్కుల పరిరక్షణ కోసం బీజేపీ పోరాటం నిరంతరం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు.

## లక్ష్యశ్రీ ఆదర్శప్రాయం

- ఆమెను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలి
- కొమరం భీం నిలయ కార్యదర్శి జవ్వాది మురళీకృష్ణ

**భద్రాద్రి ప్రతినిధి, విశాలాభారతి :** చర్లకు చెందిన 6వ తరగతి విద్యార్థిని లక్ష్యశ్రీ ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని వనవాసీ కళ్యాణ పరిషత్ కొమరం భీం విద్యార్థి నిలయ కార్యదర్శి జవ్వాది మురళీకృష్ణ అన్నారు. హైదరాబాద్‌లో జరిగిన కరాటే పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించిన సందర్భంగా లక్ష్యశ్రీని వనవాసీ కళ్యాణ పరిషత్ ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా సత్కరించారు.కొమరం భీం విద్యార్థి నిలయ కమిటీ ఉపాధ్యక్షుడు గోగికార్ రాంలక్ష్మణ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మురళీకృష్ణ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. చిన్న వయసులోనే అద్భుత ప్రతిభ కనబరిచి గిన్నిస్ బుక్‌లో స్థానం సంపాదించిన లక్ష్యశ్రీని ప్రతి విద్యార్థి ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. ఆమెను స్ఫూర్తిగా తీసుకుని చదువుతో పాటు క్రీడలు, ఇతర రంగాల్లోనూ ప్రతిభ కనబరిచి ప్రాంతానికి పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని పిలుపునిచ్చారు.మన్యం ప్రాంతం నుంచి తొలిసారిగా గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో ఈ ప్రాంతానికి చెందిన చిన్నారి స్థానం సంపాదించడం గర్వకారణమని మురళీకృష్ణ పేర్కొన్నారు. భవిష్యత్తులో ఈ ప్రాంతంలోని మరింత మంది చిన్నారులు లక్ష్యశ్రీని స్ఫూర్తిగా తీసుకుని వివిధ రంగాల్లో రాణించి ప్రపంచస్థాయి గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు. లక్ష్యశ్రీలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి ప్రపంచానికి చాటిచెప్పిన కరాటే ట్రైనర్లు ముత్తు, రాహుల్, అలాగే విజ్ఞాన్ పాఠశాల యాజమాన్యాన్ని ఆయన అభినందించారు. తల్లిదండ్రులు నంబూరి శ్రీనివాసరావు-అశ్వని దంపతులు తమ కుమార్తెను మరింతగా ప్రోత్సహించి ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని కోరారు.ఈ కార్యక్రమంలో కొమరం భీం నిలయ కమిటీ సహ కోశాధికారి వేములపల్లి ప్రవీణ్ బాబు, నిలయ ప్రముఖులు వరలక్ష్మి, సంతోష్, ముఖేష్, గాదంశెట్టి ప్రసన్నలక్ష్మి, గాదంశెట్టి సుధారాణి, తల్లిదండ్రులు నంబూరి అశ్వని, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.



## వ్యవసాయంలో విభిన్న ఉపాధి అవకాశాలపై నైపుణ్యాభివృద్ధి శిక్షణ

**పాల్వంచ విశాల భారతి**: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం, పాల్వంచ క్లస్టర్ పరిధిలోని కొత్తూరు గ్రామం పేటచెరువు వద్ద ఆత్మ (వ్యవసాయ సాంకేతిక నిర్వహణ సంస్థ) ఆధ్వర్యంలో వ్యవసాయంలో విభిన్న ఉపాధి అవకాశాలు అనే అంశంపై నైపుణ్యాభివృద్ధి శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యవసాయ విస్తరణ అధికారి జి. నరేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లా వ్యవసాయ అధికారి వి. బాబురావు, మండల వ్యవసాయ అధికారి పి. శంభోశంకర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, వ్యవసాయ అనుబంధ రంగాల ద్వారా అదనపు ఆదాయం పొందే అవకాశాలపై అవగాహన కల్పించారు. అలాగే వివిధ రంగాలకు చెందిన నిపుణులు రైతులకు ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలు, వ్యవసాయంతో పాటు చేపట్టగల అనుబంధ కార్యకలాపాలు, వాటి ద్వారా ఆదాయాన్ని పెంచుకునే అవకాశాల గురించి వివరించారు. శిక్షణలో పాల్గొన్న రైతులకు మధ్యాహ్న భోజనంతో పాటు నోట్ పుస్తకాలు, కలాలను పంపిణీ చేశారు. అనంతరం శిక్షణపై రైతుల అభిప్రాయాలను సేకరించడంతో పాటు, శిక్షణలో వారు నేర్చుకున్న అంశాలపై చిన్న పరీక్ష నిర్వహించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో కొత్తూరు గ్రామంతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని, వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు మరియు ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలపై ఆసక్తిగా అవగాహన పొందారు.

## జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా బి. స్వప్న



**పాల్వంచ విశాల భారతి:** జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా స్థాయిలో 37 మంది ఉపాధ్యాయులను జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేయబడ్డారు. పాల్వంచ మండలం కొమ్ముగూడెం ఉన్నత పాఠశాలకు చెందిన సాంఘిక శాస్త్రం స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయురాలు బి.కామేశ్వరి 20252026 విద్యా సంవత్సరానికి 19 సంవత్సరాల నిరంతర విద్యా బోధనలో ఎస్ఎస్సిలో 100% ఫలితాలు సాధించి విద్యా బోధనలో వినూత్న పద్ధతులతో విద్యార్థులకు సరళంగా అర్థమయ్యే విధంగా నిరంతర బోధన చేస్తూ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ సైన్స్ ఫెయిర్, ఇన్స్పైర్ మానాక్ నందు విద్యార్థులకు థెరపీ తీస్తూ విద్యార్థుల ప్రతిభావంతులుగా కీర్తి తీర్చిదిచ్చినందుకు గాను జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ యొక్క సన్మాన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కొత్తగూడెం శాసనసభ్యులు పూనమ్నేని సాంబశివరావు చేతులు మీదిగా అవార్డు అందుకున్నారు.

## పోడు భూములపై ట్రెంచ్ తవ్వడాన్ని అడ్డుకున్న మాస్ లైన్ నాయకులు



**భద్రాద్రి ప్రతినిధి :విశాలభారతి సెప్టెంబర్ 5:** మండలంలోని మూకమామిడి రెవెన్యూ పరిధి రంగాపురం గ్రామంలో పోడు భూములపై ట్రెంచ్ తవ్వే ప్రయత్నాన్ని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ నాయకులు, గ్రామస్తులు శనివారం అడ్డుకున్నారు.గ్రామస్తుల కథనం ప్రకారం.. 2005 నుంచి రంగాపురం గ్రామానికి చెందిన పేద రైతులు పోడు భూములను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2023లో సాగుదారులుగా గుర్తించి పలువురికి హక్కు పత్రాలు మంజూరు చేసినట్లు తెలిపారు. ఇన్నేళ్లుగా గ్రామస్తులకు, సంబంధిత అధికారులకు ఎలాంటి వివాదాలు లేవని పేర్కొన్నారు.అయితే ప్రస్తుతం కార్పొరేషన్ అధికారులు గ్రామస్తులు సాగు చేసుకుంటున్న భూములపై ట్రెంచ్ తవ్వేందుకు ప్రయత్నించడం సరికాదని నాయకులు, గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. హక్కు పత్రాలు ఉన్న పోడు భూముల సరిహద్దులను దాటి రైతుల సాగు భూముల మధ్యలో ట్రెంచ్ తవ్వేందుకు ప్రయత్నించడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు.ఈ క్రమంలో అధికారులు ట్రెంచ్ తవ్వే ప్రయత్నం చేయడంతో గ్రామస్తులు, మాస్ లైన్ నాయకులు అక్కడికి చేరుకుని ఆందోళన చేపట్టారు. ట్రెంచ్ పనులను నిలిపివేయాలని అధికారులను డిమాండ్ చేస్తూ పనులను అడ్డుకున్నారు. పేద రైతులు అరఎకరం, ఎకరం చొప్పున సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని, వారి భూములపై అధికారులు దౌర్జన్యంగా ట్రెంచ్ తవ్వే ప్రయత్నాలను వెంటనే విరమించుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు. సమస్యను పరిష్కరించకుండా పనులు కొనసాగిస్తే గ్రామస్తులందరినీ సమీకరించి, ప్రజాసంఘాలు, వివిధ పార్టీలను కలుపుకుని పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

## డబుల్ బెడ్‌రూం ఇళ్ల లక్కీ డ్రా రద్దు చేయాలని వాటర్ ట్యాంక్ ఎక్కి నిరసన

**దేవరుప్పుల విశాల భారతి :** డబుల్ బెడ్‌రూం ఇళ్ల కేటాయింపునకు కలెక్టరేట్‌లో నిర్వహించనున్న లక్కీ డ్రాను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ దేవరుప్పుల మండలం కడవెండి గ్రామానికి చెందిన బాష్పాక కుమార్, పడమటింటి ఏసుపాదం నిరసనకు దిగారు. నెల్లుట్ల ఆర్టీసీ కాలనీలోని వాటర్ ట్యాంక్ ఎక్కి వారు ఆందోళన చేపట్టారు. అర్హులైన నిరుపేదలకు అన్యాయం జరిగే విధంగా లాటరీ పద్ధతిలో డబుల్ బెడ్‌రూం ఇళ్లను కేటాయించడం సరికాదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. లక్కీ డ్రా ప్రక్రియను వెంటనే నిలిపివేసి, గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ చేపట్టి నిజమైన అర్హులను గుర్తించి, వారికి మాత్రమే డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించాలని ప్రభుత్వాన్ని, అధికారులను కోరారు. అర్హులైన పేదలకు న్యాయం జరిగే వరకు తమ ఆందోళన కొనసాగిస్తామని వారు తెలిపారు.

## ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

**మహబూబాబాద్ జిల్లా విశాల భారతి**



ఉపాధ్యాయుల సేవలు సమాజ నిర్మాణంలో అత్యంత కీలకమని, విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని వక్తలు పేర్కొన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని మహబూబాబాద్‌లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో శనివారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్యం ఉత్సాహంగా పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు. ఈ సందర్భంగా రిటైర్డ్ సోషల్ స్టడీస్ ఉపాధ్యాయురాలు నాయిని ఉమా గోపాల్ రెడ్డి, కూచిపూడి నృత్య గురువు, కళాకారిణి, తాండవ నృత్యాలయ స్థాపకురాలు ఉదయశ్రీ మునిలను పాఠశాల యాజమాన్యం ఘనంగా సన్మానించింది. విద్యార్థులకు విద్యతో పాటు విలువలు, క్రమశిక్షణ, సంస్కారం, మంచి వ్యక్తిత్వాన్ని అలవర్చడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో గొప్పదని వారు వివరించారు. విద్యార్థులు తమ గురువులపై ఉన్న ప్రేమ, గౌరవం, కృతజ్ఞతలను సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా చాటుకున్నారు. పాటలు, నృత్యాలు, ప్రసంగాలు, ప్రత్యేక ప్రదర్శనలతో అలరించి ఉపాధ్యాయులను ఆకట్టుకున్నారు. విద్యార్థుల ప్రతిభా ప్రదర్శనలు వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ డాక్టర్ జె. ప్రమోద్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్రకు ప్రత్యామ్నాయం లేదన్నారు. మేనేజింగ్ డైరెక్టర్ మహేంద్ర రెడ్డి ఉపాధ్యాయుల అంకితభావాన్ని అభినందిస్తూ మరింత బాధ్యతతో, సమర్పణ భావంతో పనిచేయాలని సూచించారు. పాఠశాల ప్రిన్సిపల్ సుధీర్ కుమార్ మాట్లాడుతూ మారుతున్న విద్యా విధానంలో ఉపాధ్యాయులు కేవలం పాఠాలు బోధించే వారిగానే కాకుండా విద్యార్థులకు మార్గదర్శకులు, స్ఫూర్తిదాతలు, మెంటర్లుగా వ్యవహరించాలని అన్నారు. విద్యార్థుల్లో జ్ఞానంతో పాటు నైతిక విలువలు, ఆత్మవిశ్వాసం, బాధ్యతాయుతమైన పౌరస్ఫూర్తిని పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. "బోధిస్తూ.. స్ఫూర్తినిస్తూ.. భవిష్యత్తును నిర్మిస్తూ.." సాగిన ఈ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ఆనందోత్సాహాల మధ్య ఘనంగా ముగిశాయి.

## అంగనవాడి సేవలకు ఘన సన్మానం

- అంగనవాడి శ్రమకు తగ్గ వేతనం ఇవ్వాలి
- అంగనవాడి సేవలు ఘననీయమైనవి
- ప్రతి పనికి అంగనవాడిలే ప్రభుత్వ సేవలు చేసేది
- పిల్లలకు గర్భిణీలకు అందుబాటులో ఉండేది అంగన్వాడీలే
- వారి సేవలను గుర్తించి బిఆర్ఎస్ మహిళ నేత ఎండి ముంతాజ్ సన్మానం



**భద్రాచలం : విశాల భారతి;**

భద్రాచలం రాజుపేట కాలనీలో అంగనవాడి టీచర్స్ సుభద్ర, తిరుపతమ్మ లను బిఆర్ఎస్ మహిళా నేత ఎండి ముంతాజ్ ఆధ్వర్యంలో వారి సేవలను గుర్తించి ఘన సన్మానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా బి ఆర్ఎస్ మహిళా నాయకురాలు ఎండి ముంతాజ్ మాట్లాడుతూ అంగనవాడి ఇలా సేవలు గణనీయమైన వని ఆమె కొనియాడారు. వారి సేవలను గుర్తించి వారికి ఘనంగా శాలువాలతో సత్కరించడం జరిగిందని ఆమె పేర్కొన్నారు. ఇంటింటికి వెళ్లి చిన్న పిల్లలను తీసుకువచ్చి అంగన్వాడీ కేంద్రాల్లో వారికి చదువు నేర్పుతూ ఆటలు ఆడిపిస్తూ పాటలు పాడిపిస్తూ పిల్లల్లో పిల్లల అంగన్వాడీలు చాలా చొరవతో పిల్లలను తమ పిల్లలుగా భావించి సేవ చేస్తున్నారని ఆమె అన్నారు. అలాగే గర్భిణీ స్త్రీలకు వెన్నంటి ఉండి వారి ప్రసవ సమయం వరకు తోడుగా ఉంటున్నారని పిల్లలకు గర్భిణీ స్త్రీలకు ప్రోటీన్ ఫుడ్ సకాలంలో అందిస్తూ వారి యోగక్షేమాలు దగ్గరుండి మరి చూసుకోవటం జరుగుతుందని ఇటువంటి సేవలు చేయటం కేవలం అంగనవాడి టీచర్స్ కే సాధ్యపడుతుందని ఆమె కొనియాడారు. అదనంగా అంగన్వాడీలకు ప్రభుత్వ కార్యకలాపాలలో కూడా వారిని విశ్రాంతి లేకుండా ఉపయోగిస్తున్నారని ఇది చాలా బాధాకరమని కేవలం వారిని అంగనవాడి కేంద్రాల్లోనే వారి పనివారికి సరిపోతుందని అయినా సరే వారికి అదనపు పని అప్పజెప్పి వారి శ్రమను ఉపయోగించుకుంటున్నారని ఆమె అన్నారు. వారి శ్రమకి తగ్గ వేతనం కాంగ్రెస్ ప్రభుత్వం కల్పించాలని ఆమె కోరారు. అంగన్వాడి కేంద్రాలకు సొంత భవనాలను ఏర్పాటు చేయాలని ఆయాలకు ప్రభుత్వమే నేరుగా వేతనం చెల్లించాలని ఆమె అన్నారు. అంగన్వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించే దాంట్లో చొరవ చూపాలని అంగన్వాడి సేవలు ప్రజలు ఎంతగానో ఉపయోగించుకుంటున్నారని అంగన్వాడీలను ప్రభుత్వం ఆదరించాలని అంగనవాడి సేవలకు చిరు సత్కారంగా ఘనంగా వారిని సన్మానించడం చాలా సంతోషకరమైన విషయంగా ఆమె పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు ఎస్.కె రహీం, ఎస్కె ఖాదర్ బి , జక్కుల దేవి, కృష్ణవేణి, రత్నం, బేగం, ముత్యం, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ టీచర్లకు ఘన సన్మానం




**కొత్తగూడెం:విశాలభారతి :** ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా కొత్తగూడెం కార్పొరేషన్ 18వ డివిజన్ పరిధిలోని అంగన్వాడీ టీచర్లను డివిజన్ కార్పొరేటర్ కంచర్ల హిమాశ్రీ, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కంచర్ల జమలయ్య ఘనంగా సన్మానించారు .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నారులకు విద్యాబుద్ధులు నేర్పుతూ వారి భవిష్యత్‌కు బాటలు వేస్తున్న అంగన్వాడీ టీచర్ల సేవలు అభినందనీయమని అన్నారు. చిన్నారుల విద్యాభ్యాసంతో పాటు వారి ఆరోగ్యం, సంక్షేమం కోసం అంగన్వాడీ సిబ్బంది చేస్తున్న కృషిని కొనియాడారు. అనంతరం అంగన్వాడీ టీచర్లను శాలువాలతో సత్కరించారు.

# కురవి ప్రభుత్వ భూములు ఎవరి స్వాధీనంలో..?

- కురవి భూములపై కబ్జా కన్ను..!
- ప్రభుత్వ భూములు చేతులు మారుతున్నాయా..?
- కురవి ప్రభుత్వ భూములకు కబ్జా గ్రహణం!
- కురవి ప్రభుత్వ భూముల లెక్క తేల్చాల్సిందే!
- 275 ఎకరాల 22 గుంటల ప్రభుత్వ భూమికి లెక్కెక్కడ..?
- అబాది భూమి 43 ఎకరాల 09 గుంటలు
- సర్వే నంబర్ల వారీగా వివరాలు బహిర్గతం చేయాలి






**కురవి విశాలభారతి:**

కురవి గ్రామ రెవెన్యూ పరిధిలో ప్రభుత్వ భూములపై నెలకొన్న అనుమానాలకు తెరదించేందుకు సమగ్ర విచారణ చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. రికార్డుల ప్రకారం గ్రామ పరిధిలో 275 ఎకరాల 22 గుంటల ప్రభుత్వ భూమి ఉన్నట్లు పేర్కొంటుండగా, అందులో అబాది (జనావాస) భూమి 43 ఎకరాల 09 గుంటలు ఉన్నట్లు తెలుస్తోంది. అయితే ఈ భూముల ప్రస్తుత పరిస్థితి ఏమిటి..? ఎంత భూమి ప్రభుత్వ ఆధీనంలో ఉంది..? ఎక్కడెక్కడ వినియోగంలో ఉంది..? ఎక్కడైనా ఆక్రమణలు ఉన్నాయా..? అన్న ప్రశ్నలకు అధికారికంగా స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని ప్రజలు అంటున్నారు

**275 ఎకరాలపై పూర్తి లెక్క చెప్పాలి.**

ప్రభుత్వ భూమి ఎంత ఉందన్న దానిపై కేవలం విస్తీర్ణం చెప్పడం కాకుండా సర్వే నంబర్.. ఉప సర్వే నంబర్.. విస్తీర్ణం.. భూమి స్వభావం.. ప్రస్తుత వినియోగం.. ప్రభుత్వ రికార్డులో నమోదైన స్థితి.. క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితి వంటి పూర్తి వివరాలను బహిరంగపరచాలని స్థానికులు కోరుతున్నారు. ముఖ్యంగా 43 ఎకరాల 09 గుంటల అబాది భూమి విషయంలో మరింత స్పష్టత అవసరమని చెబుతున్నారు. ఈ భూమి మొత్తం ప్రభుత్వ ఆధీనంలోనే ఉందా..? ప్రజా అవసరాలకు వినియోగంలో ఉందా..? వ్యక్తులు ఎవరైనా స్వాధీనంలో ఉంచుకున్నారా..? అన్న అంశాలపై అధికారికంగా తేల్చాలని డిమాండ్ చేస్తున్నారు.

**సర్వే నంబర్ల వారీగా వివరాలు ఎక్కడ?**

ప్రభుత్వ భూములపై పారదర్శకత కోసం అధికారులు సర్వే నంబర్ల వారీగా పూర్తి జాబితాను ప్రజల ముందుంచాలని కోరుతున్నారు. ప్రతి సర్వే నంబర్‌కు సంబంధించిన విస్తీర్ణం, భూమి వర్గీకరణ, హద్దులు, ప్రస్తుత వినియోగం, రికార్డుల్లో నమోదైన హక్కులు, ఆక్రమణల స్థితి తదితర వివరాలను వెల్లడించాలని అంటున్నారు. రికార్డుల్లో ఒక విధంగా, క్షేత్రస్థాయిలో మరో విధంగా పరిస్థితి ఉంటే దానికి బాధ్యత ఎవరిదన్నది కూడా తేల్చాల్సిందేనని స్థానికులు పేర్కొంటున్నారు.

**రికార్డులు ఒకసారి..**

**భూమిపై పరిస్థితి మరోసారి పరిశీలించాలి**

ప్రభుత్వ భూములపై వాస్తవాలను నిర్ధారించేందుకు పహాణీ, అడంగల్, ఆర్ఓఆర్, సెత్వార్, ఎఫ్ఎమ్‌బీ, టిప్పన్, కాసరా పహాణి, ప్రభుత్వ భూముల రిజిస్టర్లు వంటి రెవెన్యూ రికార్డులను సమగ్రంగా పరిశీలించాలని డిమాండ్ చేస్తున్నారు. అదే సమయంలో కేవలం కార్యాలయ రికార్డులకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయి సర్వే నిర్వహించి హద్దులను గుర్తించాలని కోరుతున్నారు. అవసరమైతే జీపీఎస్ ఆధారిత సర్వే చేపట్టి ప్రతి ప్రభుత్వ భూమికి స్పష్టమైన హద్దులు నిర్ణయించాలని చెబుతున్నారు.

**రిజిస్ట్రేషన్ పత్రాలపైనా పరిశీలన అవసరం.**

ప్రభుత్వ భూములకు సంబంధించి రిజిస్ట్రేషన్ శాఖలో ఏవైనా లావాదేవీలు నమోదయ్యాయా..? ఏదైనా భూమి ప్రైవేట్ వ్యక్తుల పేర్లపై రిజిస్ట్రేషన్ అయిందా..? హక్కు పత్రాలు లేదా ఇతర ఆధారాలతో స్వాధీనం మారిందా..? అనే అంశాలను కూడా పరిశీలించాలని ప్రజలు కోరుతున్నారు. రెవెన్యూ రికార్డులు, రిజిస్ట్రేషన్ పత్రాలు, క్షేత్రస్థాయి పరిస్థితులను పరస్పరం సరిపోల్చితేనే ప్రభుత్వ భూముల వాస్తవ స్థితి బయటపడుతుందని పేర్కొంటున్నారు.

**ప్రభుత్వ భూములకు రక్షణ కల్పించాల్సిందే.**

ప్రభుత్వ భూములపై అనధికారిక ఆక్రమణలు ఉన్నట్లు విచారణలో తేలితే, సంబంధిత నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ ఆస్తి ప్రజల ఆస్తేనని, దాని రక్షణలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వరాదని అంటున్నారు.

**సమగ్ర సర్వేతోనే అనుమానాలకు తెర.**

కురవి గ్రామ రెవెన్యూ పరిధిలోని 275 ఎకరాల 22 గుంటల ప్రభుత్వ భూమిపై సమగ్ర సర్వే నిర్వహించి, సర్వే నంబర్ల వారీగా పూర్తి వివరాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు. ప్రభుత్వ భూమి ఎక్కడుంది..? ఎవరి ఆధీనంలో ఉంది..? ఎంత భూమి వినియోగంలో ఉంది..? ఎంత భూమి ఖాళీగా ఉంది..? ఎక్కడైనా ఆక్రమణలు జరిగాయా..? అన్న ప్రతి ప్రశ్నకు అధికారిక రికార్డులతో సమాధానం చెప్పాల్సిన సమయం ఆసన్నమైందని వారు అంటున్నారు. ప్రభుత్వ భూముల విషయంలో పారదర్శకత పాటించి, రికార్డులు రిజిస్ట్రేషన్లు క్షేత్రస్థాయి వాస్తవాలను సమన్వయం చేస్తూ సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తేవాలని, ఆక్రమణలు నిర్ధారణ అయితే బాధ్యులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## ఘనంగా ముత్యాలమ్మ బోనాలు



**మునుగోడు విశాలభారతి:** జక్కలవారి గ్రామంలోని ప్రజలు, యువత, మహిళలు, పెద్దలు అందరూ అమ్మవారికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో పండుగ వాతావరణం నెలకొని, భక్తుల సందడితో కార్యక్రమం ఎంతో వైభవంగా జరిగింది.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ముత్యాలమ్మ తల్లి ఆశీస్సులు జక్కలవారిగూడెం గ్రామ ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.జక్కల వారి గూడెం గ్రామ సర్పంచ్ జక్కల రేవతి మహేష్ యాదవ్ ఉప సర్పంచ్ జక్కల పార్వతమ్మ ముత్యాలు జక్కల కృష్ణ మాజీ సర్పంచ్ శ్రీను జక్కల మల్లయ్య పెద్ద గొల్ల జక్కుల ముత్తయ్య గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు

## సీతానగరం ప్రాథమిక పాఠశాలలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

**స్పీచ్‌తో అందర్నీ ఆకర్షించిన రెండవ తరగతి విద్యార్థి భాను భవ్యేష్**



( **విశాల భారతి) సెప్టెంబర్ 5 , :** ఉపాధ్యాయ దినోత్సవం వేడుకలు గూడూరు మండలం సీతానగరం పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు పులి దేవేందర్ ముదిరాజ్ మాట్లాడుతూ.. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జీవితం అందరికీ ఆదర్శనీయమని, పిల్లలు ఆయన మార్గాన్ని,ఒక లక్ష్యంగా ఎంచుకొని భవిష్యత్తులో స్థిరపడాలని హితబోధ చేశారు. కార్యక్రమంలో రెండవ తరగతి విద్యార్థి భాను భవ్యేష్ స్పీచ్ తో ఒక డాక్టర్ గా, లాయర్ గా, పోలీస్ ఆఫీసర్ గా ఆర్మీ జవానుగా స్థిరపడేందుకు ఉపాధ్యాయులు మనకు చదువు చెబుతున్నారని, నేను కలెక్టర్ అవుతానని ఒక దృఢ సంకల్పంతో మాట్లాడిన తీరు అందర్నీ ఆకర్షింప చేశాయి. చిన్నోడి స్పీచ్ కి అందరు కరతాల ధ్వనులతో అభినందించారు. ఈ కార్యక్రమంలో సహా ఉపాధ్యాయురాలు చర్ప దేవి, అంగన్వాడి టీచర్ కమల,శ్రీలత, హెల్త్ డిపార్ట్మెంట్ ఈశ్వరి, రమ్య, కవిత, పద్మ, తల్లిదండ్రులు : నాగమణి, ఆయా: వీరమ్మ లతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉపాధ్యాయులకు ఘన సన్మానం



**దేవరుప్పుల విశాల భారతి:** మండలంలోని నిర్మల గ్రామ జెడ్పీ హెచ్ఎస్ పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. గ్రామ సర్పంచ్ పల్లెర్ల సంధ్యారాణి నవీన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు జెడ్పి హెచ్ఎస్ ఇంచార్జ్ సర్జన్ రావు, రాధిక, దివ్య తదితరులను శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ పల్లెర్ల సంధ్యారాణి నవీన్ మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులు అందిస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మంచి విలువలను నేర్పించి ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని ఆకాంక్షించారు.ఉపాధ్యాయులు మాట్లాడుతూ తమను సన్మానించిన సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల అభివృద్ధి కోసం మరింత అంకితభావంతో పనిచేస్తామని పేర్కొన్నారు.

## ఐటీడీఏ స్థాయిలో ఏహెచ్ఎస్–బి మహబూబాబాద్‌కు ఘన గౌరవం

- ఉత్తమ ప్రధానోపాధ్యాయుడిగా బానోత్ కిషన్ నాయక్
- ఏడుగురు ఉపాధ్యాయులకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు



**మహబూబాబాద్, జిల్లా విశాల భారతి:** గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని ఉమ్మడి వరంగల్ జిల్లా ఐటీడీఏ పరిధిలోని గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో ఉత్తమ సేవలు అందించిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను ఎంపిక చేసి ఘనంగా సన్మానించారు. ఈ అవార్డుల్లో మహబూబాబాద్ గిరిజన ఆశ్రమ పాఠశాల బాలుర పాఠశాల (ఏహెచ్ఎస్-బి)కు విశిష్ట గౌరవం దక్కింది. ఈ పాఠశాల ప్రధానోపాధ్యాయులు బానోత్ కిషన్ నాయక్ ఉత్తమ ప్రధానోపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. అదే పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు దేవుల, ఖీమా, రాము, భద్రాజీ, రాములు, కిషన్, రవీందర్ ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. గురుపూజోత్సవం సందర్భంగా సెప్టెంబర్ 5న నిర్వహించిన కార్యక్రమంలో ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో చేతుల మీదుగా ప్రధానోపాధ్యాయుడు బానోత్ కిషన్ నాయక్‌తో పాటు ఎంపికైన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి అవార్డులు అందజేశారు. గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం, వారి ప్రతిభను వెలికితీయడం, విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న ఉపాధ్యాయుల సేవలకు ఈ అవార్డులు గుర్తింపుగా నిలిచాయి. ఒకే పాఠశాల నుంచి ప్రధానోపాధ్యాయుడితో పాటు ఏడుగురు ఉపాధ్యాయులు ఉత్తములుగా ఎంపిక కావడం పాఠశాల ఉపాధ్యాయ బృందం సమష్టి కృషికి నిదర్శనంగా నిలిచింది. ఈ సందర్భంగా అవార్డులు అందుకున్న ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులను పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, పలువురు విద్యాభిమానులు అభినందించారు. గురువుల సేవలకు దక్కిన ఈ గౌరవం గిరిజన విద్యారంగంలో మరింత నిబద్ధతతో పనిచేసేందుకు ప్రోత్సాహాన్ని అందిస్తుందని వారు పేర్కొన్నారు.

## స్టెల్లా మేరిస్ స్కూల్లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు



**బూర్గంపాడు / విశాల భారతి :** మోరంపల్లి బంజర స్టెల్లా మేరిస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయుల సేవలను, అంకితభావాన్ని, విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో వారి పాత్రను గుర్తుచేసుకుంటూ ఈ వేడుకలను ఆనందంగా జరుపుకున్నారు.ఈ కార్యక్రమానికి రెవ. ఫాదర్ ఆంథోనీ ముఖ్య అతిథిగా హాజరై ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఉపాధ్యాయులు సమాజ నిర్మాణంలో పోషిస్తున్న కీలక పాత్రను ఆయన కొనియాడారు. వేడుకల్లో భాగంగా ఉపాధ్యాయుల కోసం వివిధ సరదా ఆటలు, వినోద కార్యక్రమాలు నిర్వహించారు. ఉపాధ్యాయులు ఎంతో ఉత్సాహంగా ఆటల్లో పాల్గొని, ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమాలు పాఠశాలలో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని నెలకొల్పాయి.పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ సుమలత ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, విద్యార్థుల విద్యాభివృద్ధితో పాటు వారి నైతిక విలువలను పెంపొందించడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో ముఖ్యమని అన్నారు. ఉపాధ్యాయులు తమ అంకితభావంతో విద్యార్థులకు స్ఫూర్తిగా నిలవాలని ఆమె ఆకాంక్షించారు.ఈ వేడుకలు ఉపాధ్యాయుల మధ్య సంతోషాన్ని, ఐక్యతను పెంపొందిస్తూ ఎంతో ఉత్సాహంగా సాగాయి. చివరగా, ప్రతి ఉపాధ్యాయుని సేవలను గౌరవిస్తూ కార్యక్రమాన్ని ఆనందోత్సాహాలతో ముగించారు.

## సన్న వడ్ల బోనస్‌కు నమోదే కీలకం



**మరిపెడ విశాల భారతి:** ప్రభుత్వం సన్న వడ్లకు ప్రకటించిన క్వింటాకు రూ.500 బోనస్ పొందేందుకు రైతులు తప్పనిసరిగా పంట రకాన్ని నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి భాస్కర్ సూచించారు. శనివారం మండలంలో సన్న వడ్ల నమోదును పరిశీలించిన ఆయన, సెప్టెంబర్ 10 చివరి గడువు అని తెలిపారు.రైతులు తాము విత్తనాలు కొనుగోలు చేసిన షాపునకు వెళ్లి బిల్లు, రశీదును చూపించి ఏడు రకాల సన్న వడ్లలో తాము తీసుకున్న రకాన్ని నమోదు చేసుకోవాలని సూచించారు. నమోదు చేయకపోతే ప్రభుత్వం ప్రకటించిన బోనస్ అందే అవకాశం ఉండదని స్పష్టం చేశారు. రైతులందరూ గడువు తేదీలోపు నమోదు ప్రక్రియను పూర్తి చేసుకునేలా చూడాలని వ్యవసాయ శాఖ అధికారులు కోరారు.

## సంక్షేమ పాలనకు వెయ్యి రోజులు మరిపెడలో కాంగ్రెస్ జోష్



**మరిపెడ విశాల భారతి:** కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల ప్రజాపాలన పూర్తి చేసుకున్న సందర్భంగా మరిపెడ మున్సిపాలిటీలో శనివారం పార్టీ శ్రేణులు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గుగులోత్ రవి నాయక్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్రనాయక్, టీపీసీసీ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఎండీ అవేజ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామచంద్రనాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేస్తూ సంక్షేమానికి పెద్దపీట వేస్తోందన్నారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, గృహజ్యోతి, కొత్త రేషన్ కార్డులు, సన్నబియ్యం, ఆరోగ్యశ్రీ వంటి పథకాలతో ప్రజలకు ప్రయోజనం కలుగుతోందన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇచ్చిన హామీలను అమలు చేయని బీఆర్ఎస్ నాయకులకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక హక్కు లేదన్నారు.ఎండీ అవేజ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తోందని, బీఆర్ఎస్ నేతలు ముందుగా తమ పాలనపై ప్రజలకు సమాధానం చెప్పాలని అన్నారు. రవి నాయక్ మాట్లాడుతూ ప్రజాపాలనలో ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందుతున్నాయని, మిగిలిన హామీలను కూడా దశలవారీగా అమలు చేస్తామని తెలిపారు.ర్యాలీలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఒంటికొమ్ము యుగంధర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ విశారపు ప్రగతి శ్రీపాల్‌రెడ్డి, టౌన్ అధ్యక్షుడు పాంగోత్ రాంలాల్, కౌన్సిలర్లు, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆరు జిల్లాల స్థాయిలో ఉత్తమ ప్రధానోపాధ్యాయుడిగా డా. బి. శోభన్ బాబు



**మహబూబాబాద్ జిల్లా విశాల భారతి:** విద్యారంగంలో విశిష్ట సేవలందిస్తూ, విద్యార్థులను ఉత్తమ ఫలితాల వైపు నడిపిస్తున్న కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు డా. బి. శోభన్ బాబుకు అరుదైన గౌరవం దక్కింది. గత మూడు సంవత్సరాలుగా పదో తరగతి పరీక్షల్లో వరుసగా 100 శాతం ఫలితాలు సాధించినందుకు ఆయనను ఆరు జిల్లాల స్థాయిలో ఉత్తమ ప్రధానోపాధ్యాయుడిగా ఎంపిక చేసి ఘనంగా సన్మానించారు. ఏటూరునాగారం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి, డిప్యూటీ డైరెక్టర్ ఆధ్వర్యంలో శనివారం ములుగులో నిర్వహించిన కార్యక్రమంలో డా. బి. శోభన్ బాబును ఘనంగా సత్కరించారు. విద్యార్థుల విద్యా ప్రగతిపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, ఉపాధ్యాయులను సమన్వయం చేసి ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఆయన చేసిన కృషిని ఈ సందర్భంగా అధికారులు అభినందించారు. వరుసగా మూడేళ్ల పాటు పదో తరగతిలో శతశాతం ఫలితాలు సాధించడం ఆయన విద్యా బోధనపై ఉన్న నిబద్ధతకు, పాఠశాల అభివృద్ధిపై ఉన్న అంకితభావానికి నిదర్శనమని పలువురు కొనియాడారు. ఆరు జిల్లాల స్థాయిలో ఉత్తమ ప్రధానోపాధ్యాయుడిగా గుర్తింపు పొందడం పట్ల విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలని, విద్యార్థుల విజయమే ఉపాధ్యాయులకు అసలైన గౌరవమని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## ఉపాధ్యాయులే భావితరాల భవిష్యత్ నిర్మాతలు



- స్వస్తిక్ కాన్సెప్ట్ స్కూల్‌లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు
- విద్యార్థుల విజయమే గురువులకు లభించే గొప్ప బహుమతి
- ప్రిన్సిపాల్ దాసరి మధు

**మహబూబాబాద్ జిల్లా విశాల భారతి:**

విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించడంతో పాటు వారిలో నైతిక విలువలు, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి సమాజానికి ఉపయోగపడే ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని స్వస్తిక్ కాన్సెప్ట్ స్కూల్ ప్రిన్సిపాల్ దాసరి మధు అన్నారు. ఉపాధ్యాయులు భావితరాల భవిష్యత్ నిర్మాతలని పేర్కొన్నారు. స్వస్తిక్ కాన్సెప్ట్ స్కూల్‌లో శనివారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ కె. చంద్ర మౌళి మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు కేవలం పాఠ్యాంశాలను బోధించే వారే కాకుండా విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి మార్గదర్శకులుగా నిలుస్తున్నారని అన్నారు. ప్రతి విద్యార్థిలోని ప్రతిభను గుర్తించి, వారి సామర్థ్యాలను వెలికితీసి, జీవితంలో ఉన్నత లక్ష్యాలను సాధించేలా ఉపాధ్యాయులు నిరంతరం ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. భారత మాజీ రాష్ట్రపతి, ప్రముఖ తత్వవేత్త, విద్యావేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నామని పేర్కొన్నారు. విద్యారంగానికి, ఉపాధ్యాయ వృత్తికి డాక్టర్ రాధాకృష్ణన్ అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ప్రిన్సిపాల్ దాసరి మధు మాట్లాడుతూ.. "మంచి ఉపాధ్యాయుడు ఆశను నింపుతాడు.. ఊహాశక్తిని రగిలిస్తాడు.. నేర్చుకోవాలనే ఆసక్తిని పెంచుతాడు" అని అన్నారు. ఉపాధ్యాయుల సేవలు పాఠశాల సమయానికే పరిమితం కావని, విద్యార్థుల బలాలు, బలహీనతలను గుర్తించి వారికి సరైన దిశానిర్దేశం చేస్తూ నిరంతరం అండగా నిలుస్తారని తెలిపారు. విద్యార్థులు తమ ఉపాధ్యాయులను గౌరవించాలని, వారు అందించే సూచనలు, సలహాలను పాటించాలని ప్రిన్సిపాల్ సూచించారు. ఉపాధ్యాయులు కల్పించే ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని విద్యలో రాణించాలని కోరారు. విద్యార్థులు సాధించే విజయాలే తమకు లభించే గొప్ప బహుమతులని అన్నారు. ఈ సందర్భంగా స్వస్తిక్ కాన్సెప్ట్ స్కూల్ ఉపాధ్యాయుల సేవలను ప్రిన్సిపాల్ అభినందించారు. విద్యార్థుల అభివృద్ధి కోసం వారు చూపుతున్న అంకితభావం, సహనం, కృషి ప్రశంసనీయమన్నారు. భావితరాలకు జ్ఞానజ్యోతిని అందిస్తూ మరింత ఉత్సాహంతో సేవలందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ కె. చంద్ర మౌళి, ప్రిన్సిపాల్ దాసరి మధు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొని ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

## టిఎస్ పిఏ వద్ద భారీ రౌండ్ అబౌట్లతో ట్రాఫిక్ కష్టాలు

**రాజేంద్రనగర్, విశాల భారతి :**

అప్పాజంక్షన్-మంచిరేవుల-నార్సింగి ప్రధాన రహదారిలో తెలంగాణ స్టేట్ పోలీస్ అకాడమీ ( టిఎస్పిఏ ) సమీపంలో ఏర్పాటు చేసిన రెండు భారీ రౌండ్‌అబౌట్ల కారణంగా ప్రతిరోజూ తీవ్ర ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయని ఆల్ కాలనీస్ ఫెడరేషన్ ఆఫ్ బండ్లగూడ జాగీర్, కిస్మత్‌పూర్, హైదర్‌షాకోట్ వార్డ్స్ ప్రతినిధులు తెలిపారు. సమస్యను పరిష్కరించాలని కోరుతూ హెచ్ఎండిఏ మెట్రోపాలిటన్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. అప్పా జంక్షన్, పీరంచెరువు, హిమాయత్‌సాగర్ వైపు నుంచి వచ్చే వాహనాలు కలిసే ప్రాంతంలో ఒక రౌండ్‌అబౌట్, దానికి సుమారు 400-500 మీటర్ల దూరంలో మంచిరేవుల-నార్సింగి రోడ్డులో మరో రౌండ్‌అబౌట్ ఉన్నట్లు ఫెడరేషన్ తెలిపింది. ఈ రెండు రౌండ్‌అబౌట్ల మధ్య దూరం తక్కువగా ఉండటంతో పాటు వాటి మధ్యనున్న సెంట్రల్ ఐలాండ్లు భారీగా ఉండటం వల్ల వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని పేర్కొంది. ఉదయం 8 నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 3.30 నుంచి 7 గంటల వరకు సుమారు 1 నుంచి 1.5 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోతోందని, కేవలం 200 మీటర్ల దూరం దాటేందుకు 15 నుంచి 25 నిమిషాల సమయం పడుతోందని ఫెడరేషన్ ప్రతినిధులు తెలిపారు. రద్దీ నుంచి తప్పించుకునేందుకు కొందరు వాహనదారులు రాంగ్‌రూట్‌లో ప్రయాణిస్తుండటంతో ప్రమాదాల ముప్పు కూడా పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. రౌండ్‌అబౌట్ల సమస్యపై హెచ్ఎండిఏ ఇంజినీరింగ్ అధికారులు, సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులతో కలిసి సంయుక్తంగా క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించాలని ఫెడరేషన్ కోరింది. సెంట్రల్ ఐలాండ్ల పరిమాణాన్ని తగ్గించి, అవసరమైన రోడ్ మార్కింగ్స్, రిఫ్లెక్టర్లు, సైనేజీలను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేసింది. రెండు రౌండ్‌అబౌట్లలో ఒకదాన్ని తొలగించి సాధారణ జంక్షన్‌గా మార్చాలని సూచించింది. ఈ మార్పులు చేపడితే అప్పా జంక్షన్-మంచిరేవుల-నార్సింగి-సిబిఐటీ-ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ మార్గంలో ప్రతిరోజూ ప్రయాణించే వేలాది మంది వాహనదారులకు ట్రాఫిక్ ఇబ్బందుల నుంచి ఉపశమనం లభిస్తుందని ఫెడరేషన్ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో ఆల్ కాలనీస్ ఫెడరేషన్ అధ్యక్షుడు వినయ్ రెడ్డి, ఉపాధ్యక్షుడు నదీమ్, ప్రధాన కార్యదర్శి నరేందర్ బాబు, ఎగ్జిక్యూటివ్ సభ్యులు శశి రెడ్డి, ప్రాణిత్ పాల్గొన్నారు.

## గిరిజన పాఠశాల పై దృష్టి పెట్టని ప్రాజెక్ట్ అధికారి

**వాజేడు సెప్టెంబర్ 5 విశాల భారతి:** గిరిజన సంక్షేమ శాఖ కు కోట్లాది రూపాయలు నిధులు కేటాయించినట్టు లెక్కలు చూపే పాలక ప్రభుత్వం క్షేత్ర స్థాయిలో సంక్షోభం తప్ప గిరిజన సంక్షేమం ఎక్కడ కానరాదు అని ఆదివాసీ నవనిర్మాణ సేన జిల్లా అధ్యక్షులు ఎట్టి విద్యాసాగర్ ఆరోపించారు. ఏటూరునాగారం గిరిజన సంక్షేమ గురుకుల స్పోర్ట్స్ పాఠశాలను ఆదివాసీ నవనిర్మాణ సేన జిల్లా మండల నాయకులు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులతో మాట్లాడి అక్కడ సమస్యలు తెలుసుకున్నారు.అనంతరం విద్యాసాగర్ మాట్లాడుతూ ఏటూరునాగారం ఐటీడీ ఏ అనుకోని ఉన్న గిరిజన సంక్షేమ గురుకుల స్పోర్ట్స్ పాఠశాల విద్యార్థులు సమస్యల వలయం లో కొట్టు మీట్టాడు తున్నారని అయన మండిపడ్డారు.ఐటీడీఏ కు ఐదు వందల మీటర్ల దూరం లో ఉన్న స్పోర్ట్స్ పాఠశాల లో పూర్తి స్థాయిలో వసతులు లేవన్నారు. మరుగుదొడ్ల లేమి గిరిజన విద్యార్థుల ఆరోగ్యం పై తీవ్ర ప్రభావం చూపుతున్నట్లు తెలిపారు. పాఠశాల విద్యార్థులకు రక్షణగా ప్రహరీ గోడ లేకపోవడంతో విద్యార్థులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. గిరిజన విద్యార్థులు చదివే ఈ పాఠశాలకు నిఘానేత్రాలు లేకపోవడం యాజమాన్యం నిర్లక్ష్యానికి నిదర్శనం అన్నారు. పేరుకే స్పోర్ట్స్ పాఠశాల అయినప్పటికీ కనీసం ఆట స్థలం లేకపోవడం అన్యాయం పాఠశాలలో 400 మీటర్లు ట్రాక్ వెయ్యాల్సి ఉందన్నారు. పాఠశాలలో అట స్థలం, ఆట వస్తువులు లేకపోవడం తో గిరిజన విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని మండిపడ్డారు. సరైన సమతుల్యమైన ఆహారం పెట్టడం లేదని గిరిజన విద్యార్థులు తమ గోడు వెళ్ళబుచ్చినట్టు తెలిపారు.

# ప్రజానాయకుడికి అవకాశం కల్పించాలి: బుగ్గ నవీన్



**ఆలేరు, విశాల భారతి:** ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే శ్రీ బీర్ల అయిలయ్యకు రాష్ట్ర మంత్రివర్గంలో మంత్రి పదవి కేటాయించాలని కాంగ్రెస్ మండల నాయకులు బుగ్గ నవీన్ డిమాండ్ చేశారు. శనివారం ఆలేరు పట్టణ కేంద్రంలో ఆయన మాట్లాడుతూ బీర్ల అయిలయ్య బీసీ కురుమ సామాజిక వర్గానికి చెందిన నాయకుడిగా నిరంతరం ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. సైకిల్ యాత్రలు, మార్నింగ్ వాక్‌ల ద్వారా నియోజకవర్గంలోని గ్రామాల్లో పర్యటిస్తూ క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. బీర్ల ఫౌండేషన్ ద్వారా ఆరోగ్య సేవలకు ప్రాధాన్యతనిస్తూ అంబులెన్స్‌ల ఏర్పాటు, ఆర్థిక సహాయం, పేదలకు విద్య, వైద్యం, వివాహాలు, అంత్యక్రియల సమయంలో సహాయం వంటి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని అన్నారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన నాటి నుంచి ప్రతిపక్ష నాయకుల కంటే ఎక్కువగా ప్రజా సమస్యలపై దృష్టి సారిస్తూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి పేదవాడికి అందేలా కృషి చేస్తున్నారని బుగ్గ నవీన్ పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై పూర్తి అవగాహనతో పనిచేస్తున్న బీర్ల అయిలయ్యకు రాష్ట్ర స్థాయిలో మరింత సేవ చేసే అవకాశం కల్పించాలని, సామాజిక న్యాయం, బీసీలకు ప్రాధాన్యత కల్పించే దిశగా ఆయనకు మంత్రి పదవి ఇవ్వాలని బుగ్గ నవీన్ కోరారు.

# మున్సిపల్ చైర్మన్ గృహనిర్బంధం



**తిరుమలగిరి, విశాల భారతి :** శనివారం రోజున సీఎం రేవంత్ రెడ్డి నకిరేకల్ పర్యటనలో భాగంగా తిరుమలగిరి మున్సిపల్ చైర్మన్ సంకేపల్లి రఘునందన్ రెడ్డి ని పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. 6 గ్యారెంటీలు, 420 అబద్దపు హామీలు ఇచ్చి ప్రజలకు అమలు చెయ్యకుండా గత బిఆర్ఎస్ ప్రభుత్వం లో మా వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నకిరేకల్ పట్టణంలో 100 పడకల ఆసుపత్రి శంకుస్థాపన చేసిన దానిని ఈరోజు రేవంత్ రెడ్డి ప్రారంభించడానికి వస్తున్నాడు. ఈ సందర్భంగా మమ్మల్ని హౌస్ అరెస్టు చెయ్యడం కాంగ్రెస్ ప్రభుత్వం చేతకాని తనం అన్నారు. కాంగ్రెస్ సర్కారు కు దమ్ముంటే 6 గ్యారెంటీ లు అమలు చేయాలని అన్నారు.

# భవన నిర్మాణ కార్మిక సంఘం సీఐటీయూ నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక



**మహబూబాబాద్ జిల్లా విశాల భారతి:** భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారం, హక్కుల పరిరక్షణ, సంక్షేమ పథకాల అమలే లక్ష్యంగా భవన నిర్మాణ కార్మిక సంఘం సీఐటీయూ అనుబంధ మహబూబాబాద్ మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రిజిస్ట్రేషన్ నంబర్ 1214/92 కింద నూతన కమిటీని ఏర్పాటు చేశారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా బానోత్ శంకర్, ప్రధాన కార్యదర్శిగా జి. కోటేశ్వరరావు, కోశాధికారిగా భూక్య సర్వన్ ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షుడిగా ఆకుల రాజు, ఉపాధ్యక్షులుగా వి. వెంకన్న, భూక్య రాము బాధ్యతలు చేపట్టారు. ముఖ్య సలహాదారుగా షేక్ యూసుఫ్ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా నల్ల నరసయ్య, రామచంద్రు, బి. వెంకన్న, బి. సురేష్, యాకయ్య ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాడుతామని తెలిపారు. కార్మికులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, ఆర్థిక ప్రయోజనాలు, భద్రతా సదుపాయాలు పూర్తిస్థాయిలో అందేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్మికుల హక్కులకు భంగం కలిగితే సంఘం తరపున ఐక్యంగా స్పందిస్తామని, కార్మికుల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని నూతన కమిటీ నాయకులు స్పష్టం చేశారు. కార్మికుల ఐక్యతే తమ ప్రధాన బలం అని, హక్కుల సాధన కోసం సంఘటితంగా ముందుకు సాగుతామని తెలిపారు.

# జక్కలవారిగూడెంలో ముత్యాలమ్మ బోనాల పండుగను అంగరంగ వైభవంగా నిర్వహించడం జరిగింది



**మునుగోడు విశాల భారతి :** జక్కలవారిగూడెం గ్రామంలో ప్రజలు, యువత, మహిళలు, పెద్దలు అందరూ ఐకమత్యంతో పాల్గొని శనివారం అమ్మవారికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో పండుగ వాతావరణం నెలకొని, భక్తుల సందడితో కార్యక్రమం ఎంతో వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో 5వ వార్డ్ మెంబర్ దాసరి గణేష్ యాదవ్, 2వ వార్డ్ మెంబర్ జక్కల కృష్ణ యాదవ్, 3వ వార్డ్ మెంబర్ దాసరి రేణుక సురేష్ యాదవ్ మాజీ సర్పంచ్ జక్కల శీను యాదవ్, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు దోటి రమేష్, దోటి నగేష్, లింగస్వామి, నర్సింహా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ముత్యాలమ్మ తల్లి ఆశీస్సులు గ్రామ ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. గ్రామంలో ఇలాంటి ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను ప్రతి ఒక్కరి సహకారంతో మరింత ఘనంగా నిర్వహించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజలందరూ ఐకమత్యంగా ఉండి గ్రామ అభివృద్ధికి కలిసి పనిచేయాలని కోరారు. ముత్యాలమ్మ తల్లి కృపతో గ్రామంలో పాడిపంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలందరికీ మంచి జరగాలని ప్రత్యేకంగా ప్రార్థించారు.

# విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలి

## ఉపాధ్యాయ దినోత్సవంలో ఆదర్శ రైతు గాదె నర్సిరెడ్డి దిశానిర్దేశం




**బూర్గంపాడు / విశాల భారతి:** మొరంపల్లి బంజర ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని పినపాక హైస్కూల్ నందు మరియు మొరంపల్లి బంజర చిన్న స్కూల్లో ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ ప్రత్యేక కార్యక్రమంలో ఆదర్శ రైతు గాధ నర్సిరెడ్డి పాల్గొని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ, పట్టుదల, సమయ పాలన, మంచి ఆలోచనా విధానాన్ని అలవర్చుకోవాలని ఈ సందర్భంగా సూచించారు. ఉపాధ్యాయులు అందించే విద్యతో పాటు వారి సూచనలు, సలహాలను పాటిస్తూ ప్రతి విద్యార్థి తనకు నచ్చిన రంగంలో ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని వాటిని సాధించే దిశగా కృషి చేయాలని అన్నారు. కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగడంతో పాటు సమాజానికి ఉపయోగపడే పౌరులుగా తీర్చిదిద్దుకోవాలనిసూచించారు. ఉపాధ్యాయుల పాత్ర విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో ఎంతో కీలకమని, విద్యార్థుల విజయమే ఉపాధ్యాయులకు నిజమైన గౌరవమని గాదె నర్సిరెడ్డి పేర్కొన్నారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులను అభినందించి, విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది, అగ్రికల్చర్ అధికారి ఏ డి ఏ తాతారావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు






**చేవెళ్ల, విశాల భారతి :**

ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని ఐబీఎస్‌కు చెందిన మహిళా అభివృద్ధి కేంద్రం, క్లబ్ ఐనా ఆధ్వర్యంలో తెలంగాణలోని ప్రొద్దుటూరులోని ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. సమాజంతో అనుసంధానాన్ని పెంపొందించడం, విద్యార్థులతో సాన్నిహిత్యాన్ని ఏర్పరచుకోవడం లక్ష్యంగా నిర్వహించిన ఈ కార్యక్రమం ఆహ్లాదకరంగా సాగింది. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులు పాఠశాల విద్యార్థులతో స్నేహపూర్వకంగా ముచ్చటిస్తూ, వివిధ ఆసక్తికర కార్యక్రమాల్లో పాల్గొన్నారు. విద్యార్థులు తమ ఆలోచనలు, అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తపరిచేలా ప్రోత్సహించారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా పాఠశాల విద్యార్థులు స్వయంగా తయారు చేసిన శుభాకాంక్షల కార్డులను ఉపాధ్యాయులకు అందజేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. చిన్నారులు ప్రేమతో తయారు చేసిన కార్డులను అందుకున్న ఉపాధ్యాయులు ఆనందం, భావోద్వేగం వ్యక్తం చేశారు. కళాశాల విద్యార్థులతో నేరుగా మమేకం కావడం ద్వారా పాఠశాల విద్యార్థులకు ఉన్నత విద్య, వివిధ వృత్తి అవకాశాలు, భవిష్యత్‌లో ఎంచుకోగల మార్గాలపై అవగాహన కలిగింది. తమకంటే ముందున్న తరం విద్యార్థులతో మాట్లాడటం ద్వారా ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకోవడంతో పాటు భవిష్యత్తు గురించి విస్తృతంగా ఆలోచించే అవకాశం వారికి లభించింది. అదే సమయంలో కళాశాల విద్యార్థులకు కూడా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల ఆశయాలు, కలలు, విద్యాపరమైన ఆకాంక్షలను దగ్గరగా తెలుసుకునే అవకాశం ఏర్పడింది. సమాజంలో యువత ఎదుర్కొంటున్న వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకోవడంతో పాటు సామాజిక బాధ్యత, సానుభూతి, సమాజం పట్ల బాధ్యతాయుతమైన దృక్పథాన్ని పెంపొందించుకోవడానికి ఈ కార్యక్రమం దోహదపడింది. ఈ కార్యక్రమం ఒక తరం విద్యార్థులు మరో తరాన్ని కలుసుకున్న కార్యక్రమంగా మాత్రమే కాకుండా రెండు తరాల మధ్య పరస్పర అభ్యాసానికి వేదికగా నిలిచింది. పాఠశాల విద్యార్థులు ఉన్నత విద్య, భవిష్యత్ అవకాశాలపై కొత్త విషయాలను తెలుసుకోగా, కళాశాల విద్యార్థులు పాఠశాల విద్యార్థుల అనుభవాలు, ఆశలు, లక్ష్యాలను అర్థం చేసుకున్నారు. విద్య అనేది కేవలం తరగతి గదులకే పరిమితం కాదని, అనుభవాలను పంచుకోవడం, ఒకరినొకరు అర్థం చేసుకోవడం, సమాజంతో మమేకం కావడం ద్వారా కూడా నిజమైన అభ్యాసం సాధ్యమవుతుందని ఈ కార్యక్రమం చాటిచెప్పింది. మహిళా అభివృద్ధి కేంద్రం, క్లబ్ ఐనా చేపట్టిన ఈ కార్యక్రమం సామాజిక బాధ్యత, సమాజ సేవ పట్ల వారి నిబద్ధతకు నిదర్శనంగా నిలిచింది. కార్యక్రమాన్ని వినీత, కీర్తి, శిరీష సమన్వయంతో నిర్వహించారు. కార్యక్రమంలో జూనియర్, సీనియర్ క్లబ్ సభ్యులు ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేశారు. "అవగాహన నుంచి ఆచరణకు.. ఒక తరం నుంచి మరో తరానికి విద్యతో పాటు అనుభవాలు, ఆశలు, స్ఫూర్తిని పంచుకోవడం" అనే సందేశంతో నిర్వహించిన ఈ కార్యక్రమం విద్యార్థుల్లో కొత్త ఆలోచనలకు, సామాజిక అవగాహనకు బాటలు వేసింది.

# ఉపాధ్యాయుల మాట వినండి.. జీవితానికి బంగారు బాట వేసుకోండి



**విశాల భారతి ఎన్ టి పి సి**

విద్యార్థులు ఉపాధ్యాయుల మాటకు గౌరవం ఇస్తూ, వారి సూచనలు పాటించాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సూచించారు. చెడు వ్యసనాలకు, ముఖ్యంగా గంజాయి వంటి మాదకద్రవ్యాల వినియోగానికి దూరంగా ఉండాలని, సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని రామగుండం పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు పెద్దపల్లి జోన్‌లోని ఎన్టీపీసీ పోలీస్ స్టేషన్ పరిధిలో గల ఎన్టీపీసీ టీటీఎస్ ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలు, ఉపాధ్యాయ దినోత్సవ ప్రాధాన్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రామగుండం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కృష్ణకుమార్, సైబర్ నేరాల విభాగం ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఎన్టీపీసీ ఎస్ఐ ఉదయ్ కిరణ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, పెద్దపల్లి డీసీపీ బి. రామ్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరి జీవితంలో తల్లిదండ్రులే తొలి గురువులని, వారి తర్వాత ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. విద్యార్థులు జీవితంలో ఏ స్థాయికి ఎదిగినా తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఎల్లప్పుడూ గౌరవించే మనస్తత్వాన్ని కలిగి ఉండాలని సూచించారు. చదువు, వ్యక్తిగత జీవితం లేదా ఇతర అంశాలకు సంబంధించి ఏవైనా సమస్యలు, సందేహాలు ఉంటే వాటిని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో పంచుకోవాలని తెలిపారు. సమస్యలను మనసులో దాచుకోకుండా వారితో మాట్లాడితే సరైన మార్గనిర్దేశం లభిస్తుందని అన్నారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, గంజాయి వంటి మాదకద్రవ్యాల వినియోగం వారి భవిష్యత్తును నాశనం చేసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. గంజాయి విక్రయాలు లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే 1908కు తెలియజేయాలని సూచించారు. సైబర్ నేరాల విషయంలో విద్యార్థులు, తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సీపీ సూచించారు. గుర్తుతెలియని వ్యక్తులు పంపే అనుమానాస్పద లింకులను తెరవకూడదని, వ్యక్తిగత వివరాలు, బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీ వంటి సమాచారాన్ని ఎవరికీ వెల్లడించకూడదని తెలిపారు. సైబర్ మోసానికి గురైన వెంటనే 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. అత్యవసర పరిస్థితులు, ప్రమాదాలు, అగ్నిప్రమాదాలు లేదా ఇతర ఆపద సమయాల్లో పోలీసుల సహాయం కోసం 112కు కాల్ చేయాలని విద్యార్థులకు వివరించారు. గతంలో అందుబాటులో ఉన్న 100 నంబర్ స్థానంలో ప్రస్తుతం 112 అత్యవసర సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. విద్యార్థుల భద్రత కోసం పోలీసు అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారని సీపీ పేర్కొన్నారు. ఏసీపీలు, సీఐలు, ఎస్‌హెచ్ఓలు పాఠశాలల పరిసరాలను క్రమం తప్పకుండా సందర్శిస్తూ భద్రతా పరిస్థితులను పరిశీలిస్తున్నారని తెలిపారు. అయితే విద్యార్థులే తమ భద్రతకు తొలి రక్షకులని, అనుమానాస్పద కార్యకలాపాలు కనిపించినప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ క్రమశిక్షణతో చదువుకోవాలని, భవిష్యత్తులో ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, శాస్త్రవేత్తలు, ప్రజాప్రతినిధులుగా ఎదిగి సమాజానికి సేవ చేయాలని సీపీ ఆకాంక్షించారు. వినాయక చవితిని పురస్కరించుకుని తెలంగాణ సైబర్ భద్రతా విభాగం ఆధ్వర్యంలో రూపొందించిన "వినాయకుడి నుంచి సైబర్ భద్రత పాఠాలు" అనే అవగాహన పోస్టర్‌ను సీపీ అంబర్ కిషోర్ ఝా, డీసీపీ బి.రామ్‌రెడ్డి ఆవిష్కరించారు. సైబర్ మోసాల పట్ల ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వినూత్న రీతిలో వివరిస్తూ ఈ పోస్టర్‌ను రూపొందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ మల్లేశం, రామగుండం సీఐ కృష్ణకుమార్, ఎన్టీపీసీ ఎస్ఐ ఉదయ్ కిరణ్, బసంత్‌నగర్ ఎస్ఐ శ్రీధర్, రామగుండం ఎస్ఐ సంధ్యారాణి, అంతర్గాం ఎస్ఐ వెంకట్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.జయరాజ్, స్థానిక కార్పొరేటర్ కవిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ఎలిగేడ్‌లో టాస్క్‌ఫోర్స్, ఎలిగేడ్ పోలీసుల సంయుక్త తనిఖీలు

**విశాల భారతి పెద్దపల్లి**

రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ శ్రీనివాస్ రావు నేతృత్వంలో, ఎస్ఐ లక్ష్మణ్, ఎలిగేడ్ ఎస్ఐ మధుకర్ ఆధ్వర్యంలో గంజాయి వినియోగం, అక్రమ రవాణా, సరఫరా, నిల్వపై పోలీసులు నిఘాను మరింత పెంచారు. ఈ క్రమంలో శనివారం ఉదయం పెద్దపల్లి జోన్‌లోని ఎలిగేడ్ పోలీస్ స్టేషన్ పరిధిలో గల ఎలిగేడ్ గ్రామంలో టాస్క్‌ఫోర్స్ బృందం, ఎలిగేడ్ పోలీసులు సంయుక్తంగా పెట్రోలింగ్ నిర్వహిస్తూ నిఘా చర్యలు చేపట్టారు. ఎలిగేడ్ గ్రామ కేంద్రంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఏడుగురు యువకులను పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా, తాము గంజాయి సేవించినట్లు వెల్లడించారు. దీంతో తదుపరి చట్టపరమైన చర్యల్లో భాగంగా ఏడుగురు యువకులను గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించి వైద్య, క్లినికల్ పరీక్షలు నిర్వహించారు. గంజాయి సేవించినట్లు నిర్ధారించేందుకు అవసరమైన పరీక్షలు నిర్వహించిన అనంతరం, వారిని డీఅడిక్షన్ సెంటర్‌కు తరలించేందుకు చర్యలు చేపడుతున్నారు.



**మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం: సీపీ**

యువత భవిష్యత్తును నాశనం చేసే గంజాయి, ఇతర మాదకద్రవ్యాలపై రామగుండం పోలీస్ కమీషనరేట్ పరిధిలో ఉక్కుపాదంతో వ్యవహరిస్తామని సీపీ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. గంజాయి సేవించడం, విక్రయించడం, అక్రమంగా రవాణా చేయడం, నిల్వ చేయడం వంటి కార్యకలాపాలకు పాల్పడే వారిపై నిరంతరం నిఘా కొనసాగుతుందని తెలిపారు. గంజాయి, మాదకద్రవ్యాలు, ఇతర మత్తు పదార్థాల విషయంలో ఎలాంటి ఉపేక్ష ఉండదని స్పష్టం చేశారు. యువత గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలకు బానిస కాకుండా తల్లిదండ్రులు, విద్యా సంస్థల నిర్వాహకులు, ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. గంజాయి వినియోగం, అక్రమ రవాణా, విక్రయం లేదా నిల్వకు సంబంధించిన సమాచారం ఎవరికైనా తెలిసినట్లయితే వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. యువత గంజాయి, ఇతర మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, మాదకద్రవ్యాల వినియోగం, విక్రయం, రవాణా వంటి అక్రమ కార్యకలాపాలకు పాల్పడితే కఠినమైన చట్టపరమైన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.

# ట్రినిటీ హైస్కూల్ లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు



**చౌటుప్పల్, విశాల భారతి:** పట్టణంలోని ట్రినిటీ హైస్కూల్ లో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా భారతరత్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం పాఠశాల డైరెక్టర్ కం ప్రిన్సిపాల్ డాక్టర్ మంజుల మాట్లాడుతూ... సాధారణ ఉపాధ్యాయుడి స్థాయి నుండి భారత దేశ ప్రథమ పౌరుడు, రాష్ట్రపతి స్థాయి వరకు అంచెలంచెలుగా ఎదిగిన డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవిత చరిత్రను విద్యార్థులకు వివరించారు. ఆ మహనీయుని జన్మదినాన్నే మనం ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకుంటున్నామని తెలిపారు. గురువుల గొప్పతనాన్ని విద్యార్థులు గుర్తించాలని సూచించారు. ఈ సందర్భంగా స్వపరిపాలన దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులు ఒకరోజు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఉపాధ్యాయ వృత్తిలోని బాధ్యతను, గొప్పతనాన్ని స్వయంగా అనుభవించారు. ఒకరోజు ఉపాధ్యాయులుగా వ్యవహరించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ డాక్టర్ మంజుల ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ కె.వి.బి. కృష్ణారావు, కోఆర్డినేటర్లు ఎం. శివరాణి, శివాని, నీరజ, మంజుల, స్వప్న, కొండమ్మ, జ్యోతి, సబిత, లోకుమారి, స్వప్న, అనూష తదితర ఉపాధ్యాయ బృందం మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# మల్లికార్జున పాఠశాలలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు



**చౌటుప్పల్ విశాల భారతి:** పట్టణ కేంద్రంలో శనివారం మల్లికార్జున పాఠశాల ఆవరణంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. పాఠశాల ప్రధానోపాధ్యాయులు బత్తుల కన్నయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి మల్లికార్జున విద్యాసంస్థల చైర్మన్ మారేపల్లి మల్లారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వారితో పాటు ధరణి, శ్రావ్య, తేజస్విని హాజరయ్యారు. ముందుగా అతిథులు భారత మాజీ రాష్ట్రపతి డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం చైర్మన్ మారేపల్లి మల్లారెడ్డి మాట్లాడుతూ.. సర్వేపల్లి రాధాకృష్ణన్ గొప్పతనాన్ని, దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఉపాధ్యాయ వృత్తి నుంచి దేశ అత్యున్నత పదవి అయిన రాష్ట్రపతి పదవిని అలంకరించిన గొప్ప వ్యక్తి రాధాకృష్ణన్ అని విద్యార్థులకు వివరించారు. సమాజంలో ఒక ఐఏఎస్, ఐపీఎస్, లాయర్, ఇంజనీర్ ను తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనని, అందుకే రాధాకృష్ణన్ జన్మదినాన్ని ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకుంటామని తెలిపారు. అనంతరం పాఠశాలలోని ఉపాధ్యాయులను శాలువా, మెమెంటోలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కవిత, ఆనంద్, యాదయ్య, వినితి, ఫౌజియా, పల్లవి, శ్రీజ, శ్రీలత, సంతోష, గౌరీ, మౌనిక, రజిత, పూజ, యాదగిరి, ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

# బీజేపీ జిల్లా అధ్యక్షుడి తల్లిని పరామర్శించిన బీజేపీ నేతలు



**చౌటుప్పల్, విశాల భారతి:** ఇటీవల నల్గొండ జిల్లాలో కాంగ్రెస్ శ్రేణుల దాడిలో తీవ్రంగా గాయపడి హైదరాబాద్ యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నల్గొండ జిల్లా బీజేపీ అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి తల్లి నాగం శ్రీదేవి ని బీజేపీ నేతలు శనివారం పరామర్శించారు. ఈఎల్వి భాస్కర్ ఫౌండేషన్ డైరెక్టర్ ఈఎల్వి అశోక్, చౌటుప్పల్ మున్సిపాలిటీ బీజేపీ ఫ్లోర్ లీడర్, కౌన్సిలర్ బుడ్డ సురేష్, బీజేపీ నారాయణపూర్ మండల ఉపాధ్యక్షుడు, గుజ్జ ఉప సర్పంచ్ ఎలిజల శ్రీను, చౌటుప్పల్ పట్టణ బీజేపీ జనరల్ సెక్రెటరీ తోకల సాయి, మార్గం శివ యాదవ్, గుండె మల్లేష్ యాదవ్ ఆసుపత్రికి వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ, ప్రశ్నించిన వారిపై దాడులు చేయడం ప్రజాస్వామ్యానికి అత్యంత ప్రమాదకరమని, ఇది పిరికిపంద చర్య అని మండిపడ్డారు. ప్రశ్నిస్తే దాడులు చేసే సంస్కృతిని ప్రోత్సహిస్తున్న కోమటిరెడ్డి బ్రదర్స్ ను తక్షణమే పదవుల నుంచి బర్తరఫ్ చేయాలని వారు డిమాండ్ చేశారు.

# ఊర బోనాల భక్తులకు ఇబ్బందులు లేకుండా ప్రత్యేక రహదారి

**చౌటుప్పల్ విశాల భారతి:** శ్రీ శ్రీ శ్రీ ముత్యాలమ్మ తల్లి ఊర బోనాల జాతర సందర్భంగా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా జడ్చర్ల మున్సిపల్ చైర్మన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ చొరవ తీసుకున్నారు. పాత ఊరు (బొడ్రాయి), గాంధీ పార్క్, రాంనగర్, శాంతినగర్ ప్రాంతాల నుండి ముత్యాలమ్మ తల్లి ఆలయానికి వచ్చే భక్తుల రాకపోకలకు అనువుగా ఉండేందుకు చైర్మన్ ఎన్హెచ్ఏఐ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. భక్తుల సౌకర్యార్థం "చిన్న కొండూరు రోడ్డు ఆర్చి నుండి తంగడపల్లి రోడ్డు" వరకు 20 ఫీట్ల వెడల్పుతో మట్టి రహదారిని వెంటనే ఏర్పాటు చేయాలని చైర్మన్ అధికారులను ఆదేశించారు. బోనాల ఉత్సవాల సందర్భంగా ఎక్కడా ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని మున్సిపల్ కమిషనర్ మరియు సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్లు ఉడుగు జ్యోతి రమేష్ గౌడ్, చింతల సాయిలు ఉమామహేశ్వరి, ఈ నిర్ణయంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు

DISTRICT news
WWW.VISHALABHARATI.COM
విశాల భారతి

# నూతన ఫోరెన్సిక్ శాస్త్రీయ అధికారులకు ప్రాథమిక శిక్షణ పూర్తి





**గురుపూజోత్సవం సందర్భంగా గురువులకు సన్మానం**

**రాజేంద్రనగర్, విశాల భారతి :**

తెలంగాణ రాష్ట్ర ఫోరెన్సిక్ శాస్త్ర ప్రయోగశాలలో నూతనంగా నియమితులైన 53 మంది శాస్త్రీయ అధికారులకు హైదరాబాద్‌లోని ఆర్‌బీవీఆర్‌ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీలో నిర్వహించిన రెండు వారాల వసతి ఆధారిత ప్రాథమిక శిక్షణ కార్యక్రమం శనివారం విజయవంతంగా ముగిసింది. ఆగస్టు 18వ తేదీ నుంచి సెప్టెంబర్ 5వ తేదీ వరకు ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. శిక్షణ ముగింపు కార్యక్రమానికి తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్, ఐపీఎస్ ముఖ్య అతిథిగా హాజరై నూతన శాస్త్రీయ అధికారులను అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేరాల దర్యాప్తులో ఫోరెన్సిక్ శాస్త్రం అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తుందని తెలిపారు. శాస్త్రీయ అధికారులు తమ విధులను అత్యంత బాధ్యతాయుతంగా, నిష్పాక్షికంగా నిర్వహించాలని సూచించారు. నేర స్థలాల నుంచి సేకరించిన శాస్త్రీయ ఆధారాలను శాస్త్రీయ ప్రమాణాలతో పరిశీలించి, ఖచ్చితత్వంతో నివేదికలు రూపొందించడం ద్వారా న్యాయ వ్యవస్థకు విశ్వసనీయమైన సేవలు అందించాలని అభిలాష బిస్త్ పేర్కొన్నారు. శాస్త్రీయ నిబద్ధత, ఖచ్చితత్వం, నిష్పాక్షికతతో పాటు వృత్తిపరమైన నైతిక విలువలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంలో వస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ తమ నైపుణ్యాలను నిరంతరం పెంపొందించుకోవాలని ఆమె కోరారు. దర్యాప్తు అధికారులు, ఇతర సంబంధిత విభాగాలతో సమన్వయంతో పనిచేస్తూ శాస్త్రీయ ఆధారాల ద్వారా నేర దర్యాప్తును మరింత బలోపేతం చేయాలని సూచించారు. శాస్త్రీయ ఆధారాల ఆధారంగా నేరాలను ఛేదించడంలో, బాధితులకు న్యాయం అందించడంలో శాస్త్రీయ అధికారులు కీలక పాత్ర పోషించాలని ఆమె ఆకాంక్షించారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయడం ద్వారా తెలంగాణ రాష్ట్ర ఫోరెన్సిక్ శాస్త్ర ప్రయోగశాలలో నూతన శాస్త్రీయ మానవ వనరులు మరింత బలోపేతం కావడంతో పాటు రాష్ట్రంలో ఫోరెన్సిక్ సేవల నాణ్యతను మెరుగుపరిచే దిశగా ఇది ఒక ముఖ్యమైన ముందడుగుగా నిలిచిందని అధికారులు తెలిపారు.

**గురుపూజోత్సవం సందర్భంగా గురువులకు సన్మానం**

గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని శిక్షణ పొందిన నూతన శాస్త్రీయ అధికారులు తమ గురువులైన అకాడమీ డైరెక్టర్, ఉప సంచాలకులు, ఇతర అధ్యాపకులను ఘనంగా సన్మానించారు. అనంతరం శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన 53 మంది శిక్షణార్థులకు అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్ ధ్రువ పత్రాలను అందజేశారు.

ఈ కార్యక్రమంలో అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్ ఐపీఎస్, ఉప సంచాలకులు మురళీధర్ ఐపీఎస్, వెంకటేశ్వర్లు, కేఆర్‌కే ప్రసాద్, సహాయ సంచాలకులు డాక్టర్ కే. ధనజ, వేమా శ్రీనివాసరెడ్డి, యార్లగడ్డ రాంబాబు, నరహరి, పోలీసు ఉపాధికారులు సతీష్, అమృతారెడ్డి, రామారావు, తోట శ్రీనివాసులు, జగదీష్‌తో పాటు ఇతర అధ్యాపకులు, అకాడమీ సిబ్బంది పాల్గొన్నారు.

## తీన్మార్ మల్లన్న చేతుల మీదుగా సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



**చౌటుప్పల్, విశాల భారతి:** మున్సిపాలిటీ పరిధిలోని తంగడపల్లికి చెందిన బోలమోని శంకరయ్య కుటుంబానికి సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన రూ.26 వేల చెక్కును శనివారం హైదరాబాద్‌లో అందజేశారు. నల్గొండ వరంగల్ ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ, తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధ్యక్షులు గౌరవ తీన్మార్ మల్లన్న, అడ్వకేట్ గట్టు మొగలయ్య ముదిరాజ్ చేతుల మీదుగా హైదరాబాద్‌లోని ఎమ్మెల్సీ కార్యాలయంలో ఈ చెక్కును బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ, బీసీ రాజ్యాధికారం కోసం ప్రతి ఒక్క బీసీ బిడ్డ భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. పేద వర్గాల ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా తెలంగాణ రాజ్యాధికార పార్టీ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు.

## గురువులే విద్యార్థుల భవిష్యత్తుకు మార్గదర్శకులు

**ప్రిన్సిపల్ బొడిగె విజయకుమార్**



**చిట్యాల విశాల భారతి:** విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని సౌమ్య విద్యామందిర్ పాఠశాల ప్రిన్సిపల్ బొడిగె విజయకుమార్ అన్నారు. చిన్నకాపర్తి గ్రామంలోని సౌమ్య విద్యామందిర్ పాఠశాలలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని శనివారం గురుపూజోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థులకు కేవలం పాఠ్యాంశాలను బోధించడం మాత్రమే కాకుండా, మంచి విలువలు, క్రమశిక్షణ, సామాజిక బాధ్యత, నైతికతను అలవర్చడంలో ఉపాధ్యాయులు ఆదర్శంగా నిలవాలని అన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి, వారికి సరైన మార్గనిర్దేశం చేస్తే ఉన్నత శిఖరాలను అధిరోహించేలా చేయవచ్చని పేర్కొన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉపాధ్యాయ వృత్తికి, విద్యారంగానికి చేసిన సేవలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులను శాలువాలతో సత్కరించి గురుపూజోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రుద్రారపు లావణ్య, మునుకుంట్ల వేణు, మునుకుంట్ల స్వాతి, గండమల్ల చర్విత, రేగులగడ్డ ప్రశాంతి, సురోజు హర్షిణి, విద్యార్థులు పాల్గొన్నారు.

## మహిళా సంఘం భవనానికి శంకుస్థాపన



**దేవరుప్పుల విశాల భారతి :** ధరావత్ తండా గ్రామంలో మహిళా సంఘం భవన నిర్మాణానికి గ్రామ సర్పంచ్ ధరావత్ అనిత-రవీందర్ నాయక్ దంపతులు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా శంకుస్థాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. మహిళా సాధికారతే గ్రామ అభివృద్ధికి బలమైన పునాది అని అన్నారు. మహిళా సంఘాల అభివృద్ధికి, ఐక్యతకు నూతన భవనం ఒక వేదికగా నిలవాలని ఆకాంక్షించారు. మహిళలు ఆర్థికంగా, సామాజికంగా మరింత అభివృద్ధి సాధించేలా సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఆర్ఏఈ, గ్రామ కార్యదర్శి కరుణాకర్, ఉపసర్పంచ్ కమిలి హరి, వార్డు సభ్యులు మధుకర్, రవి, అనిత, డీలర్ లక్ష్మణ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాము, మహేందర్, గ్రామ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ 1000 రోజుల దగా పాలనపై బీఆర్ఎస్ సమరభేరి



**ఆలేరు, విశాల భారతి :** కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలనలో యువత, విద్యార్థులకు ఇచ్చిన హామీలు అమలు చేయలేదని ఆరోపిస్తూ బీఆర్ఎస్ యువజన, విద్యార్థి విభాగాల ఆధ్వర్యంలో ఆలేరు నియోజకవర్గ కేంద్రంలో శనివారం భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. మాజీ ప్రభుత్వ విప్, ఆలేరు మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జ్ గొంగిడి సునిత మహేందర్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని, నిరుద్యోగ యువత కోసం పక్కాగా జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని, ఎన్నికల సందర్భంగా ప్రకటించిన యూత్ డిక్లరేషన్ హామీలను తక్షణమే అమలు చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ నిరసన ర్యాలీలో సుమారు 2,000 మంది యువజనులు, విద్యార్థులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో మాజీ డీసీసీబీ చైర్మన్, టెస్కాబ్ మాజీ వైస్ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి, బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షులు తుంగ బాలు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కల్లూరి రామచంద్ర రెడ్డితో పాటు అన్ని మండలాల యూత్ అధ్యక్షులు, బీఆర్ఎస్వీ అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. యువత, విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటినీ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదలతో పాటు నిరుద్యోగ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరారు.

## ప్రజల వద్దకే పాలన.. సమస్యల పరిష్కారమే లక్ష్యం

- **కాటేపల్లిలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మార్నింగ్ వాక్**
- **రూ.36 కోట్లతో బీటీ రోడ్డుకు శంకుస్థాపన.. ఉపాధ్యాయులకు ఘన సన్మానం**



**మోటకొండూరు, విశాలభారతి :** మోటకొండూరు మండలం కాటేపల్లి గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య శనివారం మార్నింగ్ వాక్ నిర్వహించారు. ప్రజల వద్దకే నేరుగా వెళ్లి వారి సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టడమే లక్ష్యంగా నియోజకవర్గంలోని గ్రామాల్లో మార్నింగ్ వాక్‌లు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. మార్నింగ్ వాక్ సందర్భంగా గ్రామంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించిన ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి ఇళ్ల నిర్మాణ పనులు ఏ దశలో ఉన్నాయో, బిల్లుల మంజూరులో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇంకా ఇళ్లు అవసరమైన అర్హుల వివరాలను కూడా సేకరించారు. అదేవిధంగా గ్రామంలో డ్రైనేజీ, సీసీ రోడ్లు, తాగునీరు, ఇతర మౌలిక వసతుల సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజేంద్రప్రసాద్, ఎంపీడీవో ఇందిరా, ఆర్‌అండ్‌బీ డీఈ శ్రీను, ఎంపీవో చంద్రశేఖర్, విద్యుత్ శాఖ ఏఈ సృజన్ కుమార్, పంచాయతీ కార్యదర్శి మల్లేష్, నాయకులు కొంత మోహన్ రెడ్డి, క్యాశగల్ల చంద్రశేఖర్, బుగ్గ శ్రీశైలం తదితరులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## అల్కాపూర్ టౌన్‌షిప్‌లో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



**రాజేంద్రనగర్, విశాల భారతి :** అల్కాపూర్ టౌన్‌షిప్‌లోని జయశంకర్ పార్క్‌లో గౌరంగ ధామ్ (ఇస్కాన్ సికింద్రాబాద్) ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను భక్తిశ్రద్ధలతో, అత్యంత ఉత్సాహంగా నిర్వహించారు. వేడుకలు హరినామ సంకీర్తనతో ప్రారంభమయ్యాయి. అనంతరం లడ్డూ కృష్ణుడు, రాధాకృష్ణులకు ప్రత్యేక అభిషేక కార్యక్రమం నిర్వహించారు. శ్రీకృష్ణుడి మహిమలను వివరిస్తూ ఆధ్యాత్మిక ప్రవచనాలు నిర్వహించారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు, శ్రీకృష్ణుడు, రాధా తదితర వేషధారణలు, నృత్య ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి. అనంతరం హారతి, పుష్ప సేవ, ఊయల సేవ నిర్వహించడంతో పాటు సంప్రదాయబద్ధంగా ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. చివరగా భక్తులందరికీ ప్రసాద వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమానికి మాజీ చైర్మన్ కస్తూరి నరేందర్, నెక్నాంపూర్ డివిజన్ అధ్యక్షుడు జితేందర్ మెరుగు, మాజీ కౌన్సిలర్లు లక్ష్మీనారాయణ, పురుషోత్తం, సీనియర్ నాయకులు కిరణ్‌కుమార్, తాజ్‌భాయ్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు అల్కాపూర్ టౌన్‌షిప్ ప్రజలకు శ్రీకృష్ణ జన్మాష్టమి శుభాకాంక్షలు తెలిపారు. భక్తి, ఆధ్యాత్మికతతో పాటు సామాజిక ఐక్యతను పెంపొందించేలా వేడుకలను నిర్వహించిన నిర్వాహకులను అభినందించారు. అల్కాపూర్ టౌన్‌షిప్‌కు చెందిన పెద్ద సంఖ్యలో ప్రజలు, భక్తులు వేడుకల్లో పాల్గొని శ్రీకృష్ణ నామస్మరణతో సందడి చేశారు. భక్తుల విశేష భాగస్వామ్యంతో జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

## బాటసింగారం ఉపాధ్యాయుడికి జిల్లా స్థాయి గౌరవం

- **ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు పేరాల వెంకటేశ్వరరావు ఎంపిక..**
- **ఘనంగా అభినందించిన సర్పంచ్, ప్రధానోపాధ్యాయుడు, తోటి ఉపాధ్యాయులు**



**విశాల భారతి , అబ్దుల్లాపూర్ మెట్ :** డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రంగారెడ్డి జిల్లాలో ఉత్తమ సేవలు అందించిన ఉపాధ్యాయులను జిల్లా విద్యాశాఖ అధికారి ఆధ్వర్యంలోని కమిటీ ఎంపిక చేసింది. ఇందులో బాటసింగారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయుడిగా సేవలందిస్తున్న పేరాల వెంకటేశ్వరరావు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు వారి విద్యా ప్రగతికి, పాఠశాల అభివృద్ధికి ఆయన అందించిన సేవలను గుర్తించి ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దాసరి ప్రతాప్ తెలిపారు. జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించడంపై పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో అంకితభావంతో పనిచేసిన ఉపాధ్యాయుడికి ఈ గుర్తింపు దక్కడం పాఠశాలకు గర్వకారణమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ఎర్రవెలి గౌరీశంకరచారి, గ్రామ ప్రజలు, ప్రధానోపాధ్యాయుడు దాసరి ప్రతాప్, తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పేరాల వెంకటేశ్వరరావును ఘనంగా అభినందించారు. ఆయనను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ అవార్డు బాటసింగారం పాఠశాలకు, విద్యార్థులకు మరింత స్ఫూర్తినిచ్చే ఘనతగా నిలిచిందని వారు అన్నారు.

## వెయ్యి రోజుల పాలన.. ఎల్బీనగర్‌లో కాంగ్రెస్ దండయాత్ర!



**విశాల భారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తయిన సందర్భంగా ఎల్బీనగర్ నియోజకవర్గంలో యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి కాంగ్రెస్, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సుమారు వెయ్యి ద్విచక్ర వాహనాలు, వంద కార్లతో సాగిన భారీ ప్రదర్శన నియోజకవర్గంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. జక్కిడి శివచరణ్‌రెడ్డి నివాసం నుంచి ప్రారంభమైన ప్రదర్శన ఎల్బీనగర్ చౌరస్తాకు చేరుకోగా, అక్కడ మహనీయుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మన్సూరాబాద్ చౌరస్తా మీదుగా ఎల్బీనగర్ నియోజకవర్గంలోని మొత్తం 18 డివిజన్ల గుండా ప్రదర్శన కొనసాగింది. కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ప్రదర్శన ముగింపు సందర్భంగా ఎల్బీనగర్ చౌరస్తాలోని రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. భారీ సంఖ్యలో కాంగ్రెస్ శ్రేణులు పాల్గొనడంతో నియోజకవర్గంలో పార్టీ కార్యకర్తల్లో నూతనోత్సాహం నెలకొంది. ఈ సందర్భంగా జక్కిడి శివచరణ్‌రెడ్డి మాట్లాడుతూ. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేస్తూ తెలంగాణను ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దే దిశగా ముందుకు సాగుతోందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకే ఈ భారీ ప్రదర్శన నిర్వహించినట్లు తెలిపారు. ప్రతిపక్ష నేత కేసీఆర్ శాసనసభ సమావేశాలకు హాజరుకాకపోవడాన్ని ఆయన విమర్శించారు. ప్రజా సమస్యలపై శాసనసభలో చర్చించాల్సిన బాధ్యత ఉన్నందున కేసీఆర్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. భారీ ప్రదర్శనకు సహకరించిన వేలాది మంది కాంగ్రెస్, యువజన కాంగ్రెస్ కార్యకర్తలకు, డివిజన్ అధ్యక్షులకు, నాయకులకు జక్కిడి శివచరణ్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

## రాజేంద్రనగర్‌లో బీఆర్ఎస్ విద్యార్థుల మహా ర్యాలీ

- **విద్యార్థుల సమస్యలపై రాజేంద్రనగర్‌లో బీఆర్ఎస్ మహా ర్యాలీ**
- **హామీలు అమలు చేసే వరకు బీఆర్ఎస్ పోరాటం: కార్తీక్‌రెడ్డి**



**రాజేంద్రనగర్, విశాల భారతి :**

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 1000 రోజులు కావస్తున్నా ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన 420 హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారక రామారావు పిలుపు మేరకు, రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి ఆదేశాలతో విద్యార్థుల సమస్యలపై రాజేంద్రనగర్‌లో మహా ర్యాలీ నిర్వహించారు. రాజేంద్రనగర్ అంబేద్కర్ చౌరస్తా నుంచి బుద్వేల్‌లోని బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం వరకు భారీ ర్యాలీ చేపట్టారు. అనంతరం నిర్వహించిన నిరసన కార్యక్రమంలో కార్తీక్‌రెడ్డి, మాజీ శాసనమండలి చైర్మన్ కనకమామిడి స్వామిగౌడ్ పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి ముందు విద్యార్థులు, నిరుద్యోగులకు అనేక హామీలు ఇచ్చిందన్నారు. రాహుల్‌గాంధీతో సమావేశం నిర్వహించి మరీ నిరుద్యోగ డిక్లరేషన్ ప్రకటించారని గుర్తుచేశారు. ముఖ్యంగా విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు వంటి సదుపాయాలను అందిస్తామని హామీ ఇచ్చినా, నేటికీ వాటిని పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. ప్రభుత్వం ఏర్పడి 1000 రోజులు కావస్తున్నా పేద విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు అందని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం వెంటనే పెండింగ్ బకాయిలను విడుదల చేసి, ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలకు, విద్యార్థులకు ఇచ్చిన హామీలను అమలు చేయని కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని, హామీలను అమలు చేసే వరకు ఉద్యమాన్ని ఆపేది లేదని నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్, అత్తాపూర్ సర్కిళ్ల సమన్వయకర్త కోలన్ సుభాష్‌రెడ్డి, ఎస్. వెంకటేష్, కుమార్, నరేందర్ (చిన్ను), కొనమొల్ల శ్రీనివాస్, నాగరాజు, పోయిల జీవన్‌దాస్, ముక్రమ్, జహీరుద్దీన్, నయీమ్ భాయ్, ఎడ్లకాడి సూర్యం, వీర్లపల్లి నవీన్, ఎర్రోళ్ల యాదయ్య, వెంకటరెడ్డి, తిరుపతిరెడ్డి, రాము యాదవ్, రమేష్ ముదిరాజ్, ప్రేమ్, ప్రొ. రవీందర్, బండ్ల నరేందర్ తదితరులు పాల్గొన్నారు. వందలాది మంది బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొని నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## సంక్షేమ పాలనకు వెయ్యి రోజులు
# మరిపెడలో కాంగ్రెస్ జోష్



**మరిపెడ విశాల భారతి:** కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల ప్రజాపాలన పూర్తి చేసుకున్న సందర్భంగా మరిపెడ మున్సిపాలిటీలో శనివారం పార్టీ శ్రేణులు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గుగులోత్ రవి నాయక్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్రనాయక్, టీపీసీసీ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఎండీ అవేజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామచంద్ర నాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేస్తూ సంక్షేమానికి పెద్దపీట వేస్తోందన్నారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, గృహజ్యోతి, కొత్త రేషన్ కార్డులు, సన్నబియ్యం, ఆరోగ్యశ్రీ వంటి పథకాలతో ప్రజలకు ప్రయోజనం కలుగుతోందన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇచ్చిన హామీలను అమలు చేయని బీఆర్ఎస్ నాయకులకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక హక్కు లేదన్నారు. ఎండీ అవేజ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తోందని, బీఆర్ఎస్ నేతలు ముందుగా తమ పాలనపై ప్రజలకు సమాధానం చెప్పాలని అన్నారు. రవి నాయక్ మాట్లాడుతూ ప్రజాపాలనలో ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందుతున్నాయని, మిగిలిన హామీలను కూడా దశలవారీగా అమలు చేస్తామని తెలిపారు. ర్యాలీలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఒంటికొమ్ము యుగంధర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ విశారపు ప్రగతి శ్రీపాల్‌రెడ్డి, టౌన్ అధ్యక్షుడు పాంగోత్ రాంలాల్, కౌన్సిలర్లు, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

**విశాల భారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఎల్.బి.నగర్ పరిధిలోని లెక్చరర్స్ కాలనీ, మన్సూరాబాద్, జీఎస్ఐ డివిజన్లలో నిర్వహించిన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో జక్కిడి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు జక్కిడి రఘువీర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో నిర్వహించిన వేడుకల్లో పాల్గొని శ్రీకృష్ణునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో వేడుకలను నిర్వహించిన యాదవ సోదరులు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, కార్యక్రమ నిర్వాహకులను ఆయన అభినందించారు. శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినం ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు, శాంతి, సౌభాగ్యాలను నింపాలని ఆకాంక్షించారు. శ్రీకృష్ణుడి బోధనలు, ధర్మం, న్యాయం, కర్తవ్యనిష్ఠ ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని జక్కిడి రఘువీర్‌రెడ్డి పేర్కొన్నారు. భక్తి, ఆధ్యాత్మికతతో పండుగలను నిర్వహించడం ద్వారా సమాజంలో ఐక్యత, సోదరభావం మరింత బలపడుతుందని అన్నారు. శ్రీకృష్ణుని దీవెనలు ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక యాదవ సంఘాల ప్రతినిధులు, కాలనీ సంక్షేమ సంఘాల నాయకులు, నిర్వాహకులు, భక్తులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## 22ఏ భూ సమస్యకు పరిష్కారం చూపాలి

- రైతులు, భూ యజమానుల హక్కుల పరిరక్షణ కోసం బీజేపీ మహా దీక్షలో .. పాల్గొన్న మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి




**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** రైతులు, ప్లాట్ యజమానులు, భూ యజమానులు ఎదుర్కొంటున్న 22ఏ భూ సమస్యను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ధర్నా చౌక్, ఇందిరాపార్క్ వద్ద నిర్వహించిన మహా దీక్షలో మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి పాల్గొన్నారు. 22ఏ నిషేధిత జాబితాలో భూములు ఉండటంతో ఏళ్లుగా రిజిస్ట్రేషన్లు, క్రయవిక్రయాలు తదితర అంశాల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులు, ప్లాట్ యజమానులు, భూ యజమానుల సమస్యలను మహా దీక్ష వేదికగా బీజేపీ నాయకులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. అర్హత కలిగిన భూములను 22ఏ జాబితా నుంచి తొలగించి, బాధితులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కళ్లెం నవజీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. భూములపై ఆధారపడి జీవిస్తున్న రైతులు, సామాన్య ప్రజలు 22ఏ నిషేధిత జాబితా కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. అర్హత ఉన్న భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. ప్రజల భూములు, ఆస్తి హక్కుల పరిరక్షణ కోసం బీజేపీ చేస్తున్న పోరాటానికి ప్రతి ఒక్కరూ మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షులు వనపల్లి శ్రీనివాస్ , రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కళ్లెం రవీందర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి భాస్కర్ గౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఉగాది ఎల్లప్ప, హయత్ నగర్ డివిజన్ అధ్యక్షులు గంగాని శ్రీనివాస్ తో పాటు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం విద్యార్థుల గళం

- ఎమ్మెల్యే - పద్మారావు గౌడ్





**సికింద్రాబాద్, విశాల భారతి :** సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ ఆదేశాల మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన బీ ఆర్ఎస్ నాయకులు నిరసన చేపట్టారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపుల్లో జరుగుతున్న జాప్యం, యువతకు ఉద్యోగాల కల్పనలో నిర్లక్ష్యం, ఉద్యోగ క్యాలెండర్ విడుదల చేయకపోవడం తదితర అంశాలకు నిరసనగా బీఆర్ఎస్ విద్యార్థి, యువజన విభాగాల ఆధ్వర్యంలో తార్నాకలోని సంగీ కాలేజీ సమీపంలో యువత, విద్యార్థుల నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా యువత, విద్యార్థులు తమ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, ఉద్యోగ క్యాలెండర్‌ను ప్రకటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు హేమ సామల, సునీత, శైలజ, నాయకులు, మంద జగన్, సరస్వతి, నారాయణ, స్టాలిన్, కృష్ణవేణి, స్మిత, సుమలత, సుజాత, రేణుక, మంజు, సులోచన, సుమతి, చింతకింది మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## వెయ్యి రోజుల ప్రజాపాలన.. అబ్దుల్లాపూర్‌మెట్‌లో కాంగ్రెస్ సంబరాలు




**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్:** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి వెయ్యి రోజులు పూర్తయిన సందర్భంగా అబ్దుల్లాపూర్‌మెట్ మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో శనివారం ఘనంగా విజయోత్సవాలు నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రజాపాలన, సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను కొనియాడుతూ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలోని చౌరస్తా వద్ద కాంగ్రెస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి నాయకత్వం వర్ధిల్లాలని నినాదాలు చేస్తూ విజయోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా అబ్దుల్లాపూర్ మెట్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బింగి దేవదాస్‌గౌడ్ మాట్లాడుతూ.. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కాంగ్రెస్ ప్రభుత్వం పాలన కొనసాగిస్తోందన్నారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ ప్రజలు నిర్బంధాలు, ఆంక్షలతో ఇబ్బందులు ఎదుర్కొన్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు స్వేచ్ఛాయుత వాతావరణాన్ని కల్పిస్తూ ప్రజా ఆకాంక్షలకు అనుగుణంగా పాలనను ముందుకు తీసుకెళ్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంలో పార్టీ శ్రేణులు చురుకుగా పనిచేయాలని ఆయన కోరారు. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి నాయకత్వంలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గ అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని, అబ్దుల్లాపూర్‌మెట్ మండలాన్ని ఆదర్శ మండలంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి పెద్దఎత్తున నిధులు తీసుకురావడంతో పాటు మౌలిక వసతుల కల్పన, సంక్షేమ కార్యక్రమాల అమలుకు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి కృషి చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వం, ఎమ్మెల్యే సమన్వయంతో నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందంజలో నిలిపేందుకు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ మాజీ అధ్యక్షుడు కొత్త ప్రభాకర్‌గౌడ్, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, సర్పంచులు కోట ప్రభాకర్‌రెడ్డి, అల్లే ఐలయ్య యాదవ్, కొలను లక్ష్మీ ప్రసన్న-రవీందర్‌రెడ్డి, పబ్బతి బాలకిషన్‌గౌడ్, మందుగుల విజయశ్రీ-శ్రీశైలం గౌడ్, వెంకటేష్ యాదవ్, ఉపసర్పంచులు జంగారెడ్డి, రాసాల రాము యాదవ్‌తో పాటు పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ ఎస్సీ మోర్చా మహంకాళి సికింద్రాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా అంబాల రాజేశ్వరరావు నియామకం



**సికింద్రాబాద్, విశాల భారతి :** భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా, మహంకాళి సికింద్రాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి గా అంబాల రాజేశ్వరరావు ను నియమిస్తూ జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షులు గడ్డం నవీన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నియామకం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, భారతీయ జనతా పార్టీని, ఎస్సీ మోర్చాను బలోపేతం చేసేందుకు చురుకైన భాగస్వామ్యంతో, కార్యక్రమాలతో కృషి చేస్తా నని అంబాల పేర్కొన్నారు. తన నియామక పై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి, ఎంపీ,డాక్టర్ లక్ష్మణ్ సికింద్రాబాద్ మహంకాళి జిల్లా అధ్యక్షులు గుండగోని భరత్ గౌడ్ లకు అంబాల రాజేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు.

# పేదల బతుకుల్లో 'స్మార్ట్' వెలుగు!

**అర్హులందరికీ రేషన్ కార్డులు..**
**సన్నబియ్యంతో ఆహార భద్రత :**
**ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి**



**విశాల భారతి , అబ్దుల్లాపూర్‌మెట్ :** పేదల బతుకుల్లో భరోసా నింపడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. గత ప్రభుత్వం పేదల సమస్యలను పట్టించుకోకుండా రేషన్ కార్డుల మంజూరును నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హులైన పేద కుటుంబాలకు స్మార్ట్ రేషన్ కార్డులు అందిస్తూ సంక్షేమ ఫలాలను అందిస్తోందని తెలిపారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలోని వైఎస్ఆర్ గార్డెన్స్‌లో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా మల్ రెడ్డి రంగా రెడ్డి మాట్లాడుతూ.. పేద ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. అర్హత ఉన్న ప్రతి పేద కుటుంబానికి రేషన్ కార్డు అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు. పేదల ఆహార భద్రతకు ప్రాధాన్యతనిస్తూ సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని తెలిపారు.

**పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం**

పేద కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరేలా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని ఎమ్మెల్యే అన్నారు. రేషన్ కార్డు ద్వారా అర్హులైన కుటుంబాలకు ఆహార భద్రతతో పాటు పలు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా సంక్షేమ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి, అబ్దుల్లాపూర్‌మెట్ మండల పార్టీ అధ్యక్షుడు బింగి దేవదాస్‌గౌడ్, బాటసింగారం రైతు సహకార సంఘం చైర్మన్ కొత్తపల్లి జైపాల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ బుర్ర రేఖా మహేందర్‌గౌడ్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ భాస్కర చారి, అధికారులు ఎమ్మార్వో సుదర్శన్‌రెడ్డి, ఎంపీడీవో శ్రీవాణి, ఎంపీవో మహమ్మద్ షఫీ ఉల్లాఖాన్, వివిధ గ్రామాల సర్పంచులు పబ్బతి బాలకిషన్‌గౌడ్, అల్లే ఐలయ్య యాదవ్, వెంకటేష్ యాదవ్, కోట ప్రభాకర్‌రెడ్డి, కొలను లక్ష్మీ ప్రసన్న, రవీందర్‌రెడ్డి, మందుగల విజయ శ్రీశైలం గౌడ్, ఉప్పు మాధవి నవీన్, కందికంటి విజయ్, అంతటి హేమలత జంగయ్య, నవనీత మహేష్, గౌరీ శంకర్, రాఘవేందర్ గౌడ్, మేడిపల్లి ప్రియా చంద్ర శేఖర్, ఉపసర్పంచులు జంగారెడ్డి, రాసాల రాము యాదవ్ తో పాటు వివిధ గ్రామాల కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, లబ్ధిదారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి



**అల్కాపూర్ గణేశ్ చౌక్‌లో బీఆర్ఎస్ నాయకుల నిరసన**

**రాజేంద్రనగర్, విశాల భారతి :** సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిని పురస్కరించుకుని జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ మణికొండ, నెక్నంపూర్ డివిజన్ నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు అలకపూర్ గణేశ్ చౌక్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రపంచస్థాయి విద్యా వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం, గత రెండున్నరేళ్లుగా విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను సకాలంలో విడుదల చేయకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం బకాయిలు చెల్లించకపోవడంతో ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. ఫీజు బకాయిల కారణంగా కళాశాలల యాజమాన్యాలు అద్దెలు, విద్యుత్ బిల్లులు, యూనివర్సిటీ ఫీజులు, ఇతర నిర్వహణ ఖర్చులు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నాయని అన్నారు. అధ్యాపకులు, నాన్‌టీచింగ్ సిబ్బందికి నెలల తరబడి జీతాలు అందక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో గతంలో ఉన్న సుమారు 960 ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు ప్రస్తుతం 650కి తగ్గిపోయాయని, ఇదే పరిస్థితి కొనసాగితే మరిన్ని కళాశాలలు మూతపడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. గ్రామీణ ప్రాంతాలు, చిన్న పట్టణాలు, మండలాల్లో ప్రభుత్వ కళాశాలలు పరిమితంగా ఉన్నందున పేద, మధ్యతరగతి విద్యార్థులకు ప్రైవేట్ కళాశాలలే ఉన్నత విద్యకు ప్రధాన ఆధారమని పేర్కొన్నారు. కళాశాలలు మూతపడితే వేలాది మంది విద్యార్థులకు ఉన్నత విద్య దూరమయ్యే పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. బీఆర్ఎస్ మణికొండ, నెక్నంపూర్ డివిజన్ నాయకులు సీతారం ధూళిపాళ, గుట్టమీది నరేందర్, ఉపేంద్రనాథ్ రెడ్డి, అందె లక్ష్మణ్ రావు, షకీలా రెడ్డి, ఆరిఫ్ మహమ్మద్, సుమనళిని, కీర్తిలత గౌడ్, యాలాల కిరణ్, జయరాం, శ్రీధర్, విఠల్, బాబు రావు, రమణ మూర్తి, ప్రసాద్, నరేష్, భాను చందర్, శేఖర్ తదితరులు నిరసనలో పాల్గొన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే స్పందించి ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే విద్యార్థుల సహకారంతో ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## గురువే వెలుగు.. విద్యార్థులే భవిష్యత్తు!



**విశాల భారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** గురువు చూపే మార్గమే విద్యార్థి జీవితానికి బాటలు వేస్తుందనే సందేశంతో బాటసింగారం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులను ఈ సందర్భంగా ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ ఎర్రవెల్లి గౌరీ శంకరాచారి హాజరయ్యారు. ముందుగా భారత మాజీ రాష్ట్రపతి, ప్రముఖ తత్వవేత్త, విద్యావేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులను శాలువాలతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దేది గురువులే ఈ సందర్భంగా సర్పంచ్ ఎర్రవెల్లి గౌరీ శంకరాచారి మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అమూల్యమైనదని అన్నారు. పాఠ్యాంశాల బోధనతో పాటు విద్యార్థుల్లో క్రమశిక్షణ, నైతిక విలువలు, బాధ్యతాయుతమైన ఆలోచనా విధానం, క్రీడా స్ఫూర్తిని పెంపొందించడంలో ఉపాధ్యాయులు చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు. "విద్యార్థి విజయానికి వెనుక గురువు శ్రమ దాగి ఉంటుంది" అని పేర్కొంటూ, సమాజ అభివృద్ధికి విద్యే పునాది అని అన్నారు. ఉపాధ్యాయులను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, వారి సూచనలు, మార్గదర్శకత్వాన్ని పాటిస్తూ విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

**ఆత్మీయంగా గురువులకు అభివందనం**

ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా విద్యార్థులు తమ గురువులకు శుభాకాంక్షలు తెలియజేసి, వారి పట్ల కృతజ్ఞతను వ్యక్తం చేశారు. గురువులను శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు అందజేయడంతో పాఠశాల ప్రాంగణంలో ఆత్మీయ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొని ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను విజయవంతం చేశారు.

## ఘనంగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదిన వేడుకలు

**పాల్వంచ:విశాలభారతి**




పాల్వంచ 'స్టార్ చిల్డ్రన్ హైస్కూల్' లో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా విద్యార్థులు తమకు జ్ఞానాన్ని పంచి, జీవితాలను తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులను పూలు, పండ్లతో ఘనంగా సన్మానించి తమ గురుభక్తిని చాటుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ జి. భాస్కరరావు మరియు ప్రిన్సిపాల్ జి. శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ..."ఉపాధ్యాయుడు కేవలం చదువు చెప్పే వ్యక్తి మాత్రమే కాదని, భావి భారత పౌరుల భవిష్యత్తును తీర్చిదిద్దే నిజమైన శిల్పి" అని అన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఆశయాలను ప్రతి విద్యార్థి ఆదర్శంగా తీసుకోవాలని, గురువు చూపిన బాటలో నడవడం ద్వారానే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని సూచించారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం గొప్ప మానవతా దృక్పథాన్ని చాటుకుంది. నిత్యం పాఠశాల పరిశుభ్రతకు, విద్యార్థుల బాగోగుల కొరకు నిస్వార్థంగా శ్రమిస్తున్న ఆయమ్మల సేవలను గుర్తించి, వారికి చీర, సారెలను అందజేసి ఘనంగా సత్కరించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రతి ఒక్కరిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు మరియు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## పల్లె సమస్యలపై 'పోరుబాట'!

- అనాజ్‌పూర్ గ్రామానికి బీఆర్ఎస్ శ్రేణులు కదలాలి
- ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్దసంఖ్యలో తరలిరావాలి : మండల పార్టీ అధ్యక్షుడు కొత్త కిషన్ గౌడ్



**విశాల భారతి – అబ్దుల్లాపూర్‌మెట్:** కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనలో పల్లెల్లో అభివృద్ధి కుంటుపడిందని, పారిశుధ్య పరిస్థితులు అధ్వానంగా మారాయని ఆరోపిస్తూ బీఆర్ఎస్ పార్టీ చేపడుతున్న పోరుబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అబ్దుల్లాపూర్‌మెట్ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కొత్త కిషన్ గౌడ్ పిలుపునిచ్చారు. మండలంలోని ప్రతి గ్రామం నుంచి స్థానిక ప్రజాప్రతినిధులు, సర్పంచులు, ఉపసర్పంచులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చి కార్యక్రమంలో పాల్గొనాలని ఆహ్వానించారు. బీఆర్ఎస్ పార్టీ చేపడుతున్న పోరుబాటలో భాగంగా ఆదివారం సెప్టెంబర్ 6న ఉదయం 8 గంటలకు అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని అనాజ్‌పూర్‌లో 'పల్లెల విధ్వంసం-పడకేసిన పారిశుధ్యం' అంశంపై కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి రంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి హాజరుకానున్నట్లు వెల్లడించారు.

**ప్రతి గ్రామం నుంచి తరలిరావాలి**

మండల పరిధిలోని అన్ని గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు, స్థానిక ప్రజలు తప్పక పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల పార్టీ అధ్యక్షుడు కోరారు. పల్లెల్లో నెలకొన్న పారిశుధ్య సమస్యలు, అభివృద్ధి లోపాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు చేపడుతున్న ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

**పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవం**

అనంతరం ఉదయం 10:30 గంటలకు ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కేంద్రంలో నూతన బీఆర్ఎస్ పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి సైతం అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు, ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని మండల పార్టీ అధ్యక్షుడు ఆహ్వానించారు.

## పాలకులు హామీలు అమలు చేయకపోతే తగిన మూల్యం తప్పదు

- బి ఆర్ ఎస్ రాష్ట్ర యువ నాయకులు ముఠా జై సింహా




**ముషీరాబాద్,విశాల భారతి:** పాలకులు హామీలు అమలు చేయకపోతే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని బి ఆర్ ఎస్ రాష్ట్ర యువ నాయకులు ముఠా జై సింహా హెచ్చరించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ బి ఆర్ ఎస్ పార్టీ చేపట్టిన పోరుబాట కార్యక్రమంలో భాగంగా శనివారం అశోక్ నగర్ చౌరస్తాలో బారీ నిరసన ప్రదర్శనను నిర్వహించారు. ఈ సందర్భంగా ముఠా జై సింహ మాట్లాడుతూ మహిళలు, యువతకు ఇచ్చిన హామీలను ఎప్పుడూ అమలు చేస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. నిరుద్యోగులకు ఉద్యోగ నోటిఫికేషన్ వేయకుండా కనీసం జాబ్ క్యాలెండర్ విడుదల చేయడం లేదని మండిపడ్డారు.. మహిళల సంక్షేమానికి చర్యలు లేకపోగా, విద్యార్థులకు ఇస్తామన్న స్కూటీల హామీ సైతం అమలుకు నోచుకోవడం లేదన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయడంతో పాటు నిరుద్యోగ భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. హామీల అమలుపై అదికార కాంగ్రెస్ పార్టీ నేతలను నిలదీయాలని పిలుపు ఇచ్చారు. ముచ్చ కుర్తి ప్రభాకర్ సమన్వయంలో జరిగిన కార్యక్రమానికి రాంనగర్ డివిజన్ మాజీ కార్పొరేటేర్ వి శ్రీనివాస్ రెడ్డి, హరిబాబు యాదవ్,అధ్యక్షులు ఎం రాకేష్ కుమార్, శంకర్ ముదిరాజ్, కొండ శ్రీధర్ రెడ్డి, వల్లల్ శ్యామ్ యాదవ్, వై శ్రీనివాస్, బల్ల శ్రీనివాస్ రెడ్డి, కార్యదర్శిలు పోతుల శ్రీకాంత్, అరుణ్ కుమార్, సురేందర్ పాల్గొన్నారు.

## నర్సింగ్ ప్రభుత్వ పాఠశాలలో ట్రాఫిక్ అవగాహన కార్యక్రమం




**రాజేంద్రనగర్, విశాల భారతి :** పై అధికారుల సూచనల మేరకు నర్సింగ్ ప్రభుత్వ పాఠశాలలో ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో ట్రాఫిక్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు భద్రత, హెల్మెట్ వినియోగం, రహదారులపై పాటించాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. రోడ్డుపై ప్రయాణించే సమయంలో ట్రాఫిక్ నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని పోలీసులు సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, వాహనం నడుపుతున్న సమయంలో సెల్‌ఫోన్ వినియోగించకూడదని, వేగంగా వాహనాలు నడపకుండా అప్రమత్తంగా ఉండాలని విద్యార్థులకు వివరించారు. రోడ్డు భద్రతపై చిన్ననాటి నుంచే అవగాహన పెంపొందించుకోవడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎస్ఐలు ఎ. రాజేష్ గౌడ్, గంగ నర్సయ్య, పోలీస్ కానిస్టేబుళ్లు ఇబ్రహీం, మహేష్ పాల్గొని విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు.

## ఫీజు రీయింబర్స్ మెంట్‌పై యువత జాబ్ క్యాలెండర్ పై నిరసన




**సికింద్రాబాద్, విశాల భారతి:** ఫీజు రియంబర్స్మెంట్ పై యువత జాబ్ క్యాలెండర్ పై నిరసన కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ మాజీ జనరల్ సెక్రెటరీ జింకల మల్లేష్ పాల్గొన్నారు.సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు ఆధ్వర్యంలో లాలాపేట్ బ్రిడ్జ్ నుండి తార్నాక చౌరస్తా వరకు యువతతో కలిసి నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



# ‘లెనిన్’ హీరోయిన్‌కు మోహన్‌లాల్ సినిమా ఛాన్స్

ఈ ఏడాది టాలీవుడ్‌లో మంచి విజయాన్ని అందుకున్న సినిమాల్లో ‘లెనిన్’ కూడా ఒకటిగా నిలిచింది. అఖిల్ అక్కినేని, భాగ్యశ్రీ బోర్సే జంటగా నటించిన ఈ చిత్రం ఇద్దరి కెరీర్‌లోనూ కీలకంగా మారింది. చాలాకాలంగా సరైన సక్సెస్ కోసం ఎదురుచూస్తున్న అఖిల్, భాగ్యశ్రీలకు ఈ సినిమా మంచి కంబ్యాక్‌ను అందించింది. ముఖ్యంగా ఈ సినిమాలో భాగ్యశ్రీ బోర్సే తన అందం, నటనతో తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ‘లెనిన్’ తర్వాత ఆమెకు టాలీవుడ్‌లో మరిన్ని అవకాశాలు వస్తాయని భావించిన సమయంలోనే ఈ బ్యూటీ మరో భారీ ప్రాజెక్ట్‌ను సొంతం చేసుకున్నారు. అది కూడా మాలీవుడ్ సీనియర్ స్టార్ హీరో మోహన్‌లాల్ నటిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం కావడం విశేషం.మోహన్‌లాల్ హీరోగా తెరకెక్కనున్న భారీ చిత్రం ‘ఆపరేషన్ గంగ’లో భాగ్యశ్రీ బోర్సే కీలక పాత్రలో నటించనున్నట్లు తాజాగా మేకర్స్ ప్రకటించారు.. ఈ ప్రాజెక్ట్‌లో భాగం కావడం ద్వారా ఆమె మలయాళ సినీ పరిశ్రమలోకి అడుగుపెట్టబోతున్నారు. ఇప్పటికే ‘లెనిన్’తో తెలుగు ప్రేక్షకుల్లో గుర్తింపు తెచ్చుకున్న భాగ్యశ్రీ.. ఇప్పుడు మోహన్‌లాల్ లాంటి సీనియర్ స్టార్‌తో కలిసి నటించే అవకాశం దక్కించుకోవడంతో ఆమె కెరీర్‌కు ఇది మరో కీలక మలుపుగా మారనుంది.అయితే సినిమాలో ఆమె పోషించబోయే పాత్రకు సంబంధించిన పూర్తి వివరాలను మాత్రం మేకర్స్ ఇంకా వెల్లడించలేదు. దీంతో మోహన్‌లాల్‌తో ఆమె స్క్రీన్ షేర్ చేసుకునే విధానం ఎలా ఉంటుంది? ఆమె పాత్ర కథలో ఎంత కీలకంగా ఉండబోతోంది? అనే ఆసక్తి నెలకొంది. ‘ఆపరేషన్ గంగ’ సినిమాను దర్శకుడు విష్ణు మోహన్ తెరకెక్కించనున్నారు. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్‌ను ఓ యదార్ధ సంఘటన ఆధారంగా రూపొందిస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. నిజ జీవితంలో జరిగిన సంఘటనను నేపథ్యంగా తీసుకుని తెరకెక్కుతున్న సినిమా కావడంతో కథపై మొదటి నుంచే ఆసక్తి నెలకొంది. భారీ స్థాయిలో రూపొందించనున్న ఈ చిత్రంలో మోహన్‌లాల్ ఎలాంటి పాత్రలో కనిపించనున్నారు? దర్శకుడు విష్ణు మోహన్ కథను ఏ విధంగా తెరపై ఆవిష్కరించబోతున్నారు? అనేది ఆసక్తికరంగా మారింది. ఈ సినిమాకు సంగీతం కూడా ప్రత్యేక ఆకర్షణగా మారే అవకాశం ఉంది. ‘ధురంధర్’ వంటి భారీ చిత్రానికి సంగీతం అందించిన సస్వత్ సింగ్ సచ్ దేవ్ ‘ఆపరేషన్ గంగ’కు మ్యూజిక్ అందించనున్నట్లు సమాచారం. మొత్తానికి.. ‘లెనిన్’తో సక్సెస్ అందుకున్న భాగ్యశ్రీ బోర్సేకు మోహన్‌లాల్‌తో కలిసి నటించే ఛాన్స్ రావడం ఆమె కెరీర్‌లో మరో బిగ్ మూవ్‌గా మారింది.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.